
ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥150/-
పేజీలు:150
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 240 | ఆదివారం | 22-02-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




# ప్రమాదంలో విద్యారంగం

## నూతన రాష్ట్ర కౌన్సిల్



నిజామాబాద్‌లో మూడు రోజుల పాటు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగగా మహాసభ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించింది. రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్, ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రహమాన్, గ్యార క్రాంతి, సోతుకు ప్రవీణ్, బాలసాని లెనిన్, సహాయ కార్యదర్శులుగా ఇటిక్యాల రామకృష్ణ, బానోత్ రఘు రాం, గ్యార నరేష్, చిట్యాల రాజు, కోశాధికారిగా కాసోజు నాగ జ్యోతిలతో పాటు నూతన కౌన్సిల్ సభ్యులుగా 69 మంది ఆహ్వానితులుగా నలుగురు మొత్తం 73మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం
- కేంద్ర బడ్జెట్ విద్యార్థి వ్యతిరేక బడ్జెట్
- ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్
- విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు
- ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం/నిజామాబాద్

జాతీయ ఉద్యమ ఆకాంక్షలకు, రాజ్యాంగానికి ఫెడరల్ సూత్రాలకు, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం 2020 వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన 2025 బిల్లు లోపాల పుట్ట అని ఎఐఎస్‌ఎఫ్ మండిపడింది. నూతన విధానాలతో విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తూ అత్యంత ప్రమాదంలో విద్యారంగాన్ని నెట్టారని, విద్యార్థి లోకం దీనిని తిరస్కరించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని, విద్యారంగ సమస్యలపై ఎఐఎస్ఎఫ్ సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తుందని, కేంద్ర బడ్జెట్ విద్యార్థి వ్యతిరేక బడ్జెట్, అని వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి తరువాయి 2లో

# 3 లక్షల ఇండ్లివ్వండి

- ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి
- రాష్ట్రంలో 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడి
- గత ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి తరువాయి 2లో

# ఈ నెలాఖరు వరకూ పత్తి కొనుగోళ్లు

- సిసిఐ అంగీకరించినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి
- పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా ఈనెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అంగీకరించినట్టు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్ , టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకుని రైతులు సమీపంలోని సిసిఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకురావాలని, మద్దతు ధరకు విక్రయించుకోవాలని తరువాయి 2లో



## ఆస్ట్రేలియా గడ్డపై

# గర్జించిన భారత్..

### మంధాన, శ్రేయాంక జోరుతో పొట్టి సిరీస్ కైవసం

ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై ఓడించడం ఏ జట్టుకైనా సవాలే. ప్రపంచంలోనే మేటి జట్టైన ఆసీస్‌ను భారత మహిళల జట్టు చిత్తుగా ఓడించింది. అడిలైడ్‌లో 17 పరుగులతో గెలిచి పొట్టి సిరీస్ కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో స్మృతి మంధాన(82), జెమీమా రోడ్రిగ్స్(59)ల విధ్వంసంతో ఆసీస్‌కు సవాల్ విసిరిన టీమిండియాకు ఆతిథ్య జట్టు బదులివ్వలేకపోయింది. అష్లే గార్డ్‌నర్ (57) అర్ధ శతకంతో రాణించినా శ్రేయాంక పాటిల్(322) వికెట్ల వేటతో దెబ్బతీసింది. ఫలితంగా భారీ ఛేదనలో 159కే పరిమితమైన కంగారూ టీమ్ సిరీస్ కోల్పోయింది. వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా విదేశీ పర్యటనలో తొలి సీరస్ గెలుపొందింది భారత జట్టు. ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు టీ20 సిరీస్‌లో పంజా విసిరింది. తొలి పోరులోనే ఆసీస్‌కు షాకిచ్చిన టీమిండియా.. రెండో మ్యాచ్‌ను చేజేతులా వదిలేసింది. అయితే.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆల్‌రౌండ షోతో అదరగొట్టింది. ఓపెనర్ స్మృతి మంధాన(82) అంతర్జాతీయ క్రికెట్‌లో 70వ అర్ధ తరువాయి 12లో

# ఏ కోటా లేదు

- కాంగ్రెస్‌లో ఉన్నది మెరిట్ కోటా మాత్రమే
- అందులో ఉత్తీర్ణులైన వారికే అవకాశాలు
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి రాజకీయ జీవితానికి తొలిమెట్టు
- పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమే
- అత్మలాంటి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని బిజెపి కుట్ర చేస్తోంది
- డిసిసి అధ్యక్షుల శిక్షణ తరగతుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




### కాంగ్రెస్ తర్వాత వందేళ్ల చరిత్ర సిపిఐదే

కాంగ్రెస్‌తో పోటీపడుతున్న ప్రస్తుత ఏ రాజకీయ పార్టీ కూడా స్వాతంత్ర్యం కంటే ముందు పుట్టలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీతో పాటు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ ఒక సిపిఐకే ఉంది. 140 కోట్ల జనాభాకు ఒక స్ఫూర్తిగా, దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీగా, కాంగ్రెస్ దేశానికి దిక్సూచిగా ఉంది.

– సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఏం చేసినా ఎవ్వరూ చూడడం లేదని.. ఏవరో ఒక్క నాయకుడిని పట్టుకుంటే ఆ కోటాలోనో, ఈ కోటాలోనో ఎంఎల్ఎ టికెట్ వస్తుందని అనుకుంటున్నారు.. ఇక ఏ కోటాలు లేవు. కాంగ్రెస్‌లో మెరిట్ కోటా మాత్రమే ఉంది.. మెరిట్‌లో ఉత్తీర్ణులైన వారికే అవకాశాలు దక్కుతాయ్.. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి రాజకీయ జీవితానికి తొలి మెట్టు లాంటిది.. దీని ద్వారా సిఎంగా, మంత్రిగా, తరువాయి 2లో

## యుఎస్, భారత్ వాణిజ్య ఒప్పందం

# దేశానికి అగ్నిపరీక్ష

- ట్రేడ్ డీల్‌లో ప్రధాని మోదీ ద్రోహం బయపడింది
- ట్రంప్‌కు మళ్లీ లొంగిపోతారు
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలకు విధించిన సుంకాలను యుఎస్ సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీ పడ్డారని ఆరోపించారు. భారత్–అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో ఆయన ద్రోహం బయటపడిందన్నారు. ప్రధాని నిరాశ, లొంగిపోవడం ద్వారా ప్రభావితమైన దేశానికి వాణిజ్య ఒప్పందం అగ్ని పరీక్షగా మారిందని కాంగ్రెస్ ఆరోపించింది. 'ప్రధాని రాజీ పడ్డారు. అతని ద్రోహం ఇప్పుడు బయటపడింది. అతను తిరిగి చర్చలు జరపలేదు. అతను మళ్ళీ లొంగిపోతాడు' అని రాహుల్‌గాంధీ శనివారం (ఎక్స్)లో పోస్టు చేశారు. ప్రధాని మోదీ తన పేలవ ప్రతిష్టను కాపాడుకోవడానికి దృఢంగా నిలబపడి తరువాయి 12లో






# మహిళా సంఘాలతో భాగస్వాములుగా మారండి

### బ్యాంకర్లకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సూచన

- 'లక్ పతి దీదీ' కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరుస్తున్నామని వ్యాఖ్య
- మహిళల ఆర్థిక వృద్ధితోనే దేశ ప్రగతి : మంత్రి సీతక్క
- హైదరాబాద్‌లో ఘనంగా జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సు

ప్రజాపక్షం/హైదరాబాద్

బ్యాంకర్లు కేవలం రుణదాతలుగా కాకుండా స్వయం సహాయక మహిళా సంఘాలతో భాగస్వాములుగా మారాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. దేశవ్యాప్తంగా 'లక్ పతి దీదీ' కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరుస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారని, తదుపరి లక్ష్యం మరింత విస్తరణేనని చెప్పారు. హైదరాబాద్ హోటల్ కాకతీయలో జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సు, 25వ కేంద్ర స్థాయి సమన్వయ కమిటీ (సిఎల్‌సిసి) సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా, సహాయ మంత్రి పెమ్మసాని తరువాయి 2లో



# ఆలయాలే లక్ష్యంగా దాడికి లష్కరే కుట్ర

### నిఘా వర్గాల హెచ్చరిక, ఢిల్లీలో హైఅలర్ట్

న్యూఢిల్లీ : ఢిల్లీలోని కీలకమైన మతపరమైన, వారసత్వ ప్రదేశాలు, ఎర్రకోట చుట్టుపక్కల ప్రాంతాలు, చాందినీ చౌక్‌లోని కొన్ని ప్రాంతాలలో శనివారం భద్రతను కట్టుదిట్టం చేసినట్లు ఒక అధికారి తెలిపారు. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) భారతదేశంలోని ప్రముఖ మతపరమైన ప్రదేశాలను తమ లక్ష్యంగా చేసుకుందని కేంద్ర నిఘా వర్గాలు సూచించాయి. దీంతో ప్రధాన పర్యాటక ప్రదేశం, తరువాయి 12లో



## వ్యవసాయ శాఖ ఎడి ఇంట్లో

# ఎసిబి సోదాలు

### ఏకకాలంలో నాగర్‌కర్నూల్, సూర్యాపేట జిల్లాల్లో కిరణ్ కుమార్, ఆయన బంధువుల ఇళ్లలో దాడులు

ప్రజాపక్షం/సూర్యాపేట/కల్వకుర్తి

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుందరి కిరణ్ కుమార్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని అందిన ఫిర్యాదు మేరకు శనివారం ఏసిబి అధికారులు తన సొంత గ్రామమైన సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో ఉన్న ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇతను గతంలో సూర్యాపేట జిల్లా డిఆర్‌డిఏ పిడిగా పనిచేశారు.బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో అంటకాగి అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు అనేకం తరువాయి 12లో

## బీబీనగర్ ఎయిమ్స్‌కు

# 'కార్పొరేట్' గ్రహణం?




- కేంద్ర మంత్రుల పర్యవేక్షణ లోపం.. నత్తనడకన పనులు
- ప్రైవేటు ఆస్పత్రుల ఒత్తిడితోనే జాప్యమా?
- పూర్తిస్థాయి సేవలు అందక రోగుల అవస్థలు

ప్రజాపక్షం/యాదాద్రి

తెలంగాణ ప్రజలకు సంజీవనిగా మారాల్సిన బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణం అంతులేని జాప్యంతో అస్తవ్యస్తంగా మారింది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పట్ల వారి నిర్ల క్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పనులు నత్తనడకన సాగుతుండటం వెనుక హైదరాబాద్‌లోని బడా కార్పొరేట్ ఆస్పత్రుల 'మాఫియా' ఒత్తిడి ఉందా? అన్న అనుమానాలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2018 లోనే ఈ ప్రాజెక్టును మంజూరు చేసినా, నేటికీ భవన నిర్మాణా లు పూర్తికాకపోవడం పాలకుల వైఫల్యానికి అద్దం పడుతోంది. ఇటీవల జరిగిన ఇన్స్టిట్యూషన్ బాడీ సమావేశంలో పనుల తీరును పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చా యి. క్షేత్రస్థాయిలో ఉండాల్సిన సిబ్బందిలో కేవలం 50 శాతం మందితోనే కాంట్రాక్టర్లు పనులు కానిచ్చేస్తున్నారు. 2025 అక్టోబర్ నాటికే పూర్తి కావాల్సిన పనులు, ఇప్పుడు 2026 జూలైకి నెట్టబడ్డాయి. ఈ ఏడాదిన్నర కాలం అదనపు జాప్యం ఎవరి ప్రయోజనం కోసం? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హైదరాబాద్ శివార్లలోని బీబీనగర్‌లో ఎయిమ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచే కాక రాజధాని నగరం నుంచి కూడా రోగులు ఇక్కడికే వస్తారు. 'అత్యాధునిక వైద్యం ఉచితంగా అందితే కార్పొరేట్ ఆస్పత్రుల దందా దెబ్బతింటుందనే ఉద్దేశంతోనే, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పనులను అడ్డుకుంటున్నారా?' అని స్థానిక తరువాయి 2లో

# టారిఫ్‌లను మళ్లీ 15 శాతానికి పెంచిన ట్రంప్

**భారత్, బ్రిటన్, యూరోపియన్ యూనియన్‌పై తక్షణం అమలు**

**పాత ఉత్తర్వుల కింద 130 బిలియన్ డాలర్ల టారిఫ్‌లు వసూలుచేసిన అమెరికా**



**వాషింగ్టన్:** ట్రంప్ టారిఫ్‌లను 10 నుంచి 15 శాతానికి పెంచారు. పాతకాలపు చట్టాన్ని అడ్డంపెట్టుకుని ప్రపంచదేశాలపై ఎడాపెడా విధించిన దిగుమతి సుంకాలు చెల్లుబాటు కావంటూ అమెరికా సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు చెప్పిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాటిస్థానంలో కొత్తగా 150 రోజుల కాలం అమలులో ఉండే విధంగా ప్రపంచదేశాలపై 10 శాతం సుంకాలను తెరమీదకు తెచ్చారు. ఈ సుంకాలు ఫిబ్రవరి 24వ తేదీ (తెల్లవారుజామునుండి అర్ధరాత్రి 12 గంటల నుండి) నుండి అంటే మంగళవారం అమలులోకి వస్తాయని చెప్పారు. కానీ మళ్లీ శనివారం పొద్దుపోయాక ట్రూత్ సోషల్ మీడియా ద్వారా ప్రకటన చేస్తూ సుంకాలను 10 నుంచి 15 శాతానికి పెంచామని, తక్షణం అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. భారత్, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలకు ఇవి అమలులోకి వస్తాయి. ఇక మెక్సికో, కెనడాలకు మాత్రం ఉత్తర అమెరికా స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (యుఎస్‌ఎంసిఎ) కింద మినహాయింపు కొనసాగుతుంది. గతంలో ఎన్నడూ ఉపయోగించని సెక్షన్ 122ను ఉపయోగించి ఈ 15శాతం సుంకాలను అమలులోకి తెచ్చారు. కొన్ని ఖనిజాలు, ప్రకృతి వనరులు, ఎరువులు, కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు, బీఫ్, కొన్ని ఎలక్ట్రానిక్స్, కొన్ని ఫార్మాస్యూటికల్స్, కొన్ని వాహనాలకు వీటి నుండి మినహాయింపు ఉంటుంది. ఈ సెక్షన్ కింద 150 రోజులపాటు 15 శాతం మేరకు సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అవకాశం ఉంది. కానీ ట్రంప్ మొదట 10 శాతం చేసి 24గంటలలోనే 15శాతానికి పెంచారు. క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే ఈ నిర్ణయం తీసుకున్నా మన్నారు. చట్టపరమైన పోరాటం లేకుండా వాపసులు వచ్చే అవకాశం లేదని కూడా అన్నారు. కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ పాత సుంకాలను కొనసాగించేందుకు వీలుగా ఇతర చట్టాలను, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తామని ప్రకటించారు. ఈ సుంకాలు అమెరికాలో పెట్టుబడులను, తయారీ సంపదను పెంపొందిస్తాయని, అందువల్ల మాకు ప్రత్యామ్నాయాలున్నాయని, వాటికి బలంగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇన్నాళ్ళుగా వసూలు చేసిన సుంకాలు చెల్లుబాటు కావని, అలాంటి అపరిమిత అధికారాలు దేశాధ్యక్షుడికి లేవని తీర్పునిచ్చిన న్యాయమూర్తులను 'మూర్ఖులు' అని విమర్శించారు. సుంకాల ద్వారా కోశాగారాన్ని ధనంతో నింపానని, దేశాన్ని ఆర్థిక తిరోగమనం నుండి కాపాడానని అన్నారు. ఈ తీర్పు భయంకరమైనదని అన్నారు. గత ఏడాది ప్రపంచ వాణిజ్యాన్ని అతలాకుతలం చేస్తూ దేశాలమధ్య సంబంధాలను కేవలం వాణిజ్య సంబంధాలుగా ట్రంప్ మార్చేసిన తర్వాత ఈ తీర్పుకోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తూ వచ్చారు. మొదట మెక్సికో, కెనడా, చైనాలపై గురిపెట్టిన ట్రంప్, విముక్తి దినోత్సవంగా దీనిని అభివర్ణించిన తర్వాత సుంకాలు నాటకీయస్థాయిలో అన్నిదేశాలకూ విస్తరించాయి. సుంకాలు పెంచడం,వాటిల్లో కొంత తగ్గించడం, కొన్ని వందల బిలియన్ డాలర్లు అమెరికాలో పెట్టుబడులుపెట్టించే ఒప్పందాలు చేసుకోవడం ట్రంప్ వ్యూహం గా మారింది. వాణిజ్యాన్ని నియంత్రించడంకోసం తెరమీదకు తెచ్చిన అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఇఇపి)కింద ట్రంప్ 'సుంకాలు' అనే పదాన్ని ఉపయోగించలేదని అనేక రాష్ట్రాలు, చిన్న వ్యాపారాల తరఫున న్యాయవాదులు సుప్రీంకోర్టు ఎదుట వాదించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎలాంటి నిర్ణయాలు చేయాలన్నా చట్టసభ కాంగ్రెస్ తీర్మానాలు ఉండాలని, కానీ ఈ విషయంలో ట్రంప్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని వారు వాదించారు. 45 ఏళ్ళ క్రితంనాటి చట్ట ప్రకారం చూసినా కూడా దేశాధ్యక్షుడు తన పరిధి దాటి మితిమీరి ప్రవర్తించారని న్యాయమూర్తులు శుక్రవారం 6:3 తేడాతో మెజారిటీ ప్రాతిపదికపై ప్రజాస్వామ్యబద్ధంగా ప్రకటించిన తీర్పు ను ట్రంప్ వ్యతిరేకించారు. మరోవైపు ఇన్నాళ్ళుగా పెంచిన సుంకాలు చెల్లిస్తున్న దేశాలు కూడా ఈ తీర్పును పెద్ద ఉపశమనంగా భావిస్తున్నాయి. సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రపంచవాణిజ్య వ్యవస్థలో ఒక పెద్ద అనిశ్చితిని కూడా సృష్టించింది. పలుదేశాలు తమకు ఎంత సొమ్ము ఇంకా తిరిగి వస్తుందో? అని లెక్కలు వేసుకుంటున్నాయి. తీర్పు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక ఉపశమనంగా ఉపయోగపడుతుందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు చెల్లించిన టారిఫ్‌లను తిరిగి ఇస్తారా? సర్దుబాట్లు చేస్తారా? లేక కొత్త వంకలతో సుంకాలను కొనసాగిస్తారా? అని దేశాలు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఫండ్ టారిఫ్‌లు అక్రమం అని అమెరికా సుప్రీంకోర్ట్ న్యాయమూర్తులు జాన్ రాబర్ట్, నెయిల్ గోర్సచ్, అమీకోనీ బారెట్, సోనియా సోటోమేయర్, ఎలినా కగన్, కెటన్జీ బ్రౌన్ జాక్సన్‌లు ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్పు చెప్పారు. మిగ్గురు న్యాయమూర్తులు సమర్థించారు. యూరోపియన్ కమిషన్ అధికార ప్రతినిధి ఓలాఫ్ గిల్ మాట్లాడుతూ, తీర్పువల్ల ప్రయోజనాలను అంచనావేస్తున్నామన్నారు. బంగ్లాదేశ్ సహా పలుదేశాలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఐఇఇపి చట్టా న్ని అడ్డంపెట్టుకుని ట్రంప్ యంత్రాంగం ఇప్పటికే 130 బిలియన్ డాలర్లు ప్రపంచ దేశాల నుండి టారిఫ్‌లుగా వసూలు చేసిందని తాజా గణాంకాలు చెబుతున్నాయి.

# స్తంభించిన అణుచర్చలు:పెరిగిన ఉద్రిక్తతలు

**పరిమిత దాడికి సిద్ధపడుతున్న ట్రంప్**




**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య అణు చర్చలు పురోగతి లేకుండా స్తంభించిపోయాయి. దీంతో పశ్చిమ ఆసియాలో తీవ్ర ఉద్రిక్తత, ఉత్కంఠ పరిస్థితి నెలకుంది. ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకు పరిమిత స్థాయిలో దాడులు చేయడానికి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సన్నద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ జలాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకుని ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధ విమానవాహకనౌక యుఎస్‌ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌ను అట్లాంటిక్ సముద్రంలో ఇరాన్‌కు 500 కి.మీ దూరంలో ఉంది. ఖలీఫా బిన్ సాల్మన్‌పోర్టులో (బహ్రైన్) విధ్వంసకర ఆయుధాలు, యుద్ధనౌకలు మోహరించి ఉన్నాయి. ఆరేబియా సముద్రంలో అబ్రహాంలింకన్ యుద్ధవిమానాల వాహకనౌక మోహరించి ఉంది. ఎర్ర సముద్రంలో అమెరికా డెల్‌బెర్ట్ డీ బ్లాక్ విధ్వంసక ఆయుధాలను మోహరించారు. ఇరాన్ కూడా తన జల్లాల్లో సైనిక దళాల ఉనికి గణనీయంగా పెంచిందని ఉపగ్రహ చిత్రాలు చెబుతున్నాయి. అమెరికా గనుక దాడి చేస్తే ఎదురు దాడులు చేసి తీరతామని మరోవైపు తమ సర్వాధినేత అయొతొల్లా అలీ ఖమేనీ హెచ్చరికలు చేస్తున్నట్లు ఇరాన్ వర్గాలు శనివారం తాజా ప్రకటనలో పేర్కొన్నాయి. ఇరాన్ కూడా సైనిక దళాలను మోహరిస్తున్నది. ఇరాన్ అణు కార్యక్రమం చేపట్టకుండా నివారించేందుకు ఒప్పందానికి అంగీకరించేలా ఒత్తిడి చేయడం కోసం పరిమితస్థాయిలో దాడి చేసే విషయం పరిశీలిస్తున్నట్లు డోనాల్డ్ ట్రంప్ శనివారం ప్రకటించారు. ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని అమెరికా అధికారులు ప్రకటించిన కొద్ది గంటలకు పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు ట్రంప్ పైవిధంగా సమాధానం చెప్పారు. గడచిన వారం రోజులుగా పాత్రికేయులు పశ్చిమాసియా సమస్యపై ట్రంప్‌ను అడిగిన అనేక ప్రశ్నల్లో పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశారు.

ఇరాన్ తమతో ఒప్పందం చేసుకుంటుందా? లేదా? అమెరికా దాడులు చేస్తుందా? అనే విషయంపై రాబోయే పది రోజుల్లో ఒక స్పష్టత వస్తుందని గడచిన గురువారం ట్రంప్ పాత్రికేయులతో చెప్పారు. 'ఇరాన్‌పై దాడకి బలమైన అవకాశాలున్నాయా?' అని ఒక పాత్రికేయుడు ఆయనను అడ్డుకుని నిలదీసినప్పుడు, 'ఈ విషయంపై మాట్లాడటానికి నేను సిద్ధంగా లేను, నయానో–భయానో ఇరాన్‌తో ఒప్పందం చేసుకుంటాం' అని ట్రంప్ అన్నారు. అదేసమయంలో రెండు రోజులముందు ట్రంప్ నోటి వెంట ఇజ్రాయెల్ చేసే దాడులకు అమెరికా పరోక్ష సహాయం చేస్తుందని, నేరుగా యుద్ధంలో పాల్గొనే అవకాశం లేదని అన్నారు. కానీ గత ఏడాది జులైలో ఇరాన్‌పై 'ఆపరేషన్ మిడ్ నైట్ హేమర్' చేయడానికి ముందుగా కూడా 'ఇరాన్‌తో ఒప్పందానికే తాము ప్రాధాన్యత ఇస్తున్నాం' అని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఈ పూర్వరంగంలో వెనుక నిలబడి ఇజ్రాయెల్ ద్వారా యుద్ధం నడిపించి ఇరాన్‌ను లొంగదీసుకునే యోచనకూడా ఆయన చేస్తున్నారు. మొత్తానికి ఇరాన్‌ను తమకు అనుకూలంగా లొంగదీసుకోవడానికి బెదిరింపులనే ఆయన ప్రధాన ఆయుధంగా వాడుతున్నారు. ఇప్పటికే ఇరాన్‌కు వందల కి.మీ సమీపంలో భారీ ఎత్తున అమెరికా దళాలను మోహరించగా, ఇజ్రాయెల్ కూడా అందుకు అనుగుణంగా యుద్ధ సన్నాహాలు చేస్తోంది. ఇదేసమయంలో యూరప్ దేశాలు కూడా ఇరాన్‌పై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్ పదే పదే తిరస్కరిస్తున్నప్పటికీ, అణ్వాయుధాలను అభివృద్ధి చేసేదిశగా ఇరాన్ ముందుకే వెళుతోందితప్ప వెనక్కి తగ్గడంలేదని యూరప్ దేశాలు గట్టిగా భావిస్తున్నాయని పాశ్చాత్య పత్రికలు వెల్లడించాయి.

**రెండు రోజుల్లో ముసాయిదాపత్రం సిద్ధం**

అమెరికా గనుక దాడులు చేస్తే చూస్తూ కూర్చోబోమని, తిరిగి దాడులు చేస్తామని ఇరాన్ శనివారం ప్రకటించింది. దేశ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఇంతకుముందు శుక్రవారం జెనీవా చర్చల గురించి మాట్లాడుతూ, రాబోయే రెండు, మూడు రోజుల్లో జెనీవా చర్చల ముసాయిదా పత్రం సిద్ధం అవుతుందని, ఈ పత్రాన్ని పశ్చిమ ఆసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్‌కు అందజేస్తామని కూడా చెప్పారు. చర్చల సందర్భంగా ఇరాన్‌లో యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని శూన్యస్థాయికి తీసుకురావాలని అమెరికా ప్రతిపాదించలేదని అన్నారు. ఒకవైపు ఇరాన్ పరిసర జలాల్లో అమెరికా తన సైనిక పాటవాన్ని, ఉనికినీ పెంచుకుంటూనే మరోవైపు జెనీవాల్లో చర్చలు కొనసాగించింది. విధ్వంసక ఆయుధాలు, యుద్ధనౌకలు, యుద్ధ విమానాల సంఖ్య ఈ ప్రాంతంలో క్రమంగా పెరుగుతోంది.

## పత్తి కొనుగోళ్లు

**(మొదటి పేజీ తరువాయి)**

కోరారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యతగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి, సిసిఐ దృష్టికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించిందని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవ్వడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయని, ఈ వాస్తవ పరిస్థితులను కేంద్రానికి వివరిస్తూ, కొనుగోళ్ల గడువును పొడిగించాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా ఉన్నదని, ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సిసిఐ కొనుగోలు చేసిందని, అలాగే మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కూడా కోనుగోలు చేశారని తుమ్మల నాగేశ్వర్ రావు వివరించారు. అయినప్పటికీ మార్కెటింగ్ అధికారుల అంచనా ప్రకారం రాష్ట్రంలో మరో 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందన్నారు. యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలిగిందని, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందని అన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సిసిఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్నదని, అందుకే మరో 30 రోజులు పాటు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సిసిఐని కోరారు. రాష్ట్రంలోని ప్రతి పత్తి రైతు తన పంటను పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులో పెట్టాలన్నారు. ఈ విషయమై సిసిఐ సిఎండి లలిత్ కుమార్ గుప్తా,కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్‌కు వ్యవసాయశాఖ కార్యదర్శి లేఖ రాసినట్టు వివరించారు.

## కంపా సమావేశం.. రూ.367.59 కోట్ల వార్షిక ప్రణాళికకు ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ తెలంగాణ రాష్ట్ర పరిహార అటవీకరణ నిధి నిర్వహణ , ప్రణాళిక అథారిటీ (కంపా) కార్యనిర్వాహక కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో జరిగింది. అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సి. సువర్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికపై సమగ్ర చర్చ అనంతరం రూ. 367.59 కోట్ల వ్యయానికి కమిటీ ఆమోదం తెలిపింది. అటవీకరణ కార్యక్రమాలు, అటవీ రక్షణ చర్యలు, నేలతేమ సంరక్షణ (ఎస్ఎంసి) పనులు, వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధి, టైగర్ రిజర్వుల కోర్ ప్రాంతాల నుంచి గ్రామాల స్వచ్ఛంద పునరావాసం వంటి కీలక కార్యక్రమాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో మెంబర్ సెక్రటరీ ఎన్. క్షితిజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పర్యావరణ, ఆర్థిక, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రెవెన్యూ, గిరిజన సంక్షేమ తదితర శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంపుతో పాటు పర్యావరణ సమతుల్యత సాధనకు ఈ నిర్ణయాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిసిఎఫ్‌లు వినయ్ కుమార్, రత్నాకర్ జౌహారీ, సిసిఎఫ్ అడ్మిన్ ఎస్.జె. ఆశా తదితరులు కూడా పాల్గొన్నారు.

## భాగస్వాములుగా మారండి

**(మొదటి పేజీ తరువాయి)**

చంద్రశేఖర్, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులు, అన్ని రాష్ట్రాల ప్రతినిధులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో ఏలాంటి రాజకీయాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. మహిళల అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సీతక్క ప్రసంగించడం అభినందనీయమన్నారు. ఢిల్లీ, హైదరాబాద్ కలిసి పని చేయాలని, తెలంగాణతో ఎటువంటి వివక్ష ఉండదని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర కేంద్ర సహకారం భారత పురోగతికి అవసరమన్నారు. దేశ అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కనపెట్టి తెలంగాణ ప్రభుత్వం కలిసి వస్తుందని, అందుకు తెలంగాణ సిఎంకు, మంత్రి సీతక్కను అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క స్వరంలో మహిళా సాధికారత ప్రతిధ్వనించిందని కితాబిచ్చారు.

**మహిళల ఆర్థిక వృద్ధితోనే దేశ ప్రగతి : మంత్రి సీతక్క**

మహిళా సాధికారతే దేశ ప్రగతికి పునాది అని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా 'సంపద సృష్టికర్తలు'గా మారుస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లలో స్వయం సహాయక సంఘాలకు రూ. 35,435 కోట్ల రుణాలు అందించామని, ఎన్‌పిఏ కేవలం 1.40 శాతంగా ఉండటం మహిళల క్రమశిక్షణకు నిదర్శనమని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా ఆర్‌టిసి బస్సుల నిర్వహణ, సోలార్ ప్లాంట్‌లు, కమ్యూనిటీ క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలతో స్థిర ఆదాయం కల్పిస్తున్నామని వివరించారు.

**కేంద్రానికి మంత్రి సీతక్క విన్నపాలు..**

మంత్రి సీతక్క కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు వినతి పత్రాలను అందచేశారు. పంచాయతీ ఎన్నికలు పూర్తైన నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్‌లకు ఇచ్చే రాయితీల గడువును పొడిగించాలని కోరారు. అనంతరం కేంద్ర మంత్రులను తెలంగాణ చేనేత శాలువాలతో సత్కరించి, మహిళా సంఘాలు తయారు చేసిన కానుకలను మంత్రి సీతక్క అందజేశారు.

## 'కార్పొరేట్' గ్రహణం?

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రజలు నిలదీస్తున్నారు. ప్రైవేటు లాబీయింగ్‌కు తలొగ్గి కేంద్ర మంత్రులు ఈ ప్రాజెక్టుపై కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అరకొర వసతులు.. రోగుల కష్టాలు**

లక్షలాది మందికి సేవలు అందించాల్సిన చోట కనీస వసతులు కూడా కరువయ్యాయి. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ మిషన్లు ఏమాత్రం సరిపోవడం లేదు. తక్షణమే మరో 25 కొత్త మిషన్లు ఏర్పాటు చేయాలని ఇన్స్టిట్యూట్ 6వ బాడీ సమావేశంలో భువనగిరి ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేయడం గమన్నారహం.

**ఉద్యోగాలూ 'పరాయి'కేనా?:**

ఇక్కడి భూములు ఇచ్చిన స్థానికులకు కాకుండా, ఇతర ప్రాంతాల వారికే నియామకాల్లో పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు సిబ్బంది నియామకం అడ్డగోలుగా చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. కనీసం 25 శాతం ఉద్యోగ కోటా స్థానికులకు ఇవ్వాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

**ఎప్పటికి పూర్తయ్యేనో...?**

రూ.1,365 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుపై కేంద్రం సమీక్షలు కేవలం 'కాగితాల'కే పరిమితమవుతున్నాయి. నత్తకు నడక నేర్పుతున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులపై ఉంది. ఇప్పటికైనా 'యుద్ధ ప్రాతిపదికన' పనులు పూర్తి చేయకుంటే, ఎయిమ్స్ కేవలం ఒక అందమైన కట్టడంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

**కేంద్ర వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది: ఎంపి చామల**



నిర్ణీత గడువులోగా ఎయిమ్స్ పనులు పూర్తి చేయడంలో కేంద్రం వైఫల్యం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నది. కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనకడుగు వేస్తుందో అర్థం కావడం లేదు. ఇంకా రోగుల కోసం చాలా వసతులు, సంపూర్ణ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని పలుమార్లు పార్లమెంట్లో ప్రశ్నించాను. భూ నిర్వాసితులకు స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ కూడా ఉంది. స్థానికులకు ఉద్యోగాలు ఇప్పించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను అన్నారు.

## ఇండ్లివ్వండి

**(మొదటి పేజీ తరువాయి)**

శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, కేంద్రానికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాలకు కనీసం 3 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని పొంగులేటి కోరారు. అలాగే వచ్చే ఏడాది మరో 2 లక్షల ఇళ్లను కేటాయించాలన్నారు. గతంలో తెలంగాణ 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ' (పిఎంఎవై జి) 1.0లో భాగస్వామ్యం కాలేదని, అయితే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం పిఎంఎవై జి 1.0లో అధికారికంగా చేరినట్లు తెలిపారు.

**రాష్ట్రంలో 11.57 లక్షల అర్హులు..**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే, 'ఆవాస్+ 2024' మొబైల్ యాప్ ద్వారా రాష్ట్రంలో 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు కేంద్ర మంత్రికి వివరించారు. ' ప్రభుత్వం ఇప్పటికే ఈ ఏడాది 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. మూడేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నాం. కేంద్రం సహకరిస్తే ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది'. అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేరుకుపోయిన ఇళ్ల డిమాండ్ను పరిగణనలోకి తీసుకోవాలని, పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించే ఈ యజ్ఞంలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**గృహనిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2014 నుండి 2023 వరకు గత ప్రభుత్వం గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పదేళ్ల కాలంలో కనీసం ఏడాదికి పదివేల ఇళ్లను కూడా నిర్మించలేదని, పైగా కేంద్రం నుంచి ఒక్క ఇల్లు కూడా తీసుకోలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వ తీరు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల కోసం భారీ డిమాండ్ ఏర్పడిందన్నారు.

## ఏ కోటా లేదు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎంపిగా, ఎంఎల్ఎ, ఎంఎల్‌సిగా ఎ దిగేందుకు అవకాశాలు ఉంటాయి.. జిల్లా అధ్య క్ష పదవులను సద్వినియోగం చేసుకోండి'' అని కాంగ్రెస్ జిల్లాల అధ్యక్షులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా అధ్యక్షులు పైరవీలకు దూరంగా ఉండాలని, పైరవీ కోసం తిరిగితే పైరవీకారుని ముద్ర పడుతుందని, చీ త్కారాలు వస్తాయని, తద్వారా అందరి ముందు లోకువ అవుతారని హితువుపలికారు. వివిధ అంశాలపైన స్పష్టతతో ప్రజా సమస్యలను సిఎం, మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీ సుకొచ్చి, వాటిని పరిష్కరిస్తే, గౌరవం నడుచుకుంటూ వస్తుందని సూచించారు. తెలుగు రా ష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చే సే దిశగా పనిచేయాలని, అందరినీ సమన్వ యం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ''సంఘటన్ శ్రీజన్ అభియాన్' పేరుతో వికారాబాద్‌లోని అనంతగిరి హరితా రిసార్ట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 'జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల' శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులు మార్చి 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ శిక్షణ తరగతులకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఎపి సిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సిఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డితో పాటు పలువురు హాజరయ్యారు.శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మెరిట్ కోటాలో జిల్లా అధ్యక్షులయ్యారని, ఈ పదవి ఆధారంగా సోనియా గాంధీ, మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ తదితర జాతీయ నాయకులతో నేరుగా మాట్లాడే , చర్చించే అవకాశం దక్కుతుంనది, ఈ క్రమంలో నాయకత్వ లక్షాన్ని గుర్తించే అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లా అధ్యక్షులపైన పార్టీ పెట్టుకున్న సంపూర్ణ విశ్వాసాన్ని దెబ్బతియవద్దన్నారు. కాంగ్రెస్ అభివృద్ధికి జిల్లా అధ్యక్షులు పునరంకి తమవ్వాలన్నారు.



తెలంగాణ, ఎపి రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ మరింత బలంగా ఎదరగాలని, రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందాలని, భారతదేశానికి ఈ రెండు రాష్ట్రాలు ఆదర్శంగా ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

**ఆత్మలాంటి కాంగ్రెస్‌ను దెబ్బతియాలన్నదే బిజెపి కుట్ర**

పోరాటాలతో సాధించిన స్వాతంత్ర్య భారతదేశంలో నాటి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టిందని, దేశాన్ని బలోపేతం చేసిందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకుని రాజకీయ పార్టీలుగా ఏర్పడి, ప్రస్తుతం 'కాంగ్రెస్ ముక్త్ భారత్' నినాదంతో దేశానికే ప్రమాదకర పార్టీగా మారిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశాన్ని, కాంగ్రెస్‌ను విడదీసి చూడలేమని, దేశం ఆత్మనే కాంగ్రెస్ పార్టీ అని, అలాంటి ఆత్మలాంటి కాంగ్రెస్‌ను దెబ్బతిసేందుకు బిజెపి లాంటి పార్టీలు కుట్రలు పాల్పడుతోందని దుయ్యబట్టారు. గాంధీ కుటుంబాన్ని అవినీతి ఆరోపణలో అవమానించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని, మరో పక్క పేదలకు అందుతున్న రిజర్వేషన్లను రద్దు చేయాలని కుట్ర జరుగుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య కోసం పోరాడిన మహాత్మాగాంధీపైన ఆనాటి బ్రిటీషర్లు లాఠీ ఎత్తడానికి భయపడ్డారని, కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బిజెపి వారసత్వం కలిగిన వారు తూటాలతో గాంధీని నెలకొరగదీశారన్నారు.

**గాంధీ కుటుంబానికి డబ్బులు అవసరమా?**

గాంధీ కుటుంబానికి డబ్బులు అవసరమా?, కాంగ్రెస్ కార్యకర్తలు డబ్బులు పొగు చేస్తే ఆ కుటుంబానికి రూ.10 వేల కోట్ల వరకు ఇవ్వవచ్చునని, తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు డబ్బులు పొగు చేస్తే వెయ్యి కొట్ల రూపాయాల వరకు ఇస్తారని సిఎం అన్నారు. కాంగ్రెస్‌ను రాజకీయాల్లో అడ్డుతొలగించుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. గాంధీ కుటుంబాం రాజకీయాల్లో ఉన్నంత వరకు దేశం ఐక్యంగా ఉంటుందని, మైనార్టీ, దళిత, బహుజన, అణగారిన వర్గాలకు గొంతుకగా నిలుస్తుందని సిఎం అన్నారు. ఇలాంటి చర్యలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్‌లక్ష భిన్నాభిప్రాయాల సంస్కృతి**

కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు చెప్పుకునే సంస్కృతి ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. బిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తిగా తీసుకోవాలని, కానీ తమను వ్యతిరేకిస్తున్నారని, తమ నిర్ణయాలను కాదంటున్నారని భావనలతో అలాంటి వారిని(నాయకులను) అణిచివేయాలని,పార్టీ నుంచి తరిమివేయాలనే ఆలోచిస్తే, అది పార్టీకి మేలు కంటే కీడు ఎక్కువగా జరుగుతుందని జిల్లా అధ్యక్షులకు సిఎం సూచించారు. తాను పిసిసి అధ్యక్షుని నియమితులైన తర్వాత ప్రతి నాయకుని ఇంటికి వెళ్లి మద్దతు అడిగానని,అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లనే అధికారంలోనికి వచ్చామని సిఎం గుర్తు చేశారు.

**రెండు శాతం నుంచి 12 శాతం ఓట్లను పెంచుకున్నాం**

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోని వచ్చినప్పుడు రెండవ పార్టీ కంటే (బిఆర్ఎస్) కాంగ్రెస్‌కు రెండు శాతం ఓట్లు అధికంగా ఉన్నాయని, ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలల్లో నాలుగు శాతం, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలల్లో మిగతా రాజకీయ పార్టీల కంటే 12 శాతం అధికంగా ఓట్లను సాధించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఇందుకు కార్యకర్తల శ్రమ, కాంగ్రెస్ పట్ల ప్రజలకు ఉన్న విశ్వసమే కారణమన్నారు.

## విద్యారంగం (మొదటి పేజీ తరువాయి)

మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గోనెరెడ్డి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్‌లు పాల్గొని మాట్లాడారు. అందరికీ విద్య పేరుతో కొందరికే విద్యను పరిమితం చేసిన ఘనత మన పాలకులదని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో 90 సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎప్ అని, దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై నిరంతర విద్యార్థుల పక్షాన నిలుస్తూ ఉద్యమాలు చేస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అని తెలిపారు. ఖాళీగా ఉన్న లక్షలాది ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీకి ఎలాంటి భరోసా ఇవ్వలేదని, ఈ విద్యా విధానంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తారన్నారని మండలంలో, జిల్లాలోని కళాశాలల ప్రవేశాలకు దేశమంతటికి వర్తించేలా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా ఒకే పరీక్ష జరుగుతుందని, దీంతో స్థానికత సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదముంటుందన్నారు. జాతీయ విద్యావిధానంలోని విద్య, ప్రజావ్యతిరేక విధానాలతో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోందని తెలిపారు. ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రూ.53,47,315లక్షల కోట్ల మొత్తం బడ్జెట్‌లో విద్యారంగం వాటా రూ.139289 లక్షల కోట్లు మాత్రమేనని, గత సంవత్సరం 2.64 శాతం కాగా అది ఈ బడ్జెట్‌లో 2.6 శాతంకు తగ్గిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10 శాతం జీడీపీలో 6 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని అనేక నివేదికలు చెబుతున్నా బడ్జెట్‌లో విద్యారంగం వాటా ఏ ఏటికాయేడు కుంచించుకుపోతూ 2.6శాతంకు తగ్గడం కేంద్రానికి విద్యారంగం పట్ల ఉన్న వివక్షతకు అద్దం పడుతుందని, ఈ కేటాయింపుతో దేశంలో విద్యారంగం ఎలా బాగుపడుతుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ నుండి 8 మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్న తెలంగాణ విద్యార్థులకు కేంద్రం నుండి తీసుకవచ్చిందేమి లేదని మండిపడ్డారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్‌లు మాట్లాడుతూ రాష్ట్రలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కనీసం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ని స్కాలర్‌షిప్, ఫీజు రిఎంబర్స్‌మెంట్ 9300వేల కోట్లు విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న ఇంకా వాటిని విడుదల చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా 13లక్షల మంది విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయిలు ఇంతవరకు చెల్లించకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు సుధాకర్, ఓమయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభోద్, రఘురాం, కుషాల్, కోశాధికారి అనూష, నాయకులు కిషోర్, రమేష్, దినేష్, రిహాన్ పాల్గొన్నారు.

### మహాసభ తీర్మానాలు :

- నూతన జాతీయ విద్యావిధానం 2020ను రద్దు చేయాలి.
- రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలి.
- విద్యాశాఖలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
- పెండింగ్‌లోని ఫీజు రిఎంబర్సమెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీ అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి.
- వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్‌ను రద్దు చేయాలి.
- యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
- కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం జిడిపిలు 6 శాతం రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్ సర్వే వేగవంతం చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ముందస్తు సన్నాహాల్లో భాగంగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఓటర్ల మ్యాపింగ్ సర్వేను మరింత చురుకుగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్‌తో కలిసి శనివారం ఆయన సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్ పోలింగ్ కేంద్రం 211 పరిధిలో జరుగుతున్న ప్రోజెన్సీ మ్యాపింగ్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చార్మినార్ నియోజకవర్గంలోని లో ఖబుత్తర్ ఖానా పోలింగ్ కేంద్రం 12 పరిధిలో కూడా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఓలు), సూపర్‌వైజర్‌లతో మాట్లాడిన ఆయన మ్యాపింగ్ విధానం, వారికి ఉన్న అవగాహనపై ప్రశ్నించారు. 2002 ఓటరు జాబితాలోని ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, 2025 జాబితాతో పోల్చుతూ పేర్లను మ్యాపింగ్ చేస్తున్నామని బిఎల్‌ఓలు వివరించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నివేదించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రోజెన్సీ మ్యాపింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితాల్లో కచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను నిర్ధారించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిశీలనలో అదనపు కమిషనర్ (ఎన్నికల విభాగం) చంద్రకళ, ఈఆర్‌ఓలు సరిత, ఆంజనేయులు, ఏఈఆర్‌ఓలు సుధీర్ రెడ్డి, ఎన్నికల విభాగం సహాయ మున్సిపల్ కమిషనర్ విమల పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సేవలు రాబోయే తరాలకు తెలియాలి

## మరణించిన జర్నలిస్టులకు విడతల వారీగా ఆర్థిక సహాయం

## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి కట్టుబడి ఉన్నదని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్, తెలంగాణ మీడియా అకాడమీలోని కాన్ఫరెన్సు హాల్‌లో కె.శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన మీడియా అకాడమి రెండవ పాలకమండలి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై ఏడు వర్క్ షాప్‌లను నిర్వహించామని, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ (చిరు పుస్తకాలు) ముద్రించినట్టు వివరించారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా మరణించిన జర్నలిస్టులకు విడతల వారీగా 120మంది జర్నలిస్టు కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు రూ.3 వేల పెన్షన్ సదుపాయం కల్పించినట్టు ఆయన వివరించారు. అనారోగ్యబారినపడిన, ప్రమాదాలకు గురైన 19మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. మీడియా అకాడమీ భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియంను అద్దెకు ఇవ్వాలనే ప్రతిపాదనలను కమిటీ సభ్యులు ఆమోదించడం పట్ల వారికి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాలక మండలి సమావేశంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్.ప్రియాంక, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ సతీష్ కుమార్ తల్లాడి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ ఇన్‌చార్జి హెడ్ డా.సునిల్ కుమార్ పోతన, దూరదర్శన్ కేంద్ర ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ ఎ.చాందిని, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.రమేష్ సుంకసారి, స్పెషల్ గెస్ట్ వీర నారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ బి.వి.కృష్ణాజీరావు, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



**ఆన్‌లైన్ ద్వారా 'ఆడిటోరియం' స్లాట్ బుకింగ్**

మీడియా అకాడమీ భవన నిర్వహణలో భాగంగా ఆడిటోరియంను అద్దెకు ఇవ్వడానికి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు సుముఖత వ్యక్తం చేస్తునే, ఈ విధానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించింది. దీనికి సంబంధించి మీడియా అకాడమి వెబ్ సైట్‌లో ఆయా తేదీలు, సమయ పాలనను పొందుపర్చాలని తెలిపింది. అప్పుడే పూర్తి పారదర్శకత చేకూరుతుందని వారు అన్నారు. మీడియా అకాడమీ ఆడిటోరియంను అద్దెకు ఇచ్చే విషయమై ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యు, సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయాలకు సంబంధించిన విధి, విధానాలను అధ్యయనం చేసి, అద్దెకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని మీడియా అకాడమీ కార్యదర్శికి వారు సూచించారు.



అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యంకి వినతి పత్రం అందజేసిన అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

# సమాజాన్ని సరైన గాడిలో పెట్టాల్సింది సాహితీవేత్తలే

## తెలంగాణ సాహితీ దశాబ్ది సాహిత్యోత్సవాలలో వక్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** లాభమే పరమావధిగా కొనసాగుతున్న ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో సాటి మనిషి పట్ల ప్రేమ, కరుణ, జాలి, సోదరతత్వం పూర్తిగా కనుమరుగవుతుండడంతో ఎటు పోతున్నామో తెలియని స్థితిలో సమాజం కొట్టుమిట్టాడుతోందని పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని సరిదిద్ది, మనుషులను సరైన గాడిలో పెట్టాల్సిన గురుతర బాధ్యత అభ్యుదయ, ప్రగతిశీల భావాలుగల సాహితీవేత్తలపైన్నే ఉందన్నారు. తెలంగాణ సాహితి దశాబ్ది సాహిత్యోత్సవాలు శనివారం హైదరాబాద్‌లోని తంగిరాల చక్రవర్తి (ఎవి కాలేజీ) ప్రాంగణంలో శనివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, విమర్శకులు నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా వాగ్గేయకారుడు, ఎంఎల్‌సి గోరటి వెంకన్న, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ రియాజ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ సాహిత్యం తెలిస్తే లోకం తెలుస్తుందని, అందుకే విద్యార్థులు, యువత సాహిత్యాన్ని చదవాలని సూచించారు. చదువంటే కేవలం సర్టిఫికెట్లు మాత్రమే కాదని, డిగ్రీలతోపాటు సరైన వివేచన కావాలని అభిప్రాయపడ్డారు. సమాజ సేవ చేస్తే మాకేం వస్తుందనే ధోరణి అందరిలో పెరిగిపోవటం ఆందోళనకరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమాజ హితాన్ని కాంక్షించే కవులు, రచయితలు, సాహితీవేత్తలకు తెలంగాణ సాహితి వేదిక కావటాన్ని ఆయన అభినందించారు. రియాజ్ మాట్లాడుతూ ప్రగతిశీల సాహితీవేత్తలకు, నేటి సామాజిక మాధ్యమాల వేగానికి ఉన్న అంతరాన్ని విడమరిచి చెప్పారు. పెద్ద పెద్ద పుస్తకాలు, సుదీర్ఘ వ్యాసాలు రాయటంతోపాటు వాటిలోని సారాంశాన్ని చిన్న చిన్న వీడియోల రూపంలో విడుదల చేయగలిగితే తద్వారా మనం చెప్పాలనుకున్న విషయాన్ని నేటి యువతకు సులభంగా చేరవేయొచ్చని పేర్కొన్నారు. ఎంఎల్‌సి గోరటి వెంకన్న మాట్లాడుతూ సోషల్ మీడియా సమాజంపై తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపిస్తోందని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విష కౌగిలి నుంచి ముందుగా సాహితీవేత్తలు బయటపడాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం సామ్రాజ్యవాదం విశ్వరూపాన్ని చూపిస్తూ, కరాళ నృత్యం చేస్తోందని చెప్పారు. మతోన్మాదం జడలు విప్పుతూ మనుషుల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్న ఈ నేపథ్యంలో కవులు, రచయితలు ప్రజల పక్షాన ఉంటూ వారిని నిరంతరం అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ ఏనుగు నర్సింహారెడ్డి, కార్యదర్శి బాలాచారి, కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత (కర్నాటక) శివలింగప్ప, కాళోజీ అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, ప్రముఖ కవులు యాకూబ్, మువ్వా శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.రఘు ప్రసంగించారు. ప్రముఖ కవి నిఖిలేశ్వర్‌ను ఈ సందర్భంగా జ్ఞాపికతో సత్కరించారు.

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

No. G2/184/2026 Dt: 09.02.2026
Gaz. No.46/2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

ఫారం. 6, ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలములోని సిర్సవాడ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన **ఎ.7.07 గుంటలు** భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 55 (Minor-1R) నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ.7.07 గు.** భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 55 (Minor-1R) మిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: సిర్సవాడ మండలం: తాడూరు జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట/తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ. సెంట్లు/గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 53 | పట్టా | మెట్ట | 0.17 | చిన్నగంట వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి రాంరెడ్డి (0.08) చిన్నగంట పుల్లారెడ్డి తండ్రి రాంరెడ్డి (0.09) జున్ను వెంకట్‌నారాయణ రెడ్డి తండ్రి బస్విరెడ్డి మాలె రామన్ గౌడ్ తండ్రి కృష్ణయ్య జున్ను శేఖర్ రెడ్డి తండ్రి వెంకటనారాయణ రెడ్డి గోగిరెడ్డి రంగారెడ్డి తండ్రి రామకృష్ణారెడ్డి జున్నా బస్వ రెడ్డి తండ్రి వెంకట్నారాయణ రెడ్డి మాలె శివశంకర్ తండ్రి వెంకటయ్య గోగిరెడ్డి భాగ్యమ్మ భర్త చిన్న వల్లపురెడ్డి గంట శ్రీనివాస్ రెడ్డి తండ్రి రాఘవరెడ్డి గంట రాంరెడ్డి తండ్రి రాఘవరెడ్డి | VB | 54 | 58 | 52 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 54 | పట్టా | మెట్ట /తరి | 0.25 | జున్న శేఖర్ రెడ్డి తండ్రి వెంకట్ నారాయణ రెడ్డి (0.10) గొగిరెడ్డి భాగ్యమ్మ భర్త వల్లభ రెడ్డి (0.10) పెద్దగంట రాఘవరెడ్డి తండ్రి రాంరెడ్డి (0.05) గోగిరెడ్డి పెద్దవల్లభ రెడ్డి తండ్రి ముసలిరెడ్డి గంట విజయమ్మ భర్త రాఘవ రెడ్డి జున్న బస్వ రెడ్డి తండ్రి వెంకటారాయణ రెడ్డి చింతకింది నర్సమ్మ భర్త చిన్న జంగయ్య గంట శ్రీనివాస్ రెడ్డి తండ్రి రాఘవరెడ్డి గంట రాంరెడ్డి తండ్రి రాఘవరెడ్డి గోగి రెడ్డి గోపాల్‌రెడ్డి తండ్రి చిన్న వల్లభ్ రెడ్డి గంట మమత భర్త శ్రీనివాస్ రెడ్డి | 53 | 55 | 58 | 51 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 55 | పట్టా | మెట్ట /తరి | 1.26 1/2 | పెద్దగంట రాఘవరెడ్డి తండ్రి రాంరెడ్డి (0.17) గోగి తేజవర్దన్ రెడ్డి తండ్రి వెంకటేశ్వర్ రెడ్డి (0.16) జున్న శేఖర్ రెడ్డి తండ్రి వెంకట్‌నారాయణ రెడ్డి (0.161/2) జున్నా బస్వరెడ్డి తండ్రి వెంకటారాయణ రెడ్డి (0.17) గంట రాఘవరెడ్డి తండ్రి పెద్ద రాంరెడ్డి అయిలు పార్వతమ్మ భర్త వెంకట్ రెడ్డి గోగి రెడ్డి పెద్దవల్లభ్ రెడ్డి తండ్రి వేంకటారాయణ గంట శ్రీనివాస్ రెడ్డి తండ్రి రాఘవరెడ్డి గంట రాంరెడ్డి తండ్రి రాఘవరెడ్డి గోగి రెడ్డి గోపాల్ రెడ్డి తండ్రి చిన్నవల్లభ్ రెడ్డి గోగిరెడ్డి రాంచంద్రారెడ్డి తండ్రి గోవిందారెడ్డి | 54 | 50 | 57 | 38 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 56 | పట్టా | మెట్ట /తరి | 0.03 1/2 | అయిలు పార్వతమ్మ భర్త వెంకట రెడ్డి (0.031/2) గోగిరెడ్డి పెద్దవల్లభ రెడ్డి తండ్రి ముసలిరెడ్డి మాలెరామన్ గౌడ్ తండ్రి కృష్ణయ్య జున్న శేఖర్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి జున్న బస్వ రెడ్డి తండ్రి వెంకట్నారాయణ రెడ్డి గోగిరెడ్డి భాగ్యమ్మ భర్త చిన్న వల్లపురెడ్డి మాలె లక్ష్మణ్ గౌడ్ తండ్రి కృష్ణయ్య గౌడ్ జున్న శ్రీనివాస్ రెడ్డి తండ్రి పెద్దవెంకటేశ్వర్ రెడ్డి గంటశ్రీనివాస్‌రెడ్డి తండ్రి రాఘవరెడ్డి గంట రాంరెడ్డి తండ్రి రాఘవ రెడ్డి గొగిరెడ్డి రాంచంద్రారెడ్డి తండ్రి గోవిందా రెడ్డి పండల శ్రీలత భర్త నవీన్ రెడ్డి | 57 | 38 | 61 | 55 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 38 | పట్టా | మెట్ట | 0.16 | జున్ను వెంకటనారాయణ రెడ్డి తండ్రి బస్విరెడ్డి (0.08) అయిలు పార్వతమ్మ భర్త వెంకట్రెడ్డి (0.08) గున్న ప్రేమచంద్రారెడ్డి తండ్రి రాంరెడ్డి గున్న పద్మజరెడ్డి భర్త జయంత్ రెడ్డి దొండెటి కోటిరెడ్డి తండ్రి పోల్‌రెడ్డి | 56 | 49 | 37 | 49 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 37 | పట్టా | మెట్ట | 0.34 1/2 | తంగెళ్ల సూరమ్మ భర్త యాదయ్య (0.111/2) తంగెళ్ల బాలీశ్వరమ్మ భర్త శ్రీశైలం (0.13) గున్న జయంత్ రెడ్డి తండ్రి రాంరెడ్డి (0.10) శిద్దాపురం శివప్రసాద్ తండ్రి శరభలింగప్ప గున్న ప్రేమచంద్రారెడ్డి తండ్రి రాంరెడ్డి అయిల వెంకట్ రెడ్డి తండ్రి బాలకిష్టారెడ్డి పండగ గాయత్రి గార్రియన్ పార్వతమ్మ భర్త నవీన్ రెడ్డి పండగ శ్రీలత భర్త నవీన్ రెడ్డి గున్న పద్మజరెడ్డి భర్త జయంత్ రెడ్డి | 56 | 96 | 96 | 38 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 96 | పట్టా | మెట్ట | 1.09 1/2 | తంగెళ్ల సూరమ్మ భర్త యాదయ్య (0.05) తంగెళ్ల బాలీశ్వరమ్మ భర్త శ్రీశైలం (0.08) గున్న జయంత్ రెడ్డి తండ్రి రాంరెడ్డి (0.06) చుక్క వెంకటేష్ గౌడ్ తండ్రి నాగయ్యగౌడ్ (0.301/2) కానపురం భాస్కర్ తండ్రి నిరంజన్ | 36 | 29 | 28 | 96 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 28 | పట్టా | మెట్ట | 0.39 1/2 | బొంకూరి యల్లయ్య తండ్రి జంగయ్య (0.091/2) గున్న మానందనమ్మ భర్త రఘునందన్ రెడ్డి (0.22) బొంకూరి శివకుమార్ తండ్రి ఎల్లయ్య (0.08) గున్న రఘునందన్ తండ్రి కిష్ట రెడ్డి గున్న అనంతకృష్ణా రెడ్డి తండ్రి జనార్దన్ రెడ్డి గున్న సురేందర్ రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి శిద్దపురం శివప్రసాద్ తండ్రి శరభలింగప్ప బొంకురు మాసమ్మ భర్త యల్లయ్య అయిల వెంకట్ రెడ్డి తండ్రి బాలకిష్టారెడ్డి గున్న సతీష్ రెడ్డి తండ్రి రఘునందన్ గున్న రాజమోహన్ రెడ్డి తండ్రి రఘునందన్ గున్న గౌతమ్ రెడ్డి తండ్రి శ్రీకృష్ణారెడ్డి గున్న జగదీష్ రెడ్డి తండ్రి రఘునందన్ రెడ్డి తంగెల్ల బాలీశ్వరమ్మ భర్త శ్రీశైలం తంగెల్ల సూరమ్మ భర్త యాదయ్య బొంకురి శ్రీశైలం తండ్రి ఎల్లయ్య గున్న సాయికుమార్ రెడ్డి తండ్రి జితేంద్రారెడ్డి | 96 | 29 | 27 | 96 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 27 | పట్టా | మెట్ట | 0.17 | వాస్లాల కౌసల్యమ్మ భర్త సింహ్మారెడ్డి (0.05) గున్న మానందనమ్మ భర్త రఘునందన్ రెడ్డి (0.08) వస్లాల దామోదర్ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి (0.04) వాస్లాల జనార్దన్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి వాసుదేవుల పుల్లారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి వాస్లాల శారదమ్మ భర్త కృష్ణారెడ్డి వాస్లాల ప్రభాకర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి వాసుదేవుల జయకర్‌రెడ్డి తండ్రి లక్ష్మా రెడ్డి గున్న సతీష్ రెడ్డి తండ్రి రఘునందన్ గున్న రాజమోహన్ రెడ్డి తండ్రి రఘునందన్ వస్లాల సుధాకర్ రెడ్డి తండ్రి లక్ష్మా రెడ్డి వాస్లాల మదుసుదన్ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి వస్లాల విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి వాస్లాల సుమలత భర్త బాల్‌రెడ్డి గున్న జగదీష్ రెడ్డి తండ్రి రఘునందన్‌రెడ్డి వాస్లాల అనిత భర్త శ్రీనివాస్ రెడ్డి | 28 | Nala | 26 | 28 | లేవు | లేవు | లేవు | లేవు |
| 10 | 26 | పట్టా | మెట్ట | 0.15 1/2 | గున్న శరణమ్మ భర్త కృష్ణారెడ్డి (0.11) గున్న రజిత భర్త రవీందర్‌రెడ్డి (0.041/2) ఎలుగపల్లి ప్రదీప్ కుమార్ తండ్రి రవీందర్ బొంకూరి శ్రీశైలం తండ్రి మల్లయ్య | 27 | 96 | 96 | Nala | లేవు | లేవు | లేవు | లేవు |
| 11 | 98 | పట్టా | మెట్ట | 0.03 | గున్న విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి (0.03) గున్న వెంకట్రమాణారెడ్డి తండ్రి గోవర్ధన్ రెడ్డి | 96 | - | - | - | లేవు | లేవు | లేవు | లేవు |
| | | మొత్తము | | 7.07 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి **జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్,** మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా **ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్** గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సేకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో **భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్** నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది: 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహరము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము - II మరియు అధ్యాయము - III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I,యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO. 1203/LA/PP/Advt/Pub/2025-26

# కెయులో ఘనంగా హిస్టరీ కాంగ్రెస్ ప్రారంభం

## హాజరైన వివిధ యూనివర్సిటీల ఆచార్యులు




**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో '9వ వార్షిక తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్' ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్యులు, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆచార్య ఈ.సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'చరిత్ర అనేది కేవలం గతాన్ని నమోదు చేసే ప్రక్రియ మాత్రమే కాదని, వాస్తవ ఆధారాలపై నిలిచే పరిశోధన ద్వారానే మన భవిష్యత్తుకు దృఢమైన పునాది వేయగలం' అని పేర్కొన్నారు. వరంగల్ నగరం తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని, కాకతీయుల కళా సంపద నుంచి ఆధునిక సామాజిక ఉద్యమాల వరకు ఈ నేల చరిత్రకు సాక్ష్యమన్నారు. తెలంగాణ చరిత్రను వెలుగులోకి తేవడంలో చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, రచయితలు, పరిశోధకులు చేసిన కృషిని ఆయన కొనియాడారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 1956 నుంచి రాష్ట్ర చరిత్ర, రైతాంగ పోరాటాలు, సామాజిక సంస్కరణలు, సాంస్కృతిక పునరుజ్జీవనం, ప్రజాస్వామ్య ఆకాంక్షల వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తూ శాస్త్రీయ వేదికగా నిలుస్తోందని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సోషల్ సైన్సెస్ విభాగాల డీన్ ఆచార్య బి. సురేష్ లాల్ మాట్లాడుతూ "ఆరంజ్ ఎకానమీ"లో సంస్కృతి, విలువల వ్యవస్థల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆదివాసీ, గిరిజన సమాజాల చరిత్రలను వెలికితీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య జి. వెంకటరాజం మాట్లాడుతూ 2007 సంవత్సరం నుంచి సంస్థ విస్తృత వ్యాప్తికి కృషి చేస్తున్నామని, భవిష్యత్ తరాలకు చరిత్ర సేవలు అందించడం లక్ష్యమని అన్నారు. మాజీ అధ్యక్షులు ఆచార్య జి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ కాంగ్రెస్‌కు అనేక వేదికలను అందించి ప్రోత్సహించిందని తెలిపారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంకం జయప్రకాశ్ మాట్లాడుతూ సంస్థకు 400 మందికి పైగా శాశ్వత సభ్యులు ఉన్నారని, యువ పరిశోధకులు పరిశోధనలపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా "తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 8వ వార్షిక సమావేశాల నివేదిక" ఆవిష్కరించబడింది. కార్యక్రమంలో ఆచార్య జి.దయాకర్, ఆచార్య పాండ్య భుఖ్య, సిక్కిం యూనివర్సిటీ ఆచార్యులు ఆచార్య జి.విజయకుమార్, ఆచార్య టి.దయాకర్ రావు, ఆచార్య రాజశేఖర్ బాబు, ఆచార్య వదన్నం, ఆచార్య లావణ్య, ఆచార్య బండి శ్రీనివాస్, ఆచార్య టి.మనోహర్, ఆచార్య యాదవ రెడ్డి, విశ్రాంత ఆచార్యులు ఆచార్య శ్రీనాద్, ఆచార్య విజయబాబు, ఆచార్య పి.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో మూడు స్మారక ఉపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# కోరికలు తీర్చే కొంగు బంగారం కొడవటంచ లక్ష్మీ నరసింహ స్వామి

## శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కోరికలు తీర్చే కొంగు బంగారం శ్రీ కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి అని, మంచి చేసే వారికి ఎల్లప్పుడూ భగవంతుని ఆశీస్సులు ఉంటాయ ని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆహ్వానం మేరకు కొడవటంచ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సభాపతి మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.15కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక శాసనసభ్యులు కోరిన విధంగా అదనపు నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సభాపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఆలయ పునః ప్రతిష్ఠకు సంబంధించిన సంప్రోక్షణ కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రక్తంగా ఘనంగా నిర్వహించారు. పునః ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య యాగశాల కార్యక్రమాలు, కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి వంటి శాస్త్రక్త క్రతువులు నిర్వహించబడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. చారిత్రక దేవాలయం పునఃప్రతిష్ఠ జరగడం శుభసూచకమని, ఆధ్యాత్మికతకు నిలయంగా శ్రీ కొడవటంచ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం తీర్చిదిద్దామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలేకాక సామాజిక ఐక్యతకు ప్రతీకలని తెలిపారు. కొడవటంచలోని ఈ చారిత్రక దేవాలయం పునఃప్రతిష్ఠ జరగడం శుభసూచకమని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న జీయర్ స్వామి ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాలయ చైర్మన్ సంపత్ రావు, ఈఓ మహేష్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన

## బిసి కమిషన్‌కి ఫిర్యాదు చేసిన విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర బిసి కమిషన్ దష్టికి తీసుకువచ్చింది. ఈ అంశంపై చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన శనివారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తో పాటు కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి పాల్గొని, సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో భాగంగా మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి, ఈ విషయంపై విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణ వేగవంతం చేయాలని కమిషన్ అధికారులకు సూచించింది. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు.శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి.సతీష్ కుమార్ హాజరయ్యారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-23

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No. 64/EE-23/RJNRZ/GHMC/2025-26, పని పేరు: (1) పని, అంచనా విలువ : రూ.10.20 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 23.02.2026న సా.5.00గం.లకు, బిడ్ల స్వీకరణకు ఆఖరి తేదీ: 26.02.2026న సా.5.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ బి.నరేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23, ఫూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @ https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.

గమనిక: 1) టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% EMD పొందాలి మరియు విజయవంతమైన టెండరర్ 3 రోజుల్లోపు వెంటనే ఈ కార్యాలయానికి దానిని సమర్పించాలి, ఇందులో విఫలమైతే లేదా ఏదైనా వైవిధ్యం గమనించినట్లయితే, I&CAD (PO..00.000.W-Reforms) విభాగం తేదీ 01.09.08 యొక్క GO Ms. 174 ప్రకారం 3 సంవత్సరాల పాటు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లో టెండర్లలో పాల్గొనకుండా మిమ్మల్ని సస్పెండ్ చేస్తారు.

2) వడ్డెర కార్మిక సంఘాలు రిజర్వ్ చేయబడిన పనులకు మాత్రమే EMD చెల్లింపు నుండి మినహాయించబడ్డాయి మరియు ఇతర పనులకు వారు 1% EMD చెల్లించాలి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చాంద్రాయణగుట్ట, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 15801-PP/CL/ADVT/1/2025-26, Date: 21-02-2026

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

HMDA చట్టం 2008 యొక్క సెక్షన్ 15 (4) ప్రకారం పబ్లిక్ నోటిఫికేషన్

(G.O.Ms No. 58 MA & UD Dept., dated : 13.02.2026)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (2008 యొక్క చట్టం నెం.8) సెక్షన్ 15లోని సబ్‌సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం ఇందుమూలంగా పూర్వపు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఏరియాల (HMDA కోర్ ఏరియా) GHMC సర్కిల్ -X (పాత సర్కిల్ నెం.V) యొక్క నోటిఫైడ్ రివైజ్డ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (మాస్టర్ ప్లాన్)లో ఊహించిన భూ వినియోగానికి ఈ క్రింది మార్పును చేస్తున్నది. దీనిని ప్రభుత్వం G.O.Ms No. 363 MA & UD తేదీ 21.08.2010ద్వారా ఆమోదించింది.

**హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెం.2లో ఉన్న జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆమోదించబడిన లేఅవుట్‌లో ఉన్న షేక్‌పేట్ గ్రామంలోని సర్వే నెం.403/1, (పాత), 120 (కొత్త) మరియు హకీంపేట్ గ్రామంలోని సర్వేనెం. 102/1 లోని ప్లాట్ నెం. 17-A లో మున్సిపల్ నెం.8-2-293/82/A/17Aపై హౌస్ ప్రాపర్టీ స్థలం 1031.32 చదరపు గజాలు / 862.82 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం ఇది ఏదైతే పూర్వపు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (HMDA కోర్ ఏరియా), GHMC సర్కిల్ -X (పాత సర్కిల్ నెం.V) యొక్క నోటిఫైడ్ రివైజ్డ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (మాస్టర్ ప్లాన్)లో రెసిడెన్షియల్ వినియోగం కోసం కేటాయించబడి ఉన్నదో, దానికి ప్రభుత్వం G.O.Ms. No.363 MA & UD తేదీ : 21.08.2010ద్వారా ఆమోదం తెలపడంతో, ఇప్పుడు కమర్షియల్ వినియోగ జోన్‌గా నియమించబడింది.**

పైన పేర్కొన్న దానికి సంబంధించి మరిన్ని వివరాలు http://gazette.telangana.gov.in//మరియు http://hmda.gov.in//. వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (RR) HMDA

DIPR R.O. No. : 15793-PP/CL/ADVT/1/2025-26, Date: 21-02-2026

సూపరింటెండెంట్ వారి కార్యాలయం
ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, రామగుండం, పెద్దపల్లి జిల్లా.

ప్రకటన

రామగుండం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (GGH) లోని వివిధ వైద్య పరికరాల రిపేర్ మరియు కొత్త విడిభాగాల (Accessories) కొనుగోలు కోసం ఆసక్తిగల వెండర్ల నుండి కొటేషన్ కోరడమైనది. ఇట్టి దరఖాస్తు రుసుము 5000 మరియు emd ధర 20,000 తీయగలరు, వీటితోపాటు ఈ పనిచేయాలనుకునే వారు తమ ధరల వివరాలతో కూడిన కొటేషన్ను ఒక లేఖలో రాసి, దానిని సీల్ చేసిన కవరులో (Sealed Cover) పెట్టి, **23-02-2026** తేదీన ఉదయం నుండి సాయంత్రం **25.02.2026 5:00 PM** గంటల లోపు రామగుండం GGH ఆసుపత్రి కార్యాలయంలో నేరుగా అందజేయాలి. మరియు అందిన కొటేషన్లను ఆ తేదీన సాయంత్రం 5:00 pm గంటలకు మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పాల్గొన్న అందరి సమక్షంలో తెరవడం జరుగుతుంది . ఆసక్తి ఉన్న వారు నిర్ణీత గడువు లోపు తమ కొటేషన్లను సమర్పించవల సిందిగా కోరుచున్నాము.

కావలసిన వస్తువులు మరియు రిపేర్ చేయాల్సిన పరికరాల వివరాలు:

| S. No. | Name of the Ward | Name of the Equipment | required repair machine quantity | Required Material to repair |
|---|---|---|---|---|
| 1 | SNCU Department | Warmers Machine | 20 | Power supply boards and Main Baords |
| | | Phototherapies Machine | 10 | Accessories and Blue colour Bulbs |
| | | Ventilators Machine | 4 | Expiratory Valves and Oxygen sensors |
| | | Compressors Machine | 2 | repair accessories |
| 2 | Ortho ward | ECG Machine | 3 | Power supply boards and door set and cables |
| 3 | Pathology Department | Cell counter Machine | 1 | UPS Batteries |
| 4 | Ophthalmology Department | Motorised Tables | 3 | Newly required for fitting of Machines |
| | | Slit Lamp | 1 | lenses repair |
| 5 | 1st floor Operation Theatre | Suction Machine | 1 | repair accessories |
| 6 | 2nd floor Operation Theatre | Operation Theatre Tables-3 | 3 | repair accessories |
| 7 | PICU ward | Syringe pump | 10 | repair accessories |
| | | Infusion Pump | 10 | |
| 8 | Central Sterilised supply department | Horizontal Auto clave Machine | 4 | repair accessories |
| | | Vertical Auto clave Machine | 2 | |
| 9 | New Block ICU | Ventilators Machine | 2 | Expiratory Valves and Oxygen sensors |

మీ విశ్వసనీయ
సం/- మెడికల్ సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, రామగుండం.

DIPR R.O. No. : 15756-PP/CL/ADVT/1/2025-26, Date: 21-02-2026



ఇటీవల మరణించిన నల్లమల కమలాదేవి (సిపిఐ అగ్ర నాయకులు దివంగత నల్లమల గిరి ప్రసాద్ సతీమణి) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ. వారి కుమార్తె వనశ్రీ, ఇతర కుటుంబ సభ్యులను హైదరాబాదులో వారి గృహానికి వెళ్లి పరామర్శించారు.

## మావోయిస్టులు న్యాయమార్గంలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మావోయిస్టులు ప్రస్తుత వర్తమాన పరిస్థితుల్లో తమ కార్యాచరణను సమీక్షించుకుని, న్యాయమార్గంలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నదని, ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని పలువురు మేధావులు సూచించారు. మావోయిస్టులు తమ ఆచరణను సమీక్షించుకునేందుకు సహకరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ చారిత్రక సందర్భంలో, సమాజంలో శాంతిని పెంపొందించే లక్ష్యంతో ఆ మార్పునకు దోహదపడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ప్రొఫెసర్ జి.హరగోపాల్ ,ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి , ప్రొఫెసర్ రమా మేల్కొటె, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సీనియర్ జర్నలిస్టు అల్లం నారాయణ, ప్రొఫెసర్ కల్పన కన్నాభిరాన్, సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక సంవ త్సరాలుగా ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన సామాజికఆర్థిక మార్పునకు చేసిన కృషితో ప్రజా జీవితంలో వచ్చిన మానవీయ మార్పుల పట్ల తమకు గౌరవం ఉన్నదని వారు తెలిపారు. నిబద్ధత, నిజాయితీగా ప్రజల కోసం నిలబడిన 'మీలాంటి'(మావోయిస్టులు) వారు నేటి సమాజానికి అవసరమని వారు పేర్కొన్నారు.

## సిఎం కప్–2025 రెండో విడత

9వ తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా ముగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం కప్–2025 రెండో విడతలో భాగంగా నిర్వహించిన 9వ తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ ఫిబ్రవరి 18 నుండి 20 వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ సరస్సులో విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక రిగాటాగా నిర్వహించిన ఈ పోటీల్లో సబ్ జూనియర్, గ్రీన్ ఫ్లీట్, కేడెట్ క్లాస్, మెయిన్ ఫ్లీట్ విభాగాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి యువ సెయిలర్లు ప్రతిభ కనబర్చారు.హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు గాలివేగాలు సవాళ్లు విసురుతున్న పరిస్థితుల్లోనూ అద్భుత నైపుణ్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. సబ్ జూనియర్ బాలికలు బంగారు పతకం హైదరాబాద్‌కు చెందిన ఎస్.కె. రమీజా భాను, రజత పతకం మహబూబ్‌నగర్‌కు చెందిన మీనిగా అక్షర , కాంస్య పతకం హైదరాబాద్‌కు చెందిన సాక్షి కుమారి దక్కించుకున్నారు. (హైదరాబాద్) ఇతర విభాగాల్లో పి. ఝాన్సీ, గాజుల తేజస్విని, మంచిగంటి జాహ్నవి, విహాన్ ఝావర్ , బీమన్‌పల్లి శివకుమార్, చుంచ వాయు, బెన్నొల్లా రవికుమార్, నిల్కొండల మణి, డి. అక్షయ్ కుమార్ లు గెలుచుకున్నారు.సిఎం కప్–2025 ద్వారా నీటిమీద క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి యువ ప్రతిభను ప్రోత్సహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్ తెలంగాణలో సెయిలింగ్ క్రీడ అభివృద్ధికి మరో మైలురాయిగా నిలిచింది.

## ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

టిజెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు వేతన సవరణను వెంటనే అమలు చేయాలని టిజెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని యూనియన్ ఆఫీస్‌లో శనివారం తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను అమలు చేస్తుంది, కానీ ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీని మర్చిపోవడం చాలా విచారకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసికి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, రావాల్సిన బకాయిలను విడుదల చేయడంతో పాటు డబుల్ డ్యూటీలకు డబుల్ వేతనం చెల్లించాలని కోరారు. ఆర్‌టిసిలో కాంట్రాక్టు విధానం రద్దుచేసి, రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగాలు చేపట్టాలన్నారు. అలాగే వెల్ఫేర్ బోర్డులను రద్దు చేసి, యూనియన్లను వెంటనే అనుమతించాలని కోరారు. ఇట్టి సమస్యలపై జెఎసి పిలుపు మేరకు 24న చేపట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో టిజెఎంయు పాల్గొంటుందని, రాష్ట్రంలోని అన్ని డిపోలలో ఉన్న తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ కార్మికులు అందరూ పాల్గొనాలని హనుమంతు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోలి రవీందర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పీకే మూర్తి, రాష్ట్ర కార్యదర్శులు అతిక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 23న భవన నిర్మాణ కార్మిక సంఘాల నిరసన

తెలంగాణ అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని, సిసి రెండు శాతం పెంచడంతో పాటు ఇన్సూరెన్స్‌ను ప్రైవేటు కంపెనీలకు ఇచ్చే ఆలోచన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్నట్టు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ తెలిపారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది నిర్మాణ కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తిరోగమన విధానాల నిరసిస్తూ భవన నిర్మాణ కార్మికుల ఆర్థిక అభివృద్ధి కోసం సంక్షేమం కోసం పటిష్టంగా చట్టాల అమలు చేయాలని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో 25 లక్షల మంది గా పనిచేస్తున్నారని, ఏ ఒక్క పథకం ప్రభుత్వ సంక్షేమ పథకం నిర్మాణ కార్మికులకు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఆర్థిక ప్రగతి కోసం చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని లోపయిస్టమైన చట్టాల్లో కార్మికుల సంక్షేమానికి అనుగుణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 23న నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రవీణ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

# హీలింగ్ క్యాపిటల్‌గా హైదరాబాద్

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫార్మా రాజధానిగా అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతున్న హైదరాబాద్‌ను హీలింగ్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీ ధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా, అవకాశాలను అందిపుచ్చుకునేలా హెల్త్ కేర్ ను డేటా సైన్స్, డిజిటల్ ఆవిష్కరణలతో అనుసంధానించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. లండన్ కేంద్రంగా పనిచేసే పిహెచ్‌యుఎస్‌ఇ ఆధ్వర్యంలో 'పిహెచ్‌యుఎస్‌ఇ ఎపిఎసి కనెక్ట్ 2026' పేరిట హెచ్‌ఐసిసిలో నిర్వహించిన సదస్సులో క్లినికల్ రీసెర్చ్, డేటా సైన్స్ అనుసంధానంపై దేశ, విదేశాల నిపుణులు మేధోమథనం చేశారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ కాన్ఫరెన్స్ ముగింపు వేడుకకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.... హెల్త్ కేర్ భవిష్యత్తు రాబోయే రోజుల్లో క్లినికల్ సైన్స్, ఎఐ, రియల్ వరల్డ్ ఎవిడెన్స్ మేళవింపుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ముఖ్యంగా క్లినికల్ రీసె ర్చ్‌లో విప్లవాత్మక మార్పులొస్తాయని, టెక్నాలజీ కీలక పాత్ర పోషించబోతుందన్నారు. ఇలాంటి తరుణంలో అందుకు అవసరమైన ఎకో సిస్టంను ఇప్పటి నుంచే తెలంగాణలో అభివృద్ధి చేసేలా దార్శనికతతో కూడిన అడుగులు వేస్తున్నామన్నారు. అందులో భాగంగానే... ఎఐ సిటీ, యంగ్ ఇండియన్ స్కిల్స్ వర్సిటీ, జీనోమ్ వ్యాలీ విస్తరణ, డేటా మౌలిక సదుపాయాల అభివృద్ధి, రాష్ట్రంలోని ప్రతి పౌరుడి హెల్త్ ప్రొఫైలింగ్, మెడికల్ టూరిజం పాలసీ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్ కు శ్రీకారం చుట్టామన్నారు. సైన్స్, డేటా, హ్యూమానిటీ కలిసి పనిచేసినప్పుడే సమాజానికి నిజమైన మేలు జరుగుతుందన్నారు. అందుకోసం... పరిశోధకులు, వైద్యులు, సాంకేతిక నిపుణులు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరముందన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని పరిశోధకులను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో పిహెచ్‌యుఎస్‌ఇ బోర్డు ఛైర్మన్ స్టీఫెన్ బాఫోర్డ్ తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ సర్వేష్ సింగ్, ఐటీ అడ్వైజర్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో నిల్వ ఉన్న బియ్యాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు చర్యలు

- విదేశీ మార్కెట్లలో డిమాండ్ ఉన్న రకాల బియ్యాన్ని ప్రోత్సహించేందుకు ముసాయిదా విధివిధానాలను సిద్ధం చేయాలి
- విశ్వవిద్యాలయ అధికారులకు మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ బియ్యం' ఎగుమతులకు విదేశాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, రాష్ట్రంలో నిల్వ ఉన్న బియ్యాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. విదేశీ మార్కెట్లలో డిమాండ్ ఉన్న రకాల బియ్యాన్ని ప్రోత్సహించేందుకు ముసాయిదా విధి విధానాలను సిద్ధం చేయాలని విశ్వవిద్యాలయ అధికారులను ఆదేశించారు. బియ్యం ఎగుమతులకు సంబంధించిన ప్రతి అంతర్జాతీయ వేదికలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం ఉండాలన్నారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని సేకరించిన నేపథ్యంలో నిల్వల నిర్వహణపై వ్యూహాత్మక ప్రణాళిక అవసరమన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రిల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ సచివాలయంలో శనివారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకునే ఆసక్తి ఉన్న దేశాల ప్రతినిధులను ఆహ్వానించి, రెండు రోజుల పాటు సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఇతర వరి ఉత్పత్తి రాష్ట్రాల్లో ఎఫ్‌సిఐ సేకరణ స్థాయిలపై మంత్రి ఆరా తీశారు. అంతర్జాతీయ మార్కెట్లలో పరిస్థితులు అనుకూలంగా లేవని మంత్రికి అధికారులు వివరించారు. 2025–26లో భారత్ రికార్డు స్థాయిలో 160 మిలియన్ మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి సాధించే అవకాశముందన్నారు. కాగా దక్షిణాసియా దేశాలు సిల్కీ సార్టెక్స్ రైస్‌కు డిమాండ్ చూపుతున్న నేపథ్యంలో ఆ రకాల ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. సమీక్షలో యూనివర్సిటీ ఉపకులపతి ఆల్దాస్ జనయ్య, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎస్‌ఎల్ అగ్ని ప్రమాదం... కీలక ఆధారాలు దగ్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్)లో ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంపై దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ ఘటనపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ తన ప్రాథమిక నివేదికను సమర్పించింది. ప్రమాదం వల్ల భారీ స్థాయిలో కేసులకు సంబంధించిన ఆధారాలు నాశనమైనట్లు నివేదిక వెల్లడించించినట్లు సమాచారం.ప్రత్యేకంగా నాగపూర్ నుంచి వచ్చిన నిపుణుల బృందం ఘటనాస్థలాన్ని పరిశీలించి సాంకేతిక విచారణ పూర్తి చేసింది. ఈ విచారణలో సుమారు 1100 ఫైల్స్ పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించినట్లు సమాచారం. వీటిలో పలు కీలక క్రిమినల్ కేసులకు సంబంధించిన సాక్ష్యాలు, నమూనాలు, రికార్డులు ఉన్నట్లు తెలిసింది.అగ్ని ప్రమాదం కారణంగా సర్వర్లు, హార్డ్‌డిస్కులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అందులోని డేటా పూర్తిగా నశించిన అవకాశం ఉందని బృందం పేర్కొందని తెలిసింది. ప్రస్తుతం డేటా రికవరీ కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, ప్రాథమికంగా డేటాను తిరిగి పొందడం చాలా కష్టం అని నిపుణులు అభిప్రాయపడ్డట్లు సమాచారం.ఈ పరిణామం పలు న్యాయ విచారణలపై ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని తెలిసింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల పురోగతిపై దీనివల్ల అనిశ్చితి నెలకొనవచ్చని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది. ఇక భద్రతా ప్రమాణాల విషయంలో కూడా ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేపట్టింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే దిశగా చర్యలు ప్రారంభించినట్లు సమాచారం.పూర్తి స్థాయి తుది నివేదిక కోసం అధికారులు ఎదురుచూస్తుండగా, ప్రమాదానికి గల అసలు కారణాలు, బాధ్యతల అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. త్వరలో ఈ ఘటనపై పూర్తి స్థాయి నివేధిక ప్రభుత్వానికి త్వరలో ఇవ్వనున్నారు.

## బిసిలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కామారెడ్డి డిక్లరేషన్‌లో బిసిలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని, బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. హైదరాబాదులోని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం, రాజ బహదూర్ గౌడ్ హాల్‌లో శనివారం పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయబండి పాండురంగ చారితో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ బిసిల అభ్యున్నతి కోసం కట్టుబడి ఉంటామని ఎన్నికల సందర్భంగా బిసిలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు ప్రస్తుత బడ్జెట్లో బిసిలకు రూ. 55 వేల కోట్లు కేటాయించాలని, ఆ మొత్తాన్ని బిసిలకే ఖర్చు చేయాలన్నారు. బిసి విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను అందిస్తామని నేటి ప్రభుత్వం హామీ ఇచ్చి ఉన్నదని, అట్టి హామీని అమలు చేసేందుకు కట్టుబడి ఉండాలని చెప్పారు. జనాభాలో 56 శాతం ఉన్న బిసిలు అభివృద్ధి చెందకపోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. గత దశాబ్దకాలంగా రాష్ట్రంలో ఉన్న వివిధ బిసి సంఘాలు, బిసి హక్కుల సాధన సమితి క్షేత్రస్థాయిలో చేసిన పోరాటం ఫలితంగానే ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతం విజయం సాధించారని, అది బిసి చైతన్యానికి ప్రతీక అని వెల్లడించారు. త్వరలో జరగబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో నైనా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని, అందుకు రాష్ట్రంలోని బిజెపి నేతలు వారి కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి బిసిలకు న్యాయం చేసే విధంగా పోరాటం చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట బిసి హక్కుల సాధన సమితి నాయకులు శ్రీనివాస్, అంజమ్మ, ధనమ్మ ఉన్నారు.

## సోషలిజమే ప్రపంచానికి ఏకైక మార్గం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోషలిజమే ప్రపంచానికి ఏకైక మార్గమని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రపంచ ప్రజల విముక్తికి కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ఎప్పటికీ ఓ దిక్సూచిఅని ఆయన పేర్కొన్నారు. 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' ప్రచురితమైన రోజును పురస్కరించుకుని, సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెడ్ బుక్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ వెనిజులా తన చమురు సంపదను కార్పొరేట్లకు అప్పగించకుండా, జాతీయం చేసి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తుండటంతో అమెరికా చమురు క్షేత్రాల స్వాధీనానికి పాల్పడుతోందని విమర్శించారు. 'ఆర్థిక ఆంక్షలు' అనే ఆయుధంతో వివిధ దేశాల ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్న అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను తిప్పికొడదామని ఆయన పిలుపునిచ్చారు. గతంలో లాగా అమెరికా చెప్పిందే వేదం అన్నట్లుగా ఇప్పుడు ప్రపంచం లేదని, రష్యా, చైనా వంటి దేశాలు అమెరికా ఆధిపత్యాన్ని గట్టిగా ప్రతిఘటిస్తున్నాయని, ఇది చిన్న దేశాల స్వతంత్రతకు శుభపరిణామమని తెలిపారు. బ్రిటిష్ వారిని తరిమికొట్టిన ఘన చరిత్ర కలిగిన భారతదేశం, నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో అమెరికాకు ఒక జూనియర్ పార్ట్నర్ గా మారిపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విదేశాంగ విధానం స్వయంప్రతిపత్తిని కోల్పోవడం వల్ల దేశ ప్రతిష్ట మసకబారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.పెంపొందించుకోవాలని, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న అంతర్జాతీయ పోరాటాలకు మద్దతు తెలపాలని జాన్‌వెస్లీకోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి, సాగర్, ఎండి అబ్బాస్ మరియు రాష్ట్ర కేంద్రంలోని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యసభ సీటు బిసిలకే ఇవ్వండి

రాహుల్ గాంధీకి జాజుల లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం నుండి మార్చి నెలలో భర్తీ జరిగే రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి బిసికి, ఇంకోటి ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేస్తూ, లేఖ రాశారు. 'రాహుల్‌కు వ్రాసిన లేఖలో ప్రదానంగా దేశవ్యాప్తంగా కులగనన జరగాలని, కుల గణాంకాల ఆధారంగా జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి దక్కలన్న మీ యొక్క మాటలు దేశంలోని 90 కోట్ల మంది బహుజనులకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో కూడా మీ మాట అమలు జరిగితేనే దేశమంతా మిమ్మల్ని విశ్వసిస్తుంది. ముఖ్యంగా మీరు అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు చేసే దిశగా ఆలోచన చేయవలసిన అవసరం ఉన్నది. సామాజిక న్యాయ అమలే దేశంలో కాంగ్రెస్ పార్టీని అగ్ర భాగాన నిలబెడుతుంది. ఈ వాస్తవాన్ని మీరు గ్రహిస్తారని ఆశిస్తున్నా. రాజ్యసభ సీటు బడుగులకు అస్తిత్వం అయితే, అగ్రకుల ధనవంతులకు అలంకారం లాంటిది, పెద్దల సభకు పేదల అస్తిత్వం కోసం పోరాడే వారిని పంపించాలి కానీ, రాజ్యసభ సీటును అడ్డం పెట్టుకొని స్కాములు చేసే గద్దలకు అవకాశం ఇస్తే ప్రజాస్వామ్యాన్ని కునీ చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలో బిసిల కోసం సుదీర్ఘకాలంగా జీవితాంతం పనిచేస్తున్న వారు అనేక మంది కాంగ్రెస్ పార్టీలో ఉన్నా రు. అందులో అగ్రగన్యుడుగా బిసిల పితామహుడుగా వి.హనుమంతరావు ముందు వరసలో ఉం టారు. ఇలాంటి వారికి మీరు రాజ్యసభ అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారే గాకుండా తెలంగాణ ఉద్యమంలో పదవులను వదులుకొని పనిచేసినవారు, సామాజిక న్యాయం కోసం ప్రతినిత్యం పోరాడుతున్న వారు ఉన్నారు. ఇలాంటి వారిని కూడా దృష్టిలో పెట్టుకొని బిసిల విషయంలో సానుకూలంగా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. లేదంటే అగ్రకుల ధనవంతులకు, వ్యాపారస్తులకు, అవకాశం కల్పిస్తే కాంగ్రెస్ పార్టీ దేశంలోనే అధోగతి పాలవక తప్పదని సున్నితంగా హెచ్చరిస్తున్నాం' అంటూ జాజుల శ్రీనివాస్ గౌడ్ లేఖలో రాహూల్ గాంధీకి తెలిపారు.

## షార్ట్ వీడియోలతో సైబర్ మోసాలపై వినూత్న అవగాహన

- సైబర్ నేరాలపై సమరానికి పోలీసులతో ఇన్‌ఫ్లుయెన్సర్ల జత
- నవ్విస్తూనే కళ్లు తెరిపిస్తున్న కంటెంట్ క్రియేటర్లు
- సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని హైదరాబాద్ సిపి సజ్జనర్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని హైదరాబాద్ సిటీ పోలీస్, సిపి సజ్జనర్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో 'కొలాబరేట్' చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

### ఆలోచింపజేస్తున్న వీడియోలు..

ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇటీవల రూపొందించిన వీడియోలు ఎంతో వైవిధ్యంగా ఉండి నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

### లాటరీ మోసాలపై కళ్లు తెరిపిస్తూ

'దేశీ మామ్ వర్సెస్ స్కామర్' కాన్సెప్ట్‌తో రూపొందిన వీడియో ప్రాక్టికల్‌గా ఆలోచింపజేస్తోంది. 'మీకు రూ.25 లక్షల లాటరీ తగిలింది, ప్రాసెసింగ్ ఫీజు కోసం ఓటిపి చెప్పండి' అంటూ వచ్చే ఫేక్ కాల్స్‌ను ఓ గృహిణి ఎంత చాకచక్యంగా తిప్పికొట్టిందనేది ఇందులో చూపించారు. అత్యాశకు పోకుండా, అపరిచితులతో బ్యాంక్ వివరాలు, ఓటిపిలు పంచుకోకూడదనే స్పష్టమైన సందేశాన్ని బలంగా వినిపించారు.



### 'డిజిటల్ అరెస్ట్'పై కనువిప్పు

ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాల గుట్టును మరో వీడియో ద్వారా విప్పారు. సైబర్ నేరగాళ్లు సీబీఐ, పోలీస్, ఆర్బీఐ అధికారులమంటూ నకిలీ యూనిఫామ్స్ ధరించి, వీడియో కాల్స్ ద్వారా ఏ విధంగా భయభ్రాంతులకు గురిచేస్తారో కళ్లకు కట్టారు. 'భారతదేశంలో ఏ ప్రభుత్వ దర్యాప్తు సంస్థ వీడియో కాల్ ద్వారా విచారణ చేయదు' అన్న వాస్తవాన్ని ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్స్ వస్తే భయపడకుండా, తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఈ వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యేలా పోలీసులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సంయుక్తంగా చేస్తున్న ఈ ప్రయోగానికి నెటిజన్ల నుంచి అద్భుతమైన మద్దతు, ప్రశంసలు లభిస్తున్నాయి.

### ఫాలోయింగ్‌ను సమాజ హితం కోసం వాడండి : సిపి సజ్జనర్

సైబర్ నేరాల కట్టడికి మరింత మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ముందుకు రావాలని పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. 'సామాజిక మాధ్యమాల్లో మీకు విశేషమైన ఫాలోయింగ్, గుర్తింపు ఉన్నాయి. దాన్ని సమాజ మార్పు కోసం వినియోగించండి. మీ మాటలకు ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి ఉంది. సైబర్ నేరాలపై ప్రభావవంతమైన షార్ట్ వీడియోలు రూపొందించి మీ ప్లాట్‌ఫామ్స్ ద్వారా షేర్ చేయండి. సురక్షితమైన, చైతన్యవంతమైన సమాజ నిర్మాణం మనందరి ఉమ్మడి బాధ్యత' అని ఆయన పిలుపునిచ్చారు.

# ఐదు రోజుల కస్టడీకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో జరుగుతున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ వేదిక వద్ద నిరసన తెలిపినందుకు అరెస్టు చేసిన నలుగురు ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసి) కార్యకర్తలను ఢిల్లీ కోర్టు శనివారం ఐదు రోజుల పోలీసు కస్టడీకి పంపింది. నిందితులను ఐదు రోజుల కస్టడీ విచారణకు అప్పగించాలని ఢిల్లీ పోలీసులు చేసిన విజ్ఞప్తిని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రవి అనుమతించారు. అరెస్టు చేయబడిన నిరసనకారులు బిహార్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణ హరి; ఐవైసి రాష్ట్ర కార్యదర్శి కుందన్ యాదవ్; ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐవైసి రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కుమార్; తెలంగాణకు చెందిన నరసింహా యాదవ్ ఉన్నారు. వారిని ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఢిల్లీ పోలీసులు కోరారు. వారు దేశ వ్యతిరేక నినాదాలు చేశారని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభ్యంతరకరమైన చిత్రాలతో కూడిన టీషర్టులను ధరించారని వాదించారు. నిందితుల మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకోవాలని, వారు వివిధ రాష్ట్రాలకు చెందిన వారు కాబట్టి, కస్టడీ విచారణ అవసరమన్నారు. ఇది తీవ్రమైన విషయం అని పోలీసుల తరపు న్యాయవాది వాదించారు. నిరసనను పోలీసులను ఆపడానికి ప్రయత్నించగా, ముగ్గురు సిబ్బంది గాయపడ్డారని ఆయన చెప్పారు. నిరసన నిర్వహించడం వెనుక కుట్ర, నిధుల సమీకరణ, టీషర్టులు ఎక్కడ ముద్రించబడ్డాయో నిర్ధారించాల్సిన అవసరం ఉందని న్యాయవాది అన్నారు. అరెస్టు చేయబడిన నిరసనకారుల తరఫు న్యాయవాది వాదిస్తూ, వారు ఒక రాజకీయ పార్టీతో సంబంధం కలిగి ఉన్నారని, శాంతియుతంగా నిరసన తెలిపే వారి ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నారని వాదించారు. వారి అరెస్టు ప్రజాస్వామ్య గౌరవాన్ని బాగా తగ్గించిందని, నిరసన తెలిపినందుకు అరెస్టులు చేయవలసి వస్తే, పార్లమెంటులో నిరసన తెలుపుతున్న ఎంపిలను కూడా అరెస్టు చేయాలని న్యాయవాది వాదించారు.



# మానవ శ్రేయస్సుకు ఎఐ సద్వినియోగం

## ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లో ప్రపంచ దేశాలు ఏకాభిప్రాయం

## ఎఐ డిక్లరేషన్‌పై అమెరికా,చైనా సహా 85 దేశాల సంతకం

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధస్సును మానవవాళి శ్రేయస్సు–మానవాళి మంచికోసం సద్వినియోగం చేయాలని ఢిల్లీలో జరిగిన ఎ.ఐ సదస్సులో ప్రపంచదేశాలు విశాల దృక్పథంతో కూడిన ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయి. యూరోపియన్ యూనియన్, ఐఫాద్ (అంతర్జాతీయ వ్యవసాయాభివృద్ధి నిధి) కూడా సంతకాలు చేసిన జాబితాలో ఉన్నాయి. ప్రపంచదేశాలమధ్య ఆర్థిక అభివృద్ధికి ఒక కీలకమైన ఉపకరణంగా దీర్ఘకాలిక అంతర్జాతీయస్థాయి భాగస్వామ్యానికి ఇదొక అనుసంధానంగా ఉంటుంది. భారత్ మండపంలో ఫిబ్రవరి 18–19 తేదీలలో జరిగిన 'ఎఐ. ఇంపాక్ట్ సమ్మిట్– 2026'లో భారత్, బ్రిటన్, అమెరికా, చైనా, రష్యా, ఫ్రాన్స్ సహా 85 దేశాలు, మరో మూడు అంతర్జాతీయ సంస్థలు (మొత్తం 88)ఢిల్లీ డిక్లరేషన్‌పై శనివారం సంతకాలు చేశాయి. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి సమానంగా కృత్రిమ మేధ ప్రయోజనాలు చేరువకావాలని ఈ డిక్లరేషన్ బలంగా ప్రకటించింది. ఈ దేశాలు, సంస్థలు అంతర్గతంగా తమ తమ చట్టపరిధిలో అమలు చేయడానికి ఇష్టపడ్డాయి. దీంతో కృత్రిమ మేధపై అంతర్జాతీయ సహకారానికి 'ఎ.ఐ ఇంపాక్ట్ సదస్సు'లో చేసిన ఢిల్లీ డిక్లరేషన్ ప్రపంచ చరిత్రలో ఒక మైలురాయి ఘట్టంగా నమోదైందని, ఈ ప్రకటన చేయడంతో సదస్సు ముగిసిందని అధికారిక ప్రకటన తెలియజేసింది. ''సర్వజన హితాయ...సర్వజన సుఖాయ.. .అనే సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని సకల మానవాళి శ్రేయస్సు, సంతోషాన్ని ఈ డిక్లరేషన్ గట్టిగా ఉద్ఘాటించి చెప్పింది. ప్రపంచ అభివృద్ధి, సామాజిక శ్రేయస్సు, విలువలతో కూడిన మంచికోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడానికి విస్తృత ఆధారిత ప్రపంచ ఏకాభిప్రాయాన్ని ఈ సదస్సు ప్రతిబింబించింది. ఐ.టి శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేస్తూ, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన మానవ కేంద్రీకృత కృత్రిమ మేధస్సు దార్శనిక దృక్పథాన్ని 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఆమోదించి ఢిల్లీ డిక్లరేషన్‌పై సంతకం చేశాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ కోసం అంతర్జాతీయ సహకారం ఉండాలని, అనేక సంస్థలు, వ్యవస్థలు ఈ బాధ్యతలు నిర్వహించేటప్పుడు కృత్రిమ మేధ ప్రయోజనాలను సమానస్థాయిలో ప్రపంచ మానవాళికి చేరువ చేసే కృషిలో అంతర్జాతీయ నియమాలను, దేశాల సార్వభౌమాధికారాలను గౌరవించాలని ఏకాభిప్రాయం ప్రకటించాయి. ఏడు కీలకమైన అంశాలను మూలస్తంభాలుగా చేసుకుని ఢిల్లీ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఇందులో ప్రధానంగా కృత్రిమ మేధకు అంతర్జాతీయ సహకారామే ప్రధాన పునాదిగా ఉంటుంది. దీనివల్ల కృత్రిమ మేధ వనరులను, ఆర్థికవృద్ధిని, సామాజికంగా ఉండే సద్భావన, భద్రత, ఎ.ఐ విశ్వసనీయత, కాలానికి తట్టుకుని నిలబడగల కృత్రిమ మేధ వ్యవస్థను, సామర్థ్యాన్ని, సహకారాన్ని, ఎ.ఐ వ్యవస్థల నవీన ఆవిష్కరణలను ప్రజాస్వామ్యీకరణ చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికక్కడ వ్యవస్థాగతంగా చేసే ఆవిష్కరణలను పరస్పరం పంచుకుంటాయి. అమెరికా, చైనా, రష్యా, బ్రిటన్, భారత్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బెల్జియం, భూటాన్, బ్రెజిల్, కెనడా, డెన్మార్క్, ఎస్తోనియా, ఇథియోపియా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్, ఐర్లాండ్, ఇండోనేసియా, ఇరాన్, హంగరీ, గ్రీస్, జర్మనీ, ఫిన్లాండ్, మెక్సికో, మయన్మార్, నేపాల్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, నార్వే, ఒమన్, ఫిలిప్పీన్, పెరూ,రొమేనియా, సెనెగల్,సింగపూర్, దక్షిణకొరియా, స్పెయిన్, శ్రీలంక, స్వీడన్, స్విట్జర్లాండ్, టాంజానియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉక్రేన్ తదితర దేశాలు ఢిల్లీ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి.




# బివాండి కోర్టుకు రాహుల్‌గాంధీ



**భివాండి:** మహారాష్ట్రలో నమోదైన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారంనాడు బివాండి కోర్టుకు హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త రాజేష్ కుంటే వేసిన పరువు నష్టం కేసులో కొత్త పూచీకత్తు సమర్పించేందుకు రాహుల్ కోర్టుకు వచ్చారు. రాహుల్‌కు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సక్పాల్ పూచీకత్తు ఇచ్చారు. ఇంతకుముందు గ్యారెంటర్‌గా ఉన్న కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ చకుర్కర్ గత డిసెంబర్‌లో కన్నుమూశారు. దీంతో కొత్త పూచీకత్తును కోర్టుకు సమర్పించేందుకు రాహుల్ హాజరయ్యారు. లీగల్ ప్రొసీడింగ్స్‌లో భాగంగా తాజా బెయిల్ బాండుపై రాహుల్ సంతకం చేశారు. ఈ కేసులో కొత్త గ్యారెంటర్‌గా సక్పాల్ కూడా హాజరయ్యారు. రాహుల్ తరఫున న్యాయవాది నారాయణ అయ్యర్ మాట్లాడుతూ, బెయిల్ ఫార్మాలిటీస్ పూర్తి చేశామని చెప్పారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, ఈ కేసులో తమకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో జరగనున్న విచారణలకు రాహుల్ వ్యక్తిగతంగా హాజరుకావడం నుంచి శాశ్వత మినహాయింపు మంజూరైందని, సరైన సమయంలో డిఫెన్స్ సాక్ష్యాలను కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి...

# 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్' రూల్స్-2026 అమలు

### సుప్రీంకోర్టు వెల్లడి

### తడి, పొడి, శానిటరీ, స్పెషల్‌కేర్ మౌలిక సదుపాయాలను వేగవంతం చేయాలని కాలుష్య నియంత్రణ బోర్డులకు ఆదేశాలు

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యుఎం) రూల్స్ ను 'అసమానంగా' పాటించడాన్ని సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. ప్రస్తుత తరం అమలులో అంతరాలు కొనసాగుతున్నప్పుడు మరింత శాసన మెరుగుదల కోసం వేచి ఉండలేరని స్పష్టంచేసింది. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పొందే హక్కు జీవించే హక్కులో 'విడదీయరాని భాగం' అని గమనించిన సుప్రీంకోర్టు ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చే ఎస్‌డబ్ల్యుఎం రూల్స్ 2026ను అమలు చేయడానికి కార్యనిర్వాహకుడికి అవసరమైన యంత్రాంగం ఉండేలా చూసుకోవడానికి అనేక అసమాన ఆదేశాలను జారీ చేసింది. మున్సిపల్ ఘనవ్యర్థాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆర్థికవ్యవస్థ ఎంత ప్రభావితం అవుతుందో ఆరోగ్యం కూడా అంతే ప్రభావం చూపుతుందని న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. టెక్నాలజీ సంబంధిత కార్యకలాపాలలో ప్రపంచం దేశం వైపు చూసే సమయంలో భారత దేశం 2026 రూల్స్‌ను పూర్తిగా పాటించాలని ధర్మాసనం పేర్కొంది. 'వ్యర్థాల నిర్వహణను నియంత్రించడానికి నిర్దేశించిన ఎంఎస్‌డబ్ల్యు/ఎస్‌విఎం నియమాల పోలిక భారతదేశం అంతటా అసమానంగా ఉంది. మూలం వద్ద తడి, పొడి, ప్రమాదకరమైన చెత్త ప్రవాహాలను వేరుచేయడం ఇప్పటికీ అనేక పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పూర్తి కాలేదు' అని ధర్మాసనం ఫిబ్రవరి 19న జారీ చేసిన తన ఆదేశంలో పేర్కొంది. మెట్రోపాలిటన్ ప్రాంతాలలో భారీ చెత్తకుప్పలు పేరుకుపోయాయని, తాజా ఆదేశాల ప్రకారం బయోరెమిడియేషన్ ప్రయత్నాలు ప్రారంభించబడ్డాయని బెంచ్ తెలిపింది. భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌డబ్ల్యుఎం రూల్స్2026 ప్రకారం పర్యావరణ సమ్మతికి సంబంధించిన రెండు వేర్వేరు ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాల నుంచి రెండు అప్పీళ్లను విచారిస్తూ కోర్టు ఈ ఉత్తర్వులను జారీ చేసింది. పర్యావరణాన్ని పరిరక్షించడం, నగర శ్రేయస్సును నిర్ధారించడం ప్రభుత్వం విధి అని కోర్టులు పదేపదే గుర్తుచేశాయని ధర్మాసనం పేర్కొంది. 'కౌన్సిలర్లు/మేయర్లు వారి చైర్‌పర్సన్స్, కార్పొరేటర్ లేదా వార్డు మెంబర్ ప్రజలు ప్రాథమికంగా ఎన్నుకున్న ప్రజాప్రతినిధి కాబట్టి మూల విభజన విధ్యకు ప్రధాన సహాయకులుగా నియమించబడ్డారు. 2026 రూల్స్ అమలులో వారి వార్డులోని ప్రతీ పౌరుడిని నమోదు చేయడం వారి చట్టబద్ధమైన విధి' అని బెంచ్ వ్యాఖ్యానించింది. ఘన పదార్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాల ఆడిట్‌ను జిల్లా కలెక్టర్ల ద్వారా నిర్వహించాలని ఆ ఆదేశంలో తెలిపింది. వ్యర్థాల తొలగింపునకు మౌలిక సదుపాయాల సంసిద్ధతలో వాస్తవ పురోగతిని ధృవీకరించడానికి స్థానిక సంస్థలు తమ సమ్మతి నివేదికలతో పాటు ఫోటోగ్రాఫిక్ ఆధారాలను జిల్లా కలెక్టర్ల కార్యాలయాలకు ఇమెయిల్ చేయాలని ఆదేశించింది. నాలుగు ప్రవాహ విభజనకు అవసరమైన మౌలిక సదుపాయాల సౌకర్యాలను గుర్తించి వేగవంతం చేయాలని కాలుష్య నియంత్రణ బోర్డులను ఆదేశించింది. వీటిలో బల్క్ (తడి, పొడి, శానిటరీ, స్పెషల్ కేర్) ఉన్నాయి. స్థానిక సంస్థలు వెంటనే 2026 రూల్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశం కాపీని గుర్తించిన వారికి అందరికీ అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. బల్క్‌వేస్ట్ జనరేటర్లు ఇవన్నీ మార్చి 31నాటికి చట్టబద్ధంగా ఉండాలని తెలియజేసింది. 2026 రూల్స్‌లోని 33వ నియమం ప్రకారం పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, పాఠశాల పాఠ్యాంశాల్లో కూడా ఘన పదార్థాల నిర్వహణ పద్ధతులు సముచితంగా చేర్చబడతాయని నిర్ధారించుకోవడానికి తగిన ఆదేశాలను జారీ చేయాలని కోర్టు పేర్కొంది. ఇకపై ఈ నిబంధనలను పాటించడంలో వైఫల్యాన్ని ఇకపై పరిపాలనా లోపంగా పరిగణిస్తామని, ప్రారంభంలో జనరేటర్లు ఏర్పాటు చేయనట్లయితే స్థానిక అథారిటీకి వెంటనే జరిమానా చర్యలు విధించడం వంటి అమలు చర్యలు ఉంటాయని వెల్లడించింది. 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చే తేదీకి ముందే సన్నాహక పనులను నిర్ధారించడానికి ఈ ఆదేశాలు జారీచేస్తున్నామని ధర్మాసనం తెలిపింది. 'మేం మా కోర్టులు, ట్రిబ్యునల్స్‌ను బాధ్యయుతమైన సంస్థలుగా పరిగణిస్తాం. హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, చైర్‌పర్సన్‌లు 2026 ఏప్రిల్ 1వ తేదీ నరుంచి రూల్స్ అమలులోకి వచ్చేలా వారి అధికార పరిధిలోని అన్ని కోర్టుల ట్రిబ్యునల్స్ ఎస్‌డబ్ల్యుఎం రూల్స్,2026కు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని అభ్యర్థిస్తున్నాం' అని బెంచ్ తెలిపింది.



# సీట్ల పంపకాలపై ఏడుగురితో డిఎంకె కమిటీ

**చెన్నై :** తమిళనాడులో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భాగస్వామ్యక్షాలతో చర్చలు జరిపేందుకు పార్టీ సీనియర్ నేత టిఆర్ బాలు నేతృత్వంలో ఏడుగురు మంది సభ్యులతో కూడిన సీట్ల పంపకాల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు అధికార డిఎంకె శనివారం ప్రకటించింది. ఇటీవలే డిఎండికెతో ఎన్నికల ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. కాగా, ఆదివారం నుంచి పార్టీ మిత్రపక్షాలతో సీట్ల పంపకాల చర్చలను ప్రారంభించే అవకాశం ఉందని డిఎంకె వర్గాలు తెలిపాయి. డిఎండికెకు మద్దతు ఇవ్వడంతో పాటు ఈ ఎన్నికల కోసం కాంగ్రెస్‌కు మరిన్ని సీట్లు కేటాయించే అవకాశం ఉంది. తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వానికి ఎలాంటి అవకాశం లేదని తోసిపుచ్చుతూ, డిఎంకె మిత్రపక్షమైన ఎండిఎంకె అధినేత వైకో, ద్రవిడ ప్రధాన పార్టీ తన సొంత మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తుందని అన్నారు. '2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని వైకో అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు తమ బల ప్రదర్శనకు పెద్దగా పరీక్ష కావని, డిఎంకె చాలా స్థానాల్లో విజయం సాధిస్తుందని, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశం లేదని నేను పునరుద్ఘాటించాలనుకుంటున్నానని వైకో శనివారం దక్షిణ జిల్లా తిరునల్వేలిలో విలేకరులతో అన్నారు. 'మా నాయకుడు (స్టాలిన్) మిత్రపక్షాలను ఎన్నికల మోడ్‌లోకి తెచ్చారు. హామీ ఇచ్చినట్లుగా, మా అధ్యక్షుడు కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీలు ఉమ్మడి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టడానికి వీలుగా ఈ నెలాఖరు లేదా వచ్చే నెల ప్రారంభంలో చర్చలను వేగవంతం చేసి, వాటిని ముగించనున్నారు' అని డిఎంకె సీనియర్ నాయకుడు ఒకరు అన్నారు. కాగా, శనివారం తన బూత్ కమిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం, సభ్యత్వ డ్రైవ్ చేపట్టడంపై దృష్టి సారించిన డిఎంకె, మిత్రదేశాలతో చర్చలు ప్రారంభించడానికి ప్యానెల్ ఏర్పాటు చేయబడిందని తెలిపింది. పార్టీ కోశాధికారి బాలు కమిటీకి నాయకత్వం వహిస్తారు. డిఎంకె ప్రధాన కార్యదర్శి కె.ఎన్. నెహ్రూ, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు: తిరుచ్చి శివ, ఎ. రాజా, ఆర్గనైజేషన్ సెక్రటరీ ఆర్.ఎస్. భారతి, డిఎంకె ఉన్నత స్థాయి కార్యనిర్వాహక కమిటీ సభ్యులు: ఇ.వి. వేలు, ఎం.ఆర్.కె. పన్నీర్ సెల్వం, కమిటీ సభ్యులలో ఉన్నారు. డిఎంకె ఈ ప్రకటన చేసిన కొన్ని గంటలకే, వైకో తన ఎండిఎంకె తరపున ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నలుగురు సభ్యుల ప్యానెల్‌లో ఎండిఎంకె కౌన్సిల్ చైర్మన్ అర్జున రాజ్, కోశాధికారి ఎం సెంథిల్‌దీపన్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యుడు సు జీవన్, ఎన్నికల కార్యదర్శి వి. శేషన్ ఉన్నారు. 'ఈ కమిటీ 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం లౌకిక ప్రగతిశీల కూటమికి నాయకత్వం వహిస్తున్న డిఎంకెతో చర్చలు జరుపుతుంది' అని పార్టీ ప్రధాన కార్యదర్శి వైకో ఒక ప్రకటనలో తెలిపారు. విసికె, సిపిఐ, సిపిఐ(ఎం)లు స్పాలోని ఇతర మిత్రపక్షాలు ఉన్నాయి.



# అన్ని భాషలూ సమాన గౌరవానికి అర్హమైనవి : మమత

**కోల్‌కతా :** ప్రపంచంలోని అన్ని భాషలు సమాన గౌరవానికి అర్హమైనవని, ఏ విధమైన దాడి నుంచి అయినా వాటిని రక్షించాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సూచించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు ఆమె తెలిపారు. భాషా ఉద్యమాల సమయంలో మరణించిన వారికి నివాళులు అర్పిస్తూ, బెనర్జీ తన ప్రభుత్వం భాషా వైవిధ్యాన్ని గౌరవిస్తుందని, అనేక భాషలకు అధికారిక గుర్తింపు ఇచ్చిందని అన్నారు. బెంగాలీ గొప్ప సాహిత్య వారసత్వం కలిగిన భాష మాత్రమే కాదు, అన్ని భాషా వర్గాలను గౌరవించాలనే విస్తృత నిబద్ధతలో భాగమని ఆమె అన్నారు. 'ప్రతి వ్యక్తి, వారు ఏ భాష మాట్లాడినా, రాష్ట్రంలో వారి మాతృభాషలో చదువుకునే అవకాశం ఉందని శుక్రవారం మమతా బెనర్జీ ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్రం అనేక భాషా సమూహాల కోసం భాషా అకాడమీలను ఏర్పాటు చేసిందని బెనర్జీ అన్నారు. ఈ పవిత్ర రోజున, ఏదైనా భాష దాడికి గురైతే, మనమందరం దానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడతామన్న తన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిస్తున్నామని, అన్ని భాషలు సమాన గౌరవానికి అర్హమైనవని అన్నారు.



# మార్కెట్లను కుదిపేస్తున్న అమెరికా!



**ముంబయి:**ఈవారం చివరిలో చోటు చేసుకున్న పరిణామాలు, వచ్చే వారం కూడా ప్రపంచ స్టాక్, బులియన్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపనుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ఆయుధంగా ప్రపంచ దేశాలపై దాడి చేసిన టారిఫ్‌లను అక్కడి సుప్రీం కోర్టు కొట్టివేయడంతో పరిస్థితుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. ట్రంప్ విడత అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ దేశాలపై విస్తృత సుంక విధానాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. అమెరికాకు వాణిజ్య లోటు కలుగుతోందని, ఇతర దేశాలు అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్నాయని ఆరోపిస్తూ ఆయన పరస్పర సుంకాల పేరుతో కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. కొన్ని దేశాలపై భారీ శాతం అదనపు దిగుమతి సుంకాలు విధించడంతో అంతర్జాతీయ వాణిజ్యం తీవ్రంగా ప్రభావితమైంది. కాగా, అమెరికా సుప్రీంకోర్టు ఈ విస్తృత సుంక ఉత్తర్వులను రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రద్దు చేయడంతో, రాజకీయ, మార్కెట్లలో ప్రకంపనలు చెలరేగాయి. ట్రంప్ ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తాత్కాలికంగా అన్ని దిగుమతులపై 10 శాతం సర్‌చార్జ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. కోర్టు తీర్పు ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నంగా ఈ చర్యను విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాల ప్రభావం గ్లోబల్ ఆర్థిక మార్కెట్లపై తక్షణమే కనిపించింది. ముఖ్యంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. అనిశ్చితి పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సాధారణంగా సురక్షిత ఆస్తుల వైపు దృష్టి మళ్లించడం సహజం. మిగతా రంగాలతో పోలిస్తే బులియన్ మార్కెట్ మాత్రమే సురక్షితమైనదిగా మదుపరులు భావిస్తుంటారు. అందుకే, బంగారం కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అదే సమయంలో అమెరికా డాలర్ విలువలో తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయి. డాలర్ పతనమవుతుందనే అభిప్రాయంతో, బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నాయి.

# కేరళలో 9 లక్షల ఓట్లు తొలగింపు

### రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 2.69 కోట్లు

### ఓటరు జాబితాను విడుదల చేసిన ఇసిఐ

**తిరువనంతపురం:** కేరళలో ఎన్నికల సంఘం 'సర్' ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ప్రక్రియ ముగిసిన తరువాత శనివారం ఇసిఐ ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. జాబితా ప్రకారం.. కేరళలో మొత్తం ఓటర్ల సంఖ్య 2.69 కోట్లకుపైగా ఉంది. నవీకరించబడిన జాబితాలో ప్రజలు తమ పేర్లను తనిఖీ చేసుకోవడానికి వీలుగా భారత ఎన్నికల సంఘం (ECI) http://electoralsearch.eci.gov.in అనే లింక్‌ను షేర్ చేసింది. ఇసిఐ విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం... రాష్ట్రంలో తాజా ఓటర్ల జాబితాలో 2,69,53,644 మంది ఓటర్లు ఉన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో సర్ ప్రారంభానికి ముందు 2,78,50,855 మంది ఓటర్లు ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ తర్వాత 8,97,211 మంది ఓటర్లను తొలగించినట్లు ఇసిఐ తెలిపింది. సవరించిన జాబితాలో మొత్తం పురుష ఓటర్ల సంఖ్య 1,31,26,048, మహిళా ఓటర్లు 1,38,27,319, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 277 అని అధికారులు తెలిపారు. నవీకరించబడిన జాబితాలో విదేశీ ఓటర్ల సంఖ్య 2,23,558, సర్వీస్ ఓటర్లు 54,110. సర్ ప్రొసీడింగ్స్‌లో భాగంగా 36.88 లక్షల మంది ఓటర్లకు విచారణ కోసం నోటీసులు జారీ చేశామని, 53,229 మందిని తుది జాబితా నుండి మినహాయించామని ఇసి అధికారులు తెలిపారు. 2025 స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలో 2,86,07,658 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 31, ఫిబ్రవరి 16 మధ్య సవరణ, చేరిక, తొలగింపు కోసం అదనంగా 4,01,368 దరఖాస్తులు వచ్చాయని ఇసిఐ తెలిపింది. మార్పులు, చేర్పుల అనంతరం తుది జాబితా విడుదలైన తర్వాత బాధిత ఓటర్లు తమను సంప్రదించవచ్చని ఇసిఐ తెలిపింది. అలాగే, తుది జాబితాను రాజకీయ పార్టీలకు ధృవీకరణ కోసం అందించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసే చివరి రోజు వరకు ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చవచ్చని అధికారులు తెలిపారు.



# లంచం తీసుకుంటూ దొరికిపోయిన బిజెపి ఎమ్మెల్యే

**న్యూఢిల్లీ :** కర్ణాటకలో ప్రతిపక్ష బిజెపి ఎమ్మెల్యే చంద్రులామని లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. కాంట్రాక్టర్ల నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు వల వేసి పట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే చంద్రులామనిని అరెస్టు చేశారు. ఈ ఘటన కర్ణాటక, గడగ్ జిల్లాలో శనివారం జరిగింది. అరెస్టైన ఎమ్మెల్యే చంద్రులామని షిరాహట్టి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గడగ్ జిల్లాలో నీటి పారుదల శాఖకు సంబంధించి చేపట్టిన ఒక పనికి అనుమతి, ఆమోదం కోసం విజయ్ పూజార్ అనే క్లాస్1 కాంట్రాక్టర్ నుంచి ఎమ్మెల్యే చంద్రు లంచం డిమాండ్ చేశారు. అనుమతులు ఇచ్చి క్లియరెన్స్ రావాలంటే తనకు రూ.11 లక్షలు చెల్లించాల్సిందే అని పట్టుబట్టారు. దీంతో కాంట్రాక్టర్ కర్ణాటకలో అవినీతి నిరోధక విభాగం అయిన లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదుతో లోకాయుక్త పోలీసులు వలపన్ని ఎమ్మెల్యేను నేరుగా పట్టుకునేందుకు ప్లాన్ వేశారు. సీనియర్ అధికారుల సలహాతో ఎమ్మెల్యేను పట్టుకునేందుకు తగిన ట్రాప్ రూపొందించారు. లంచంతో పట్టుబడ్డ తర్వాత తప్పించుకునేందుకు వీలు లేకుండా, తగిన ఆధారాలు సేకరించేలా ఈ ట్రాప్ నడిపించారు. అధికారులు ఊహించినట్లుగానే ఎమ్మెల్యే.. కాంట్రాక్టర్ దగ్గరి నుంచి లంచం తీసుకున్నారు. రూ.11 లక్షలకుగాను, అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు తీసుకోగా అధికారులు ఎమ్మెల్యేను పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ కేసుతో సంబంధం ఉన్న ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరిని కూడా అరెస్టు చేశారు. పూర్తి ఆధారాలతో ముగ్గురిని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఇంకా విచారణ కొనసాగుతోంది. కర్ణాటకలో లంచాలు, అవినీతిని అరికట్టడంలో లోకాయుక్త కీలకంగా పని చేస్తోంది.



# మార్చి 31 నాటికి నక్సలిజం అంతం

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటన

**గువాహటి :** ప్రభుత్వం నిర్దేశించిన మార్చి 31 గడువు నాటికి దేశం నుండి నక్సలిజం నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. శుక్రవారం అసోం గువాహటిలో జరిగిన 87వ సిఆర్‌పిఎఫ్ దినోత్సవ పరేడ్‌లో పాల్గొని ప్రసంగించారు. జమ్ముకశ్మీర్‌లో సిఆర్‌పిఎఫ్ ముఖ్యమైన పాత్ర పోషించిందని, రాళ్ల దాడి ఘటనల సంఖ్య సున్నాకి పడిపోయిందని, మణిపూర్‌లో జాతి హింసను నిరోధించడానికి, మావోయిస్టుల వెన్ను విరగ్గొట్టడానికి ఈ దళం మోహరించబడిందని షా అన్నారు. దేశంలోని 12 రాష్ట్రాలు, లెక్కలేనన్ని జిల్లాల్లో నక్సలిజం వ్యాపించిందని, కేంద్రం ఈ ముప్పును నిర్మూలించాలని నిర్ణయించుకున్నప్పుడు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా దళ సిబ్బంది ఈ ప్రయత్నంలో అత్యంత కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. ఇంత పెద్ద, సంక్లిష్టమైన, కష్టమైన పనిని కేవలం మూడు సంవత్సరాలలోనే పూర్తి చేశామని హోంమంత్రి పేర్కొన్నారు. సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కారణంగా, మార్చి 31, 2026 నాటికి దేశం నక్సలిజం నుండి పూర్తిగా విముక్తి పొందుతుందని కచ్చితంగా విశ్వసిస్తున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట కొండలలో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ నిర్వహించి 2025 ఏప్రిల్–మే నెలల్లో 31 మంది నక్సల్స్‌ను హతమార్చారని షా ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది 21 రోజుల పాటు అత్యంత సవాలుతో కూడిన భౌగోళిక పరిస్థితులలో 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకుని ఆపరేషన్ నిర్వహించారని, నక్సలైట్ల కోటను నిర్మూలించారని షా అన్నారు. దేశాన్ని 'రెడ్ టెర్రర్' నుండి విముక్తి చేయడంలో సిఆర్‌పిఎఫ్, కోబ్రా దళం చాలా ముఖ్యమైన కృషి చేశాయని షా అన్నారు. కాగా, శనివారం 14 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లకు శౌర్య పతకం లభించిందని, ఐదుగురికి రాష్ట్రపతి విశిష్ట సేవ కోసం పోలీసు పతకం లభించిందని, ఐదు బెటాలియన్లకు అత్యుత్తమ ప్రదర్శనల కోసం పతకాలతో సత్కరించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ జిపి సింగ్, అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.






## సూడాన్‌లో జాతి సంహారం!



ఒక జాతిని సమూలంగా తుడిచిపెట్టడానికి ప్రపంచం నలుమూలలా ప్రయత్నాలు జరుగుతునే ఉన్నాయి. పాలస్తీనియన్లను తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రయత్నం చేస్తున్న విషయం ఓ బహిరంగ రహస్యం. సూడాన్‌లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. అక్కడి ఉత్తర దార్ఫూర్ రాష్ట్ర రాజధాని ఎల్ ఫషేర్‌పై పారామిలిటరీ బలగం 'ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్' (ఆర్‌ఎస్‌ఎఫ్) జరిపిన దాడులు, కొనసాగించిన ఆక్రమణలు జాతి సంహార లక్షణాలతో కొనసాగుతున్నాయని ఐక్యరాజ్య సమితి నియమించిన దర్యాప్తు బృందం నివేదిక వెల్లడించింది.



సుమారు 18 నెలల పాటు జరిగిన ఈ ముట్టడి సమయంలో, జఘావా, ఫూర్ వంటి ప్రత్యేక జాతి వర్గాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని ఈ బృందం నిర్ధారించింది. ఆ నివేదకను అనుసరించి, జఘావా, ఫూర్ వంటి జాతులను నాశనం చేయడానికి విధ్వంసకర పరిస్థితులు సృష్టించారు. ఈ యుద్ధం 2023 ఏప్రిల్‌లో మొదలైంది. మిత్రులుగా ఉన్న ఆర్‌ఎస్‌ఎఫ్ అధినేత మహమ్మద్ హమ్దాన్ దగాలో, సూడాన్ సైన్యాధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ అల్‌బుర్హాన్ మధ్య విభేదాలు తలెత్తడంతో, పరస్పర దాడులు మొదలయ్యాయి. సైన్యం, ఆర్‌ఎస్‌ఎఫ్ మధ్య జరిగిన ఘర్షణల ఫలితంగా దేశవ్యాప్తంగా తీవ్రమైన హింస చెలరేగింది. గతంలో జంజావీద్ మిలీషియా దాడులతో, దార్ఫూర్ ప్రాంతంలో ఇప్పటికే దాదాపు 3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. మరోసారి ఆ ప్రాంతం రక్తసిక్తమైంది. ఎల్ ఫషేర్ పట్టణాన్ని ఆర్‌ఎస్‌ఎఫ్ దళాలు స్వాధీనం చేసుకున్న తర్వాత మూడు రోజుల పాటు భయానక హింస కొనసాగింది. వేలాదిగా హత్యలు జరిగాయి. అత్యాచారాలు సామాన్యమయ్యాయి. బాధితుల్లో జఘావా సమాజానికి చెందినవారే అధికం. 7 సంవత్సరాల బాలిక నుంచి 70 సంవత్సరాల వృద్ధురాలి వరకూ, ఎంతోమంది బాలికలు, మహిళలు, చివరికి గర్భిణులు కూడా లైంగిక హింసకు గురయ్యారు. కొన్నిచోట్ల సామూహిక హత్యలు జరిగిన ప్రదేశాల్లోనే గ్యాంగ్ రేప్‌లు జరిగాయని సాక్ష్యాలు వెల్లడించాయి. ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు కూడా హింసకు కేంద్రాలయ్యాయి. దర్యాప్తు బృందం 320మంది బాధితులు, సాక్షులను విచారించి, అనేక వీడియోలను ధృవీకరించింది. ఈ చర్యలు యుద్ధంలో జరిగిన యాదృచ్ఛిక దాడులు కావని, ముందుగా రచించిన ప్రణాళిను అనుసరించి, జరిగిన జాతి హననమని ఆ నివేదిక స్పష్టం చేసింది. రెండు వర్గాల ఆధిపత్య పోరాటం కొన్ని జాతుల ఉనికి లేకుండా చేయడానికి కారణమవుతుందనేది ఇప్పుడు సూడాన్ చెప్తున్న చేదు నిజం. రేపు చరిత్రలో నిలిచిపోయే దారుణం.

## 'ఫ్లోరియానా' పునరుద్ధరణ




గాలాపగోస్ దీవుల్లోని ఫ్లోరియానా దీవికి సుమారు 180 సంవత్సరాల తర్వాత మళ్లీ ఫ్లోరియానా జెయింట్ టార్టాయిస్‌ను పునరుద్ధరించారు. ఈ టార్టాయిస్ ఉపజాతి 1840లలో తిమింగల వేటగాళ్ల కారణంగా అంతరించిపోయింది. వారంతా తమతమ దీర్ఘ సముద్రయానాల్లో ఆహారంగా ఉపయోగించేందుకు వేలాది భారీ తాబేళ్లను తీసుకెళ్లారు. ఈ కారణంగా ఫ్లోరియానా దీవిలో ఈ జాతి పూర్తిగా నశించింది. అయితే 2008లో ఇసబెలా దీవిలోని వోల్ఫ్ అగ్నిపర్వత ప్రాంతంలో కనుగొన్న కొన్ని తాబేళ్లు ఫ్లోరియానా జాతికి వంశపారంపర్య సంబంధం ఉన్నవిగా గుర్తించారు. వాటిలో కొన్నింటికి ఫ్లోరియానాకు ప్రత్యేకమైన సాడిల్‌బ్యాక్ ఆకారపు గుల్ల ఉంది. ఈ ఆధారంతో 2017లో బ్యాక్ బ్రీడింగ్ అనే సంరక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఫ్లోరియానా జాతికి అత్యంత సమీప జన్యుపరమైన లక్షణాలు కలిగిన 23 మిశ్రజాతి తాబేళ్లను ఎంపికచేసి సంరక్షణలో పెంపకం చేశారు.2025 నాటికి 600కిపైగా పిల్ల తాబేళ్లు జన్మించాయి. వాటిలో 158 చిన్న వయసు తాబేళ్లను తాజాగా ఫ్లోరియానా దీవిలో తిరిగి విడిచిపెట్టారు. ఈ పునరుద్ధరణ ఫ్లోరియానా ఎకలాజికల్ రిస్టోరేషన్ ప్రాజెక్ట్ ద్వారా సాధ్యమైంది. మూడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన దాడి జాతుల నిర్మూలన కార్యక్రమం ద్వారా ఎలుకలు, అడవి పిల్లుల సంఖ్య తగ్గించడంతో తాబేళ్ల పునరాగమనానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.



## చంద్రుడిపై వింతజీవి!

ఏ దేశమైనా తన సైనిక, రక్షణ అవసరాల కోసం ఉపయోగించుకునే ప్రాంతాల విషయంలో గోప్యతను పాటిస్తుంది. అమెరికా కూడా అదే విధంగా 'ఏరియా 51' గురించిన సమాచారాన్ని దాచిపెట్టింది. అత్యంత సహజమైన విధానాన్ని గ్రసాంతరవాసులను బంధించిన ప్రాంతం కాబట్టే వివరాలు తెలపడం లేదని వాదన చేయడం హాస్యాస్పదం. ఈ మూర్ఖత్వానికి పరాకాష్టగా, చంద్రుడిపై వింతజీవి సంచార వార్తను పేర్కోవాలి. మనకు కనిపించని చంద్రుడి రెండోవైపు మోకాళ్లపై కూర్చున్న వింత జీవి కనిపించిందని, అది ముమ్మాటికీ గ్రహాంతరవాసేనని సోషల్ మీడియాలో వార్తలు ఊదరకొడుతున్నాయి. కానీ, ఈ వార్తలకు ఎలాంటి ధ్రువీకరణ లేదు. అంతేకాదు, మోకాళ్లపై ఉన్న భంగిమ వంటి వివరాలు సాధారణంగా విజ్ఞాన కంటే కల్పిత కథనాలకు ఎక్కువగా అనుకూలం. గ్రహాంతర జీవుల అనాటమీ, ప్రవర్త న, సామాజిక వ్యవస్థల గురించి మనకు ఎలాంటి ప్రత్యక్ష సమాచారం లేదు. శాస్త్రం ప్రస్తుతం పరిశీలిస్తున్నది జీవానికి అవసరమైన మూలకాలు (కర్బనం, నీరు, శక్తి వనరులు), అనుకూల వాతావరణ పరిస్థితులు మాత్రమే. అసాధారణ వాదనలకు అసాధారణ సాక్ష్యం అవసరం.

## గ్రహాంతరవాసులపై చర్చ..



ఎన్నో దశాబ్దాలుగా గ్రహాంతరవాసుల ఉనికిపై చర్చ జరుగుతునే ఉంది. ఇప్పుడు మరింత ఊపందుకుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒక పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఏలియన్లు ఉన్నమాట నిజమేనని అంగీకరించినట్టు వచ్చిన వార్తే అందుకు కారణం. నిజానికి, బ్రియాన్ టైలర్ కొహెన్ పోడ్‌కాస్ట్‌లో ఆయనను ఏలియన్ల ఉనికి గురించి అడగగా, 'వాళ్లు ఉన్నారు, కానీ నేను చూడలేదు' అని సరదాగా సమాధానమిచ్చారు. అయితే, ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో, ఇన్‌స్టాగ్రామ్‌లో స్పష్టీకరణ ఇచ్చారు. విశ్వం ఎంతో విస్తృతమైందని, ఇతర గ్రహాల్లో జీవం ఉండే అవకాశాలు గణాంకపరంగా ఉన్నప్పటికీ, భూమిని ఏలియన్లు సందర్శించినట్టు తన అధ్యక్షకాలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. అలాగే నెవాడాలోని 'ఏరియా 51'లో గ్రహాంతరవాసులను దాచిపెట్టారనే ఆరోపణలను కూడా ఖండించారు. ఇలావుంటే, 'ఏరియా 51' గురించి రకరకాల కథనాలు ప్రచారమవుతున్నాయి. అక్కడ ఏలియన్స్‌ను క్యాప్సూల్స్‌లో బంధించి ఉంచారన్న వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

— బిఎస్ఎస్ మైత్రేయి

## ట్రంప్ దురహంకారానికి సుప్రీంకోర్టు చెంపపెట్టు

రెండవసారి అధ్యక్ష భవనంలో అడుగిడిన డోనాల్డ్ ట్రంప్ గత సంవత్సరకాలంగా తమతో వాణిజ్యం నిర్వహిస్తున్న దాదాపు అన్ని దేశాలపై ఇష్టారాజ్యంగా అదనపు సుంకాలు విధిస్తూ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భయోత్పాతం సృష్టించారు. అగ్రరాజ్య అహంకారంతో ప్రపంచ దేశాలను బెదిరించి లొంగదీసుకునేందుకు సుంకాలను ఆయుధంగా ప్రయోగించాడు. ఇది రాజ్యాంగరీత్యా చెల్లుబాటుకాదని అమెరికా సుప్రీంకోర్టు శుక్రవారం 6–3తో మైలురాయిలాంటి తీర్పు ఇచ్చింది. ముగ్గురు లిబరల్ జడ్జీలతో ముగ్గురు మితవాద జడ్జీలు ఏకీభవించటంవల్ల ఈ తీర్పు సాధ్యమైంది. ట్రంప్ ఏకపక్ష వాణిజ్య యుద్ధంలో రాజకీయాలను అలా పక్కనపెడితే, న్యాయమూర్తులకు సంబంధించి రాజ్యాంగమే ప్రమాణం. అయితే అమెరికా న్యాయవ్యవస్థలో ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ జడ్జీలకు స్వచ్ఛంద పదవీ విరమణ తప్ప రిటైర్మెంట్ లేదు. ఖాళీ అయిన స్థానాలను అధ్యక్షుడు తమ పార్టీని బలపరిచే న్యాయకోవిదులనుంచి భర్తీ చేస్తారు. వారు అధ్యక్షుని పట్ల విధేయతతో తమ అధ్యక్షునికి అనుకూల తీర్పులే ఇస్తుంటారు. సుంకాలు సహా పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కు తప్ప ఎగ్జిక్యూటివ్‌కు రాజ్యాంగం ఇవ్వలేదని, అందువల్ల అధ్యక్షుడు ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా విధించిన సుంకాలు చెల్లుబాటుకావని 6–3తో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో – వ్యతిరేక అభిప్రాయం రికార్డు చేసిన ముగ్గురు జడ్జీల్లో ట్రంప్ నామినేట్ చేసిన జడ్జి బ్రెట్ కవనాఫ్ ఉండటం గమనార్హం. మెజారిటీ తీర్పు ఇచ్చిన జడ్జీలను ట్రంప్ దూషించారు; "మన దేశానికి ఏది సరైనదో ఆ నిర్ణయం చేసే ధైర్యంలేని కొందరు సభ్యులు కోర్టులో ఉన్నందుకు వారి గూర్చి నేను సిగ్గుపడుతున్నాను, ఎంతో సిగ్గుపడుతున్నాను" అన్నారు.

భారీగా పెరిగిపోయిన ఫెడరల్ బడ్జెట్ లోటును అత్యవసర పరిస్థితిగా పేర్కొన్న ట్రంప్ 1977 నాటి అత్యవసర అధికారాల చట్టం కింద సుంకాల విధింపులతో ప్రపంచ వాణిజ్య వ్యవస్థతో చెలగాటానికి పాల్పడ్డారు. రాజకీయరంగంలో కెనడా, మెక్సికో, గ్రీన్‌లాండ్‌లను కలిపేసుకుంటానని బెదిరించినట్లే, వెనిజులాపై దుర్మార్గంగా దాడిచేసి అధ్యక్షుణ్ణి బందీగా తీసుకెళ్లినట్లే, ఆయిలు దిగ్బంధనంతో క్యూబాను వేధిస్తున్నట్లే, 'పరస్పర సుంకాల'తో చైనా, బ్రెజిల్, భారత్, యూరోపియన్ యూనియన్ తదితర అసంఖ్యాక దేశాల మెడలు వంచి తమకు లాభసాటి నియమాలతో వాణిజ్య ఒప్పందాలకు ఒత్తిడి చేశాడు.

చైనా ఢీ అంటే ఢీ అనటంతో ట్రంప్ కొంత వెనక్కి తగ్గాడు. బ్రిక్స్‌పై కత్తిగట్టి బ్రెజిల్, భారత్‌పై అత్యధికంగా 50శాతం సుంకాలు విధించాడు. ఇప్పుడు భారత్‌తో వాణిజ్య ఒప్పందం ట్రంప్ ఏకపక్ష ఆదేశాలతో చివరిదశలో ఉంది. అమెరికా సుప్రీం కోర్టు తీర్పు తెచ్చిన మార్పుల దృష్ట్యా అనేక నిబంధనలను పునర్ నిర్వచించేందుకు భారత్ ప్రయత్నించాలి. లేకపోతే మోదీ ప్రభుత్వం లొంగుబాటు సంపూర్ణం అవుతుంది. రష్యా నుంచి ఆయిలు దిగుమతి చేసుకున్నందుకు ట్రంప్ మనదేశంపై విధించిన 25 శాతం అదనపు సుంకం చట్ట విరుద్ధం అని తేలిపోయింది. దిగుమతులు మళ్లీ పెరిగితే ఆ 25శాతం తిరిగి విధిస్తానన్న ట్రంప్ బెదిరింపుకు బలం లేదు. కాబట్టి రష్యా సహా ఏ దేశం నుంచి అయినా ఆయిలు దిగుమతి చేసుకునే 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి'ని మోదీ ప్రభుత్వం నిర్భయంగా అమలు చేయవచ్చు. అమెరికాతో ఆలింగనాలకు, ఒప్పందాలకు ఉవ్విళ్ళూరే మోదీ అటువంటి ధైర్యం ప్రదర్శిస్తారో లేదో చూడాలి. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయిన విషయమని ట్రంప్ అంటున్నాడు. అది తప్పు. సంతకాలు జరిగేవరకు దానికి లీగాలిటీ లేదు. అందువల్ల 23 నుంచి మూడు రోజుల చర్చలకై ప్రస్తుతం వాషింగ్టన్‌లో ఉన్న భారత వాణిజ్య బృందానికి వాణిజ్య మంత్రిత్వశాఖనుంచి మన సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకునేందుకు తగు ఆదేశాలు వెళ్లాలి.

ట్రంప్ ఈ 'పరస్పర సుంకాల'ద్వారా ఎంత సొమ్ము రాబట్టారో తెలుసా? అక్షరాలా 133 బిలియన్ డాలర్లు. ఈ చట్టవిరుద్ధ వసూలును న్యాయంగా తిరిగి ఇవ్వాలి. కాని సుప్రీంకోర్టు ఆ విషయంపై స్పష్టత ఇవ్వనందున అలా చెల్లింపులు చేసిన కంపెనీలు ఆయా రాష్ట్రాల కోర్టుల్లో కేసులు వేయవచ్చు. కోర్టులకెక్కితే "వచ్చే ఐదేళ్లు మనం కోర్టుల్లోనే ఉంటాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

కోర్టు కొట్టివేసిన కొన్ని సుంకాల స్థానంలో, "1974 నాటి వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122 కింద తమ దిగుమతులు అన్నిటిపై 10 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దాని ప్రకారం భారత్‌పై సుంకం 18 నుండి 10 శాతానికి తగ్గుతుంది. అలాగే ఉక్కు, అల్యూమినియం తదితర అనేక వస్తువులపై నిర్దిష్టమైన రంగాలవారీ ట్రంప్ విధించిన భారీ సుంకాలు కొనసాగుతా యి.

ఏమైనా, సుంకాలపై సుప్రీంకోర్టు తాజా తీర్పు ట్రంప్‌కు పెద్ద ఓటమి. జరిగిన నష్టాన్ని దిద్దుబాటుచేసుకోకపోతే నవంబర్‌లో జరిగే కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం తప్పదని రిపబ్లికన్‌లు భయపడుతున్నారు. ●

# మార్చి 5న నేపాల్ ఎన్నికల్లో 'జెన్ జీ'అద్భుతాలు చేస్తుందా?



నిత్యా చక్రవర్తి

బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న జాతీయ ఎన్నికలు జరిగిన ఇరవై రోజుల తర్వాత, మరో దక్షిణాసియా దేశమైన నేపాల్‌లో మార్చి 5న ఎన్నికలు జరగనున్నాయి. 2025 సెప్టెంబర్‌లో జెన్ జీ ఉద్యమం కె.పి.ఎస్ ఓలి ప్రభుత్వాన్ని గద్దె దించిన ఆరు నెలల తర్వాత ఇవి జరుగుతున్నాయి. తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారిక ఎన్నికల ప్రచారం ఫిబ్రవరి 16న ప్రారంభమైంది. పోలింగ్ రోజుకు 48 గంటల ముందు మార్చి 3న ముగుస్తుంది. ప్రధానమంత్రి సుశీలా కర్కి నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం కింద ఎన్నికలు జరుగుతున్నాయి.

రెండు దేశాలలో ముందస్తు ఎన్నికలు నిర్వహించిన విధానంలో కొన్ని సారూప్యతలు, వైరుధ్యాలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో వివక్షత వ్యతిరేక సంస్థ నేతృత్వంలోని విద్యార్థులు 2024 ఫిబ్రవరిలో ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటాపై వివక్షను తొలగించాలని ఉద్యమాన్ని ప్రారంభించారు. అనేక ప్రతిపక్ష పార్టీలు జాతీయ ఎన్నికలను బహిష్కరించగా, 2024 జనవరిలో అవామీ లీగ్ కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది.

తర్వాత విద్యార్థి ఉద్యమ మద్దతుదారులు, భద్రతా దళాలు, పాలక అవామీ లీగ్ మద్దతుదారుల మధ్య అనేక హత్యలు, ఘర్షణల తర్వాత జూలైలో ఈ ఉద్యమం సమరశీల రూపాన్ని సంతరించుకుంది. ఆ తరువాత విద్యార్థుల ఉద్యమం అవామీ లీగ్ పాలనకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమంగా మారింది. దీని ఫలితంగా 2024 ఆగస్టు 5న అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయి ప్రధాన మంత్రి షేక్ హసీనా భారతదేశంలో తలదాచుకున్నారు.

ఇందుకు విరుద్ధంగా, నేపాల్‌లో సోషల్ మీడియా వేదికలను నిషేధించాలన్న ప్రభుత్వ ఆదేశాన్ని నిరసిస్తూ పాఠశాల విద్యార్థులతో సహా జెన్ జీ ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత ఈ ఉద్యమం పాలక కె.పి.ఎస్ ఓలి ప్రభుత్వానికి, పాతుకుపోయిన అన్ని రాజకీయ పార్టీలకు పూర్తి వ్యతిరేకంగా మారింది. భద్రతా దళాలు, ప్రదర్శనకారుల మధ్య ఘర్షణలు జరిగాయి. కానీ నేపాల్ సైన్యం అప్రమత్త వైఖరిని తీసుకుంది. పరిస్థితి అదుపు తప్పిన తర్వాత, నేపాల్ ఆర్మీ చీఫ్ ప్రధాని ఓలిని పదవి నుంచి వైదొలగాలని చెప్పారు. ఆయనతో పాటు, ఆయన ప్రభుత్వం రాజీనామా చేసింది. జెన్ జీ నేతలు, పౌర సమాజ నాయకులతో ఆర్మీ చీఫ్ సంప్రదింపులు జరిపి, మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కార్కి నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు సహాయం చేశారు.

తేడా ఏమిటంటే, నేపాల్‌లో తక్కువ రక్తపాతం జరిగింది. అయితే బంగ్లాదేశ్‌లో ఉద్యమ సమయంలో సుమారు 1500 మంది ప్రాణాలు కోల్పోయారు. బంగ్లాదేశ్‌లో ప్రధానమంత్రి షేక్ హసీనా భారతదేశానికి పారిపోయారు. అవామీ లీగ్ నిషేధించబడింది. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12 ఎన్నికలలో, ఆవామీ లీగ్ పాల్గొనకుండా నిషేధం విధించబడింది. దాని ప్రత్యర్థి బిఎన్‌పి కొత్త పార్లమెంటులోని మొత్తం 300 సీట్లలో 212 సీట్లను గెలుచుకుంది. నేపాల్‌లో ఏ పార్టీని నిషేధించలేదు. అన్ని ప్రధాన పాలక పార్టీలతో కలిపి దాదాపు 50 పార్టీలు మార్చి 5న జరిగే ఎన్నికలలో పాల్గొనేందుకు అనుమతించబడ్డాయి. గత ప్రధానమంత్రి కె.పి.ఎస్.ఓలి సెప్టెంబర్‌లో పదవీచ్యుతి తరువాత కొన్ని రోజులు మాత్రమే దాక్కున్నాడు. కానీ ఆయన చాలా త్వరగా తన పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం ప్రారంభించాడు. నేపాల్ కాంగ్రెస్ నాయకత్వంలో కొంత మార్పు వచ్చినప్పటికీ మునుపటి రాజకీయ నాయకులందరూ తిరిగి వచ్చారు.

నేపాల్ పార్లమెంట్ దిగువ సభలో 275 సీట్లు ఉన్నాయి. ఇందులో 165 సీట్లు ప్రత్యక్ష ఎన్నికల కోసం ఉద్దేశించబడ్డాయి. మిగిలిన 110 సీట్లు దామాషా ప్రాతినిధ్యం ద్వారా భర్తీ చేయబడతాయి. నేపాల్‌లో అన్ని ప్రధాన పార్టీలు అన్ని సీట్లలో పోటీ చేస్తాయి. ఎన్నికలలో వారి బలం వెల్లడైన తర్వాత, ఎన్నికల అనంతరం పొత్తులు చేసుకుంటాయి. అదే తరహాలో, పదవీచ్యుతుడైన 73 ఏళ్ల కె.పి.ఎస్.ఓలి నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ యుఎంఎల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్) కు నాయకత్వం వహిస్తున్నారు. సెప్టెంబర్‌లో పదవీచ్యుతికి ముందు ఆయన నేపాలీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. ప్రచండ అని పిలువబడే మరో మాజీ ప్రధాని పుష్ప కమల్ దహల్ నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. ఆయన తన కింద ఉన్న ఇతర కమ్యూనిస్ట్ వర్గాలను కలుపుకోగలిగారు. ఓలికి ప్రధాన పోటీదారుగా ఆయన ఎదిగారు.

రెండు కమ్యూనిస్ట్ పార్టీలు సాంప్రదాయ నాయకులను నిలుపుకున్నప్పటికీ, దేశంలోని పురాతన రాజకీయ పార్టీ అయిన నేపాలీ కాంగ్రెస్ ఈ సంవత్సరం జనవరిలో యువకుడు, గగన్ థాపాను తన కొత్త నాయకుడిగా ఎన్నుకుంది. 2006లో ప్రజాస్వామ్యం స్థాపించబడినప్పటి నుండి గడిచిన రెండు దశాబ్దాలలో వివిధ పొత్తుల కలయికలో ఐదు సార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన అనుభవజ్ఞుడైన షేర్ బహదూర్ దేవ్ బా (79)స్థానంలో ఈ 49 ఏళ్ల ప్రముఖ నాయకుడు బాధ్యతలు చేపట్టాడు.

గత రెండు దశాబ్దాలుగా నేపాల్ రాజకీయ రంగంలో ఆధిపత్యం చెలాయించే సాంప్రదాయ రాజకీయ పార్టీలకు భిన్నంగా, జెన్ జీలోని గణనీయ వర్గం 50 ఏళ్ల టెలివిజన్ హోస్ట్ రబీ లామిచానే నేతృత్వం వహిస్తున్న కొత్త పార్టీ రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పిపి)కి మద్దతు ఇస్తోంది. మాజీ ఉప ప్రధాన మంత్రి, హోం మంత్రిగా పని చేసిన లామిచానే, చమత్కారిగా, సివిల్ ఇంజనీర్‌గా సోషల్ మీడియాలో పెద్ద సంఖ్యలో ఫాలోయర్‌లు కలిగిన ఖట్మండు మేయర్ బాలేంద్ర షా (35)తో పొత్తు పెట్టుకున్నారు. షా ఈ కూటమి ప్రధాన మంత్రి అభ్యర్థి. ఆయన అవినీతికి వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి. జెన్ జీలో పెద్ద వర్గం మద్దతును కలిగి ఉన్నారు.



బంగ్లాదేశ్‌లో విద్యార్థి నిరసనకారులు 2025 ఫిబ్రవరిలో తమ సొంత నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) అనే రాజకీయ పార్టీ ని ఏర్పాటు చేసుకున్నారు. ఫిబ్రవరి 12 ఎన్నికలలో జమాత్ –ఎ– ఇస్లామీతో పొత్తు పెట్టుకున్నారు. ఎన్‌సిపి 30 సీట్లలో పోటీ చేసి ఆరు స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఎన్‌సిపి కార్యక్రమానికి, దాని చర్యలకు ప్రజల నుండి ఆమోదం లభించలేదని ఆ పార్టీ భారీ ఓటమి నిరూపించింది. దీనికి విరుద్ధంగా నేపాల్‌లోని జెన్ జీ నిరసనకారులు వారి స్వంత రాజకీయ పార్టీని స్థాపించలేదు. వారు ఆర్‌పిపికి మద్దతు ఇస్తున్నారు. వారిలో కొందరు పోటీ చేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో జెన్ జీ స్వతంత్ర స్వరం వినిపించదు. అయినప్పటికీ వారిలో కొందరు అవినీతికి వ్యతిరేకంగా పోరాటంపై దృష్టి సారించవచ్చు.

మార్చి 5న జరిగే జాతీయ ఎన్నికలతో పాటు, అవినీతి నిర్మూలన, హక్కుల రక్షణకు సంబంధించిన కొన్ని ప్రధాన అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ(రిఫరెండం) నిర్వహించడం కోసం గత సంవత్సరం అక్టోబర్‌లో చర్చలు జరిగాయి. ఫిబ్రవరి 12న పార్లమెంటుతో పాటు రిఫరెండం జరిగిన బంగ్లాదేశ్ నమూనా చూశాక, నేపాల్‌లో కూడా రిఫరెండం అంశంపై కార్కి నిర్ణయం తీసుకుంటారని భావించారు. కానీ చివరికి, దీనికి ఆమోదం లభించలేదు. కాబట్టి, మార్చి 5 ఎన్నికల తర్వాత కొత్తగా ఎన్నికైన నేపాల్ ప్రభుత్వం భావిస్తే రిఫరెండం నిర్వహించడంతో పాటు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడంపై కూడా నిర్ణయం తీసుకుంటుంది.

బంగ్లాదేశ్ మాదిరిగానే, నేపాల్ యువత కూడా ఉద్యమం సమయంలో వారు లేవనెత్తిన కొత్త సమాజం ఆశలపై సరైన తదుపరి చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. సోషల్ మీడియాలో చాలా చురుగ్గా ఉండే నేపాల్ జెన్ జీ ఈ వేదికల ద్వారా మంచి డబ్బు సంపాదిస్తున్నారు. అయితే, రెండు దశాబ్దాలుగా ఒకే రాజకీయ నాయకుల పాలనతో విసుగు చెందిన దేశంలోని ప్రజలను ఉత్తేజపరిచే కొత్త చార్టర్‌ను ముందుకు తీసుకురావడంలో వారు విఫలమయ్యారు. మార్చి 5 ఎన్నికల్లో మళ్ళీ సెప్టెంబర్ తిరుగుబాటు ఎవరిపై జరిగిందో అదే వ్యక్తుల సమూహానికి అనుకూలంగా ఫలితాలు వస్తాయి.

జెన్ జీ మద్దతు ఇచ్చిన ఆర్‌పిపి ప్రచారం మాత్రమే కొత్త పరిణామం. కానీ వారి సంస్థాగత బలం ఇంకా దేశంలోని ప్రతి ప్రాంతానికి చేరుకోలేదు. అయినప్పటికీ, యువ నాయకుల నేతృత్వంలోని ఆర్‌పిపి మార్చి 5 ఎన్నికలలో ఏదైనా అద్భుతాన్ని ప్రదర్శించగలదా? వేచి చూడాలి.

# ఆ విజయాలు...ఏమి చెబుతున్నాయ్?

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఫలితం అందరూ ఆశ్చర్యపోయేలా చేసింది. ఇక్కడ సిపిఐ ఎవరూ ఊహించని రీతిలో మేయర్ పదవిని కైవసం చేసుకుంది. ఒంటరిగా పోటీ చేసి అత్యధికంగా 22 డివిజన్‌లలో సిపిఐ గెలుపొందడమే కాకుండా, మద్దతిచ్చిన మరో ఇండిపెండెంట్ అభ్యర్థి కూడా గెలుపొందారు. అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌తో పాటు మరొకవైపు బిజెపితో కూడా ప్రత్యక్షంగా హోరాహోరీగా తలపడి ఈ అపూర్వ విజయం సాధించింది. మేయర్‌గా సిపిఐ తరపున మూడ్ గణేశ్ ఎన్నికయ్యారు. అసలు ఎన్నికల్లో ధనం, మద్యం ప్రవాహాలు పారుతుండడంతో కమ్యూనిస్టులు పోటీ చేయడం కూడా ఎంతో కష్టమైన పరిస్థితులు. దీనిని ఆసరాగా చేసుకొని కమ్యూనిస్టులు ఎక్కడున్నారు? మీకు టిక్కెట్‌లు ఇస్తే గెలుస్తారా అని ప్రత్యర్థులే కాకుండా, మిత్రులు కూడా హేళనగా కామెంట్‌లు చేసే రోజులు. ఈ నేపథ్యంలో స్థానిక శాసనసభ్యుడుగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సాహసోపేతంగా అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకే మొగ్గుచూపి, అద్భుత ఫలితాలు సాధించారు. ఈ గెలుపుతో మరోసారి కమ్యూనిస్టులవైపు అందరి దృష్టి పడింది. పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్ళూనుకొని, రాజకీయాలను శాసిస్తున్న సమయంలో ప్రజల పక్షాన నిలబడేవారు, మరీ ముఖ్యంగా కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తులు గెలుపొందడం దాదాపు సాధ్యం కాదనే వాదనలకు కొత్తగూడెం విజయం తెరదించింది.

గత ఏడాది జూన్‌లో అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీ ఘన విజయం ప్రపంచవ్యాప్త ప్రజలను అటుకేసి చూసేలా చేసింది. డెమొక్రాట్ పార్టీ తరపున పోటీ చేసి ఈ 34 ఏళ్ళ యువకుడు అన్ని ఆటంకాలను దాటుకొని గెలుపొందారు. సామాన్య, మధ్యతరగతి ఎజెండాతో ఎన్నికల్లో పోటీ చేసిన మమ్దానీకి సొంత పార్టీలోనే తొలుత వ్యతిరేక వ్యక్తమైంది. బిలియనీర్ల వ్యతిరేక ధోరణే అందుకు కారణం. డెమొక్రాటిక్ పార్టీకి చెందిన మాజీ అధ్యక్షుడు క్లింటన్ వంటి వారే ఒక దశలో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. ఇరవై మంది శతకోటీశ్వర్లు ఆయన ప్రత్యర్థి అండ్రూ క్యోమీకి ఎన్నికల ఖర్చులకు డబ్బుల వర్షం కురిపించారు. మరోవైపు మమ్దానీకి సామాన్యులే 'క్రౌడ్ ఫండింగ్' చేయడమే కాకుండా, వేలాది మంది స్వచ్ఛందంగా ఇంటింటి ప్రచారం చేయడమే ఆయన విజయానికి దోహదపడింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అయితే మమ్దానీ పేరు చెబితేనే ఒంటి కాలిపై లేచేవాడు. ఆయన గెలిస్తే న్యూయార్క్ నగరానికి సాయం చేయడని బెదిరించాడు. ఇవేవీ మమ్దానీ ఎన్నికలను ఆపలేకపోయాయి. ఆయన తన వామపక్ష భావాలను ఎక్కడా దాచుకోలేదు. పైగా పెట్టుబడిదారుల స్వర్గధామమైన న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో జయకేతనాన్ని ఎగురవేశారు.




వామపక్షాలకు భవిష్యత్తు లేదు, అది కొడిగట్టిన దీపమని ప్రచారం చేస్తుండేవారికి, నిజమేమోనని సాధారణ ప్రజలకు కూడా న్యూయార్క్ మేయర్, కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలు ఒక కనువిప్పే. నిజానికి సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశించి, తీవ్రతరమైన తరువాత మితవాద శక్తులు దానిని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. కార్పొరేట్ శక్తుల ప్రభావం రాజకీయాలపై తీవ్రమైంది. అలాగే మీడియా సంస్థలను కబళిస్తున్నాయి. డబ్బులు ఉంటేనే ఎన్నికలు అనే పరిస్థితికి తీసుకొచ్చారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో కూడా నీ దగ్గర రూ.20 లక్షలు ఉంటే కౌన్సిలర్‌కు, రూ.3 కోట్లు ఉంటేనే చైర్మన్ పదవి కోసం టికెట్ ఇస్తామని ప్రధాన పార్టీ నేతలు ఆశావహులకు నిర్మొహమాటంగా చెప్పేశారంటే, పరిస్థితి ఎంతగా భ్రష్టుపట్టిందో అర్థం చేసుకోవచ్చు. ఒక మున్సిపాలిటీలో కౌన్సిలర్‌కు పోటీచేసిన అభ్యర్థి ఓటరుకు రూ.70వేలు, ప్రత్యర్థి రూ.35 వేలు పంచారంటే ఎన్నికలు ఎంత ఖరీదయ్యాయనేది స్పష్టమవుతోంది.

ఇక కార్పొరేట్ సంస్థలే రాజకీయ పార్టీలను పోషిస్తూ, ఎన్నికలకు డబ్బులు ఇస్తూ, గెలిచాక తమకు అనుకూలంగా విధానాలను రూపకల్పన చేయించుకునే ఆశ్రిత పక్షపాతం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా సొంతిళ్ళు, ఇంటి అద్దె, విద్య, వైద్యం, రవాణా వంటి ప్రాథమిక అవసరాలే ఖరీదైపోయాయి.

ఇక నిరుద్యోగం, ధరల పెరుగుదల గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. ప్రపంచంలో ఎక్కడ చూసినా ఇలాంటి పరిణామాలే. ఇందుకు ఆస్ట్రేలియా, బ్రిటన్, న్యూయార్క్ నగర ఎన్నికల్లో సైతం అందుబాటు ధరలో ఇళ్ళు, అద్దెల తగ్గింపు, ఉపాధి కల్పన వంటి అంశాలే ప్రధాన ఎన్నికల హామీలుగా మారడం నిదర్శనం. పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత ప్రబలడంతో ఆర్థిక అసమానతలు ఎన్నడూలేని రీతిలో తీవ్రమవుతున్నాయి. ధనిక, పేదల మధ్య అంతరాలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటికి అసలైన ప్రత్యామ్నాయాన్ని అందించేది వామపక్ష భావజాలమేనని చరిత్రలో నిరూపితమవుతోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా అనేక ఎన్నికల్లో ధనప్రవాహం గేట్లు తెరుచుకుంటున్నప్పటికీ కమ్యూనిస్టుల విజయాలు ప్రజలకు అనూహ్యంగా కనిపిస్తున్నాయి. అంతకుముందు జరిగిన బిహార్ ఎన్నికల్లో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఏకంగా 12 ఎంఎల్‌ఏ స్థానాలు గెలుచుకున్నప్పుడూ ఇలాంటి స్పందనే జనంలో, రాజకీయ పార్టీల్లో కనిపించింది.

శ్రీలంకలో కుళ్ళిపోయిన రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా మూడు శాతం ఓట్లు ఉన్న వామపక్ష జెవిపి నేతృత్వంలోని ఎన్‌పిపి ఏకంగా పార్లమెంటు మెజారిటీ స్థానాలను సాధించి, అధికారంలోకి వచ్చింది. ఇవన్నీ కూడా ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు సరైన దిశను అందిస్తే, ఆ పార్టీలకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉంటారని నిరూపిస్తున్నాయి. వేటికవే ప్రత్యేకమైనప్పటికీ న్యూయార్క్ మేయర్ ఎన్నికలు, బిహార్‌లో వామపక్షాల గెలుపు, శ్రీలంకలో ఎన్‌పిపి ప్రభుత్వ ఏర్పాటు, తాజాగా కొత్తగూడెంలో కమ్యూనిస్టు పార్టీ మేయర్ ఎన్నిక వంటి ఘటనలు కారు చీకట్లో కాంతిరేఖలా మిణుకుమిణుకుమంటూ భవిష్యత్తు ఆశాకిరణాలుగా సంకేతాలిస్తున్నాయి.



## రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శ్రీనిది రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు, రుణాలను అందిస్తున్నాయని అన్నారు. శ్రీనిధి జోనల్ మేనేజర్ అనంతకిశోర్ మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేస్తుందని, బ్యూటీ పార్లర్లు, సోలార్ సిస్టం, ఎంటర్‌ప్రైజెస్ తదితర విభాగాలకు ప్రత్యేక రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయా రుణ ఫలాలను పొందడంలో సంప్రదింపులు, సలహాల కోసం మెప్మా విభాగంలో సంప్రదించాలన్నారు. సమావేశంలో హాజరైన మున్సిపల్ కమీషనర్ గణవేణి శ్రీనివాస్ పలు అంశాలపై మహిళలను అవగాహన కల్పించారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీడీ శ్రవణ్‌కుమార్, మెప్మా పీఆర్‌పీ బక్కయ్య, శ్రీలేఖ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి, పార్వతి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి : కమిషనర్**

పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. ఆర్థిక సంవత్సరాంతానికి వంద శాతం వసూళ్లే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామన్నారు. గృహ యజమానులు ఆస్తి పన్నులతోపాటు నల్లా బిల్లులు వెంటనే పే చేయాలని, వ్యాపారులు, వాణిజ్య లైసెన్స్‌లు రుసుం చెల్లించడంతో పాటు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. మొండి బకాయిదారులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జ్ఞానేశ్వరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ రికవరీ చేయడంలో సిబ్బంది కృషి అభినందనీయం





**ప్రజాపక్షం/సూర్యాపేట :** మొబైల్ రికవరీ చేయడంలో సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది కృషి అభినందనీయమని జిల్లా ఎస్పి కె నరసింహ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పరిధిలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న, చోరికి గురైన సుమారు రూ.22లక్షల విలువ గల 107 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసి మాట్లాడారు. జిల్లా పోలీసులు 10వ సారి సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి నెల 100కు పైగా ఫోన్‌లను రికవరీ చేస్తున్నట్లు వివరించారు. ఆర్థికపరమైన అంశాలకు ఈ రోజుల్లో మొబైల్ ప్రధాన్యమైందన్నారు. సంవత్సర కాలంలో 1430 మొబైల్స్‌ను బాధితులకు అందించామన్నారు. మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలు పెరిగిపోయాయని, ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలని, పోలీసుల సూచనలను పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టపరిధిలో బాధ్యతగా నడుచుకోవాలన్నారు. తప్పులు చేసే వాళ్లకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండదని హెచ్చరించారు. సామాన్యులకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీస్ అన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగలించబడిన వెంటనే సిఇఐఆర్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని, మొబైల్‌ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా దరఖాస్తు సంబంధింత పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటి కోర్ ఆర్‌ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, మొబైల్ పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు.

## అగ్ని ప్రమాదంలో ఆటోమొబైల్ షాపు దగ్ధం

షార్ట్‌సర్క్యూట్‌తో ఎగిసిపడిన మంటలు

రూ. కోటి వరకు ఆస్తినష్టం... బాధితుల ఆవేదన





**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలోని సాయి బాబా గుడి సమీపంలో ఉన్న శ్రీ సాయి విఘ్నేశ్ ఆటోమొబైల్ షాపులో శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. కొద్దిసేపట్లోనే మంటలు తీవ్రరూపం దాల్చి షాపు మొత్తాన్ని ఆవహించాయి. మంటలు ఎగిసిపడటంతో చుట్టుపక్కల ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్ముకుంది. ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో షాపులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.అగ్నిప్రమాదంలో ఆటోమొబైల్‌కు సంబంధించిన విలువైన స్పేర్‌పార్ట్స్, ఇంజన్ ఆయిల్,నగదు, ముఖ్య పత్రాలు,సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.80 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. నకిరేకల్ పట్టణానికి చెందిన ఉపేందర్‌కు ఈ షాపు చెందింది. ఒక్కసారిగా జీవనాధారం కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ సాయం అందించాలని కోరారు.ఘటన విషయం తెలుసుకున్న ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ వేముల పుష్ప,నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దైద రవీందర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు.

వ్యాపార, వాణిజ్యపరంగా

# నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి కానున్న మున్సిపల్ కార్పొరేషన్ లో పిస్తా హౌస్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని హైదరాబాదు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తా హౌస్ ను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు కోట్లాది రూపాయలతో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.సూపర్ స్మార్ట్ సిటీ తో పాటు గ్రీన్ సిటీగా చేస్తామని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలోనే హైదరాబాద్ కు దీటుగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను చెత్త రహిత సిటీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను ఆదర్శంగా తీసుకునే విధంగా అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పిస్తా హౌస్ బ్రాంచ్‌ను నల్లగొండలో కూడా ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఇటికల మంగమ్మ శ్రీనివాస్ తోపాటు పలువురు కార్పొరేటర్లు,పిస్తా హౌస్ నిర్వాహకులు కొణతం నాగిరెడ్డి,వినయ్ రెడ్డి, మిథున్ రెడ్డి, నవ కిషోర్ రెడ్డి, కొణతం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# పది చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** విద్యార్థి దశలో పదవ తరగతి అనేది మొదటి మెట్టు కాబట్టి విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని బీచ్మహల్ల జిల్లా పరిషత్ హై స్కూల్‌ని జిల్లా కలెకర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మొత్తం ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకొని అందులో పదవ తరగతి చదివే విద్యార్థులు ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు అందరూ ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకి వస్తున్నారా.. లేదా ఎవరైనా గైర్హాజరు అవుతున్నారా అని ఆరా తీశారు. తదనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులను ఫిజిక్స్, గణితం సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేశారు. రోజు ఉదయాన్నే 5 గంటలకు లేచి రెగ్యులర్‌గా ఫార్ములాస్ ఒకటి రెండు సార్లు బట్టి పట్టినట్లయితే పాస్ మార్కులతో ఉత్తీర్ణత అయినట్టే అని తెలిపారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున కష్టపడి చదవాలన్నారు. సెలవులో వాగుల్లో, చెరువుల్లో ఈత కు వెళ్లి ప్రమాదాలు తెచ్చుకోకుండా, పరీక్షల మధ్యలో రెండు రోజులు కూడా పాఠశాలకు వచ్చి ప్రిపేర్ అవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకి కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించారు. రైస్ క్వాలిటీ సరిగా లేకపోవడంతో వెంటనే సంబంధిత సివిల్ సప్లయ్ అధికారులకు పోన్ చేసి బియ్యం వెంటనే మంచి బియ్యం సరఫరా చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచి కరమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# 10వేల కంటి శస్త్ర చికిత్సలే లక్ష్యం

అంధరహిత మునుగోడును తీర్చిదిద్దడమే రాజగోపాల్‌రెడ్డి ధ్యేయం



**ప్రజాపక్షం/యాదాద్రి :** చూపు మందగించి, చీకటి మయమైన జీవితాల్లో వెలుగులు నింపడం కంటే మించిన పుణ్యకార్యం మరొకటి లేదు. రాజకీయ నాయకుడంటే కేవలం ఓట్లు, సీట్లు మాత్రమే కాదు.. కష్టాల్లో ఉన్న ప్రజలకు తోడుండే 'పెద్ద కొడుకు' అని నిరూపిస్తున్నారు. మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. తన మాతృమూర్తి స్వర్గీయ కోమటిరెడ్డి సుశీలమ్మ ఆశయాలను గుండెలకు హత్తుకుని, ఆమె పేరు మీద వేలాది మంది పేదల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నారు.

మునుగోడు నియోజకవర్గంలో ఒక నిశ్శబ్ద విప్లవంలా సాగుతోంది ఈ 'నేత్ర యజ్ఞం'. వయసు పైబడి కంటి చూపు కోల్పోయిన వృద్ధులు, ఆర్థిక స్తోమత లేక ఆపరేషన్ చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న సామాన్యుల కోసం రాజగోపాల్ రెడ్డి భగీరథుడిలా మారారు. ఫీనిక్స్ ఫౌండేషన్ ,శంకర కంటి ఆసుపత్రి సహకారంతో అత్యున్నత స్థాయి వైద్య సేవలను మునుగోడు గడ్డపైనే ఉచితంగా అందిస్తున్నారు. 'మా నియోజకవర్గంలో ఏ ఒక్కరూ కంటి సమస్యతో బాధపడకూడదు.. ప్రతి ఇంటా వెలుగులు నిండాలి' అనే బలమైన సంకల్పంతో ఆయన ఈ భారీ కార్యక్రమాన్ని భుజానికెత్తుకున్నారు.

**సేవా ప్రస్థానంలో అద్భుత మైలురాళ్లు** .. గడిచిన 11 విడతల్లో సాగిన ఈ సేవా యాత్ర గణాంకాలు చూస్తే ఆయనకు ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. ఇప్పటి వరకు 8,424 మందికి క్షుణ్ణంగా కంటి పరీక్షలు, 1,747 మందికి అత్యున్నత ప్రమాణాలతో ఉచిత కంటి శస్త్రచికిత్సలు, 3,427 మందికి నాణ్యమైన కంటి అద్దాల పంపిణీ చేశారు.

**లక్ష్యం దిశగా అడుగులు..** రాబోయే మూడేళ్లలో ఏకంగా 10,000 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయించి, నియోజకవర్గాన్ని 'అంధత్వ రహిత మునుగోడు'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. కేవలం మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చూపిస్తూ పేదవాడి గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంటున్నారు.

**ఆదివారం చండూరు వంతు!**

ఆదివారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుంది. చండూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, మున్సిపాలిటీలోని 10 వార్డుల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు. అమ్మ పేరు మీద పేదోడి కంటి వెలుగును కాపాడుతున్న ఈ కార్యక్రమం.. మునుగోడు చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. రాజగోపాల్ రెడ్డి సేవా నిరతికి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు.

## బిజెపి రౌడీయిజం నడవదు..

రాహుల్ గాంధీ నివాసం ముట్టడి పిలుపుపై

ఎంపి చామల ఆగ్రహం

**ప్రజాపక్షం/యాదాద్రి :** దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, ప్రతిపక్ష నేతలపై దాడులకు ఉసిగొల్పుతున్న బిజెపి తీరును భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో జరిగిన ఏఐ (ఏఐ) సమ్మిట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టినందుకు, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యాలయాలతో పాటు లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసాన్ని ముట్టడించాలని బీజేవైఎం తీసుకున్న నిర్ణయంపై ఆయన నిప్పులు చెరిగారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ ప్రయోజనాల కోసం యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన ద్వారా నిరసన తెలిపితే, దానికి సమాధానం చెప్పలేక బిజెపి దాడులకు దిగాలని చూడటం వారి పిరికితనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఏఐ సమ్మిట్ పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేవలం ఆర్భాటం చేస్తున్నారని, వాస్తవానికి అది దేశానికి మరియు రైతులకు తీవ్ర నష్టం చేకూర్చేలా ఉందని చామల విమర్శించారు. విదేశాల నుంచి తెచ్చిన పరికరాలను మన దేశంలో తయారు చేసినట్లుగా ప్రధాని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కేవలం షో పుటప్ చేస్తున్నారని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు చెప్పినట్లుగా మోదీ నడుచుకుంటూ, అంతర్జాతీయ స్థాయి ట్రేడ్ ఒప్పందాల్లో తన విదేశీ మిత్రుల ప్రయోజనాల కోసం దేశ వాణిజ్య ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బిజెపి నాయకులు తమ అప్రజాస్వామిక చర్యలను మానుకోవాలని, దేశ ప్రయోజనాలను దెబ్బతీసే ట్రేడ్ డీల్స్లో వెంటనే మార్పులు చేయాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## పారదర్శకంగా 'పది' వార్షిక పరీక్షలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 10వ తరగతి వార్షిక పరీక్షలను సక్రమంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 10వ తరగతి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులతో సమగ్ర అవగాహన ఒరియంటేషన్ సమావేశంలో వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, రవాణా, సీలింగ్ అన్‌సీలింగ్ విధానం, పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ల సమన్వయం వంటి అంశాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 12403 మంది విద్యార్థులు, 69 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, శుచిమందిరాలు, ఫర్నీచర్, ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస మౌళిక సదుపాయాలు కల్పించబడుతున్నాయని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం స్క్రైబ్ సౌకర్యం, అవసరమైన చోట వీల్‌చైర్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. పరీక్షలను నిబంధనల ప్రకారం, ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, అసిస్టెంట్ కమీషనర్ ప్రభుత్వ పరీక్ష విభాగం సీనయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ స్కూల్‌లో ఐఎఎస్, ఐపిఎస్ ఫౌండేషన్‌కు శ్రీకారం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఇలాంటి ఫౌండేషన్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టడం అభినందనీయమని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, స్వర్ణగిరి ఆలయ చైర్మన్ మానేపల్లి రామారావు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ పగిడాల జలందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐఏఎస్, ఐపీఎస్ ఫౌండేషన్ ప్రోగ్రాంను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డా.పగిడాల జలంధర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థల చైర్మన్ మహమ్మద్ అవేజ్ చిస్తి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్, మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి, లింగ నరసింహారావు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూమి కబ్జాకు పోటీ




**ప్రజాపక్షం/మోతె :** ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి పోటీపడుతున్న సంఘటన మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం గ్రామంలో ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణపడుతూ ఒకరిపై ఒకరు మండల రెవెన్యూ అధికారులకు ఎంపిడిఒకు పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేసుకోవడంతో జులై 03/2003లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం 15 మంది లబ్ధిదారులను గుర్తించి సర్వే నెంబర్ 1013 గల బారాజు ఖాతా పేరుతో ప్లాట్ నంబర్ 76తో సుమారు 3 గుంటల భూమిని ఖమ్మంపాటి సత్యమ్మ భర్త లింగయ్యకు ఇవ్వడం జరిగిందని పట్టాదారు సత్యమ్మ కుటుంబ సభ్యులు ఆధారాలతో వివరించారు. అట్టి స్థలంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు గడిచిన కొంతకాలం తరువాత గ్రామ అవసరాల నిమి త్తం ఉర్లు గొండ గ్రామపెద్దలు గ్రామంలో ఇసుక ర్యాంపు ఏర్పాటుతో సుమారు రూ.3లక్షల 50వేలు గ్రామానికి వేలం వేయగా వచ్చిన డబ్బులను ప్రభు త్వం ఇచ్చిన భూమి లబ్ధిదారులకు అందరి నిర్ణయం ప్రకారంగా సుమారు రూ.15వేలు ప్రతి ఒక్కరికీ ఇచ్చి అట్టి స్థలం ఖాళీ చేయాలని గ్రామంలో తీర్మానం చేసుకున్నామని చెప్పా రు. ఆ సమయంలో ఖమ్మంపాటి సత్యమ్మ భర్త లింగయ్యకు చెందిన భూమి నుంచి వెళ్ళి పోగ మిగతా వారు భూమిలో నుంచి వెళ్ల లేదని అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ ఇంటి స్థలం పై మరొకరి కన్నుపడిందని ఎలాంటి ఆధారాలు లేకుండా భూమి కబ్జా చేయాలని కొందరు చూస్తున్నట్లు వివరించారు. ఇప్పటికి 4గురు సర్పంచ్‌లు మారడం జరిగిందని తెలిపారు. మా గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో పూర్తిస్థాయిలో ఇండ్లు నిర్మాణం చేసుకున్నారని ఖమ్మంపాటి సత్య మ్మ భర్త లింగయ్య భూమిని కట్ల వెంకన్నకు సుమారు రూ. 32వేలకు అమ్మకం జరిపినట్లు కాగితం రాసుకున్నారని చెప్పారు.





## మర్రి ఆకుపై 'వటపత్రశాయి'గా నరసింహుడు..



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తి పారవశ్యంలో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం ఉదయం స్వామివారు 'వటపత్రశాయి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్రమంతా మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య 'నమో నరసింహ' స్మరణలతో ప్రతిధ్వనించింది. శనివారం ఉదయం ఆలయంలో నిత్యారాధనల అనంతరం స్వామివారిని ప్రళయకాలంలో సమస్త జీవరాశిని తన గర్భంలో దాచుకుని, చిన్నారి రూపంలో మర్రి ఆకుపై పవళించిన బాల కృష్ణుని (వటపత్రశాయి) రూపంలో అలంకరించారు. అత్యంత శోభాయమానంగా అలంకరించిన స్వామివారిని తిరువీధులలో ఊరేగించగా, భక్తులు కర్పూర నీరాజనాలు అర్పించారు. లోక రక్షణ కోసం భగవంతుడు చేసే లీలా విలాసమే ఈ వటపత్రశాయి అలంకరణ అని అర్చకులు తెలిపారు. రాత్రి వేళ స్వామివారు జ్ఞానానికి ప్రతీక అయిన హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. పాల నుంచి నీటిని వేరు చేసే విచక్షణ హంసకు ఉన్నట్లే, మనలోని చెడును తొలగించి, మంచిని స్వీకరించే జ్ఞానాన్ని స్వామి ప్రసాదిస్తారని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ విశిష్ట సేవను దర్శించుకోవడం వల్ల అజ్ఞానం తొలగి, సన్మార్గంలో నడిచే బుద్ధి కలుగుతుందని క్షేత్ర పండితులు వివరించారు. ఈ వేడుకలను పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు కాందూరు వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్ర చార్యుల బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో జె.భవానీ శంకర్, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ యం.హనుమంతరావు, మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్ గౌడ్, ఇతర అధికారులు, పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



## ఎవ్వాహ్ వీవర్స్ ఎగ్జిబిషన్

ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** సోషలైట్ అలేఖ్యరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎవ్వాహ్ వీవర్స్ హబ్ ఎగ్జిబిషన్ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. చేనేత చల్లని అమ్మవడి వంటిదని అభివర్ణించారు. భారతీయ భారతీయ సంస్కృతి లో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. చేనేత దుస్తులను ప్రతి ఒక్కరు ధరించాలని, చేనేత కారులను మరింత ప్రోత్సహించాలని కోరారు.

## ఆశా వర్కర్ల పాత్ర కీలకం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** ప్రజారోగ్య వ్యవస్థలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కొనియాడారు. శనివారం బొలారంలోని లీ ప్యాలెస్‌లో ఆశా వర్కర్ల సమస్యలు, మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు.

## ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

భూమిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు



**పజాపక్షం/చాంద్రాయణగుట్ట:** అర్ధరాత్రి రూ.100 కోట్ల విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు దుండగులు యత్నించారు. ప్రభుత్వ భూమి చుట్టూరా ఉన్న ప్రహరీని ఆక్రమణదారులు కూల్చివేయడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడం జరిగింది. ఈ ఘటన బండ్లగూడ మండలం పరిధిలోకి వచ్చే అలియాబాద్ ప్రాంతంలోని శంషీర్‌గంజ్‌లో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న బండ్లగూడ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమాచారం ఉన్నతాధికారులకు వివరిస్తామని తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై బీజేపీ భాగ్యనగరం జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నా వెంకటరమణ స్పందిస్తూ... భూ వ్యవహారం కోర్టులో పెండింగ్ ఉండగానే ఈ ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన స్పందించి భూ కబ్జా వ్యవహారంపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

## అప్పిలేట్ ట్రైబ్యునల్ రాచమార్గం


జీఎస్టీ అప్పిల్స్ అధ్యక్షుడు జస్టిస్ డా.సంజయ్ కుమార్ మిశ్రా



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** జీఎస్టీఏటీ అనేది జీఎస్టీకి సంబంధించిన వివాదాలను విచారించే ప్రత్యేక అప్పిలేట్ సంస్థగా.. జీఎస్టీ వివాద పరిష్కార వ్యవస్థలో రెండో అప్పిలేట్ అధికారిగా పనిచేస్తుందని జీఎస్టీ అప్పిల్స్ అధ్యక్షుడు జస్టిస్ డా.సంజయ్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని హోటల్ హయత్‌లో జరిగిన గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ సమ్మిట్‌ను జస్టిస్ మిశ్రా ప్రారంభించి ప్రసంగించారు. 2026 జూన్ 30 చివరి తేదీగా నోటిఫై చేసిన గడువుకల్లా లక్షల సంఖ్యలో అప్పీలు జీఎస్టీఏటీ ముందు దాఖలు కావచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. జీఎస్టీఏటీ కార్యాచరణ ప్రారంభం భారతదేశపు పరోక్ష పన్నుల వివాద పరిష్కార వ్యవస్థలో రూపాంతరాత్మక అడుగుగా నిలుస్తుందన్నారు. జీఎస్టీ సంబంధిత అప్పిల్స్ పరిష్కారానికి ఇది పారదర్శక, సమర్థవంతమైన, పూర్తిగా డిజిటల్ వేదికగా రూపుదిద్దుకుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు, నిపుణులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే అప్పీలు దాఖలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా.. సమ్మిట్ అనంతరం జస్టిస్ మిశ్రా మీడియాతో మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 కింద ప్రతిపాదిత సరళీకరణ చర్యలు దీర్ఘకాలంలో వ్యాజ్యాలను తగ్గించే అవకాశముందని తెలిపారు.

## ఆర్య వైశ్యులకు అండగా ఉంటా

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ఆర్య వైశ్య సామాజిక వర్గానికి బాసటగా నిలుస్తానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు లాలాపేట్ ఆర్య వైశ్య సంఘం ప్రతినిధుల బృందం శనివారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో సమావేశమైంది. లాలాపేట్‌లో నిర్మిస్తున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం పనులు త్వరలోనే పూర్తవుతాయని సంఘం నేతలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సంఘం కార్యకలాపాలకు తగిన మద్దతుగా నిలవాలని వారు కోరారు. ఆలయం నిర్మాణం సంతోషకరమని, వారికి బాసటగా నిలుస్తానని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్, ఆర్య వైశ్య సంఘం నాయకులు రాములు గుప్త, వెంకటేశం, వీరభద్రయ్య, రమేష్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు నాగేశ్వర్‌రావు, సునీల్ తదితరులు ఉన్నారు.

# బంజారా సమాజానికి సద్గురువు సంత్‌సేవాలాల్ మహారాజ్

మంత్రి జూపల్లికృష్ణారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** బంజారాల ఆరాధ్యదైవం సంత్‌శ్రీసేవాలాల్ మహారాజ్‌చూపిన సన్మార్గాలు ప్రతి ఒక్కరికి ఆదరణీయమని , వారి మార్గదర్శకంలో గిరిజన బంజారాలు అభివృద్ధిచెందాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. సంత్‌శ్రీసేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను శనివారం జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలోని సేవాలాల్ భవనంలో సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గపరిధిలోని నలుమూలల ఉన్న తండాలనుండి గిరిజనులు హాజరుకాగా లంబాడి మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో మహిళలు నృత్యాలతో అలరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ కొల్లాపూర్ పట్టణంలోని మాధవస్వామిగుడి నుండి కొల్లాపూర్ ఈదమ్మరోడ్డు మార్గంగుండా సభస్థలంవరకు ర్యాలీతో గిరిజన సాంప్రదాయ నృత్యాలతో వేలాదిమంది గిరిజన మహిళ యువతీ యువకులతో కలిసి కలెక్టర్ బంజారాల తలపాగ ధరించి నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ బంజారా సమాజ ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహాజార్ సమాజశ్రేయస్సుకోసం చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. శ్రీసంత్‌సేవాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయనసేవలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి గిరిజన తండాలో చదువుకానివారికి చదువు వచ్చిన యువకులు, విద్యార్థులు సహకరించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి గ్రామంలో లైబ్రరీలను ఏర్పాటుచేసి ప్రజలలో పఠన సంస్కృతిని పెంపొందించడంతో పాటు వారి జ్ఞానాన్ని విస్తరింపచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామీణప్రాంతాల్లో విద్యా వాతావరణాన్ని బలోపేతం చేయడంద్వారా సమాజ అభివృద్ధికి పటిష్టమైన పునాది వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. జీవితంలో నైతిక విలువలు, క్రమశిక్షణవంటి గుణాలు వ్యక్తిని ఉన్నతస్థాయికి తీసుకెళతాయన్నారు. గిరిజన ప్రాంతానికి సంబంధించిన పెండింగ్ పనులన్నింటిని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల అభిలాషలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తూ కొల్లాపూర్ నియోజకవర్గంలో మంచి స్థలాన్ని ఎంపికచేసి సంత్‌సేవాలాల్ గుడిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ముందుకుసాగాలని కోరారు. వారు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ గిరిజన సమాజ అభివృద్ధికి అందరం పాటుపడాలని పిలుపునివ్వడం ద్వారా. తాను గిరిజన ప్రాంతం నుండి ఈస్థాయికి రావడానికి ప్రధాన కారణం విద్యయే అన్నారు. విద్య ఉన్నప్పుడే సమాజంలో గౌరవం, కీర్తిప్రతిష్టలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రఖ్యాత మానసిక నిపుణులు డాక్టర్ లక్ష్మణ్, కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సీలాల్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫిరంగి, వివిధశాఖల అధికారులు, వివిధ గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆశయాలు కొనసాగిద్దాం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** శ్రీశ్రీశ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని అయ్యప్ప కొండ, పద్మావతి కాలనీలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సేవాలావ్ మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. సమాజంలో నైతిక విలువలు సేవాభావం, ఐక్యత, సామరస్యం, ధర్మబద్ధత వంటి సద్గుణాలను పెంపొందించడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా బలహీన వర్గాల అభివృద్ధి, విద్యా ప్రోత్సాహం, సామాజిక సమానత్వం వంటి అంశాలు సేవాలావ్ మహారాజ్ ఆశయాల్లో కీలకమని, ఆ దిశగా ప్రభుత్వం మరియు స్థానిక ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ జి.మమత శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్పొరేటర్లు సువర్ణ కిషన్ నాయక్, దేవ్లీ మేగ్యా నాయక్, సీబీ శ్రీపూజిత, నాయకులు కె.శేఖర్ నాయక్, ఆర్.శేఖర్ నాయక్, అంతిరాం నాయక్, ప్రతాప్, తిరుపతి నాయక్, రఘురామిరెడ్డి, ఆనంద్ కుమార్, అనిల్, సంతోష్, తదితరులు ఉన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం

బిజ్వార్ జెడ్పీ పాఠశాలలో ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఉట్కూర్:** గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలకు సురక్షితంగా సకాలంలో చేరుకునే రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత పాఠశాల బస్సు ఒక వరమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ రూ.40 లక్షల వ్యయం గల పాఠశాల బస్సును ఉచితంగా అందజేశారు. శనివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ తో కలిసి ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంత గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. ఈ సేవను బిజ్వార్‌కు చెంతిన శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ దాతృత్వంతో ఏర్పాటు చేశారని, ఆయన ఏర్పాటు చేసిన ఈ రవాణా సౌకర్యం ద్వారా మండలంలోని కొత్తపల్లి, పాతపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలకు చెందిన మొత్తం 63 మంది విద్యార్థులు ప్రత్యక్ష లబ్ది పొందనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మేఘా గాంధీ, తాహసీల్దార్ చింతరవి, ఎంపిడిఒ కిషోర్ కుమార్, బిజ్వార్ గ్రామ సర్పంచు అంజయ్య, కొత్తపల్లి సర్పంచు నర్సింహులు, పాతపల్లి సర్పంచు తెరప్ప, మొగ్దుంపూర్ సర్పంచు తిరుమలేష్, పాఠశాల హెచ్ఎం కిశోర్ కుమార్, విద్యాశాఖ అధికారులు రాజేంద్ర కుమార్, విద్యాసాగర్, నాగార్జున రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు కృష్ణరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మమ్మ, గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిదే నైతిక విజయం



జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** ఇటీవల జరిగిన వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించి, కమలం పువ్వు గుర్తుపై పెద్ద ఎత్తున ఓట్లు వేసిన పట్టణ ఓటర్లకు బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వార్డుల్లో పోటీ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీలు కేవలం 31 వార్డులకే పరిమితం కాగా, బిజెపి మాత్రమే మున్సిపాలిటీలోని మొత్తం 33 వార్డులలో అభ్యర్థులను నిలిపి తమ సత్తా చాటిందని ఆయన పేర్కొన్నారు. 17వ వార్డులో డి.నిర్మల నారాయణ 260 ఓట్ల మెజార్టీతో, 26వ వార్డులో ఎం.విజయసాగర్ 34 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారని తెలిపారు. అధికార పార్టీ 10వ తేది సాయంత్రం వరకు బిజెపి 12 వార్డుల్లో గెలవబోతుందని ఇంటెలిజెన్స్ సమాచారం రావడంతో, కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు తెరలేపిందని, ఆరోపించారు. తెల్లవారుజామున 3.00 నుండి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత, ఓటుకు రూ.4000 నుండి 8000 వరకు పంపిణీ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ లు గెలవకపోతే వార్డుల్లో అభివృద్ధి జరగదని, ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని ఓటర్లను భయపెట్టారని, అయినప్పటికీ బిజెపి అభ్యర్థులు 4,13,24,28,29,32 వార్డుల్లో స్వల్ప తేడాతో ఓడిపోయారని, ఇది బిజెపి సాధించిన నైతిక విజయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండు నెలల్లో వనపర్తి నియోజకవర్గంలో భారీగా చేరికలు ఉండబోతున్నాయని, 2029 శాసనసభ ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, 26వ వార్డు కౌన్సిలర్ ఎం.విజయసాగర్, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు ఆగపోగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఇల్లు అనేది ప్రతి పేద వాడి స్వప్నం



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజా పాలనలో భాగంగా శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని 14వ వార్డుకి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్దిదారురాలు యస్.మాణిక్యమ్మ భర్త సునీల్ ఇంటి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంలో లబ్దిదారురాలు యస్.మాణిక్యమ్మ మాట్లాడుతూ ఇల్లు లేని పేద వాళ్లకు ఇండ్లు ఇచ్చిన మంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనాపూరం మార్కెట్ యార్డు చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్మన్ పాపయ్య , పల్లవి కృష్ణరెడ్డి, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మేస్త్రీ శ్రీను, కౌన్సిలర్లు ఎన్‌జె.బోయెజ్ పి.సుధ, రాంమోహన్‌రెడ్డి, జై.అఖిల, సుభాష్, ఎం.సంజీవుడు, మురళి యాదవ్, అజ్మత్ ఖనం సలీం ఖాన్, కొత్తకోట మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యం.భాస్కర్, యస్.బాబు, మైనార్టీ నాయకులు ముజీబ్, జె.కృష్ణయ్య, శాంతులు, జె.శ్యామ్, కె.దిలీప్, సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్, యూత్ నాయకులు కొమ్ము అనిల్, కె.చింటూ, షారోన్ తదితరులు ఉన్నారు.



## ఇంటర్ బోర్డు ముందు ధర్నా

జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ నేతలు అరెస్ట్

**ప్రజాపక్షం/నాంపల్లి:** అనుమతి లేని ఇంటర్ కాలేజీలకు కొమ్ము కాస్తూ.. విద్యార్థుల జీవితాలతో ఇంటర్మీడియట్ బోర్డు చెలగాటం ఆడుతోందని తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ ఆరోపించింది. ఈ మేరకు జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.

## బాలసదనం, వృద్ధాశ్రమం తనిఖీ



**ప్రజాపక్షం/నారాయణపేట్:** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ నారాయణపేట్ జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆదేశాల మేరకు శనివారం నారాయణపేట్ పట్టణంలోని బాల సదనం, వృద్ధాశ్రమంలను నారాయణపూట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే.అవినాష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అనాథ పిల్లలని, వృద్ధులను ఆశ్రమ నిర్వాహకులు మంచిగా చూసుకోవాలని వారికి మౌలిక సౌకర్యాలు, ఆరోగ్య పరీక్షలు సక్రమంగా చేయించాలని తెలిపారు. హాజరు పట్టికను పరిశీలించిఅందరూ ఉన్నారా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఆశ్రమ నిర్వాహకులకు న్యాయమూర్తి ఆదేశించారు. రోజు ఆహార దిన పట్టికను అడిగి వసతులను, దిన వస్తువులను ఆహార ధాన్యాల నాణ్యత, త్రాగు నీరు, పరిశుభ్రత, రిజిస్టర్లను, సీసీటీవీ ఫుటేజ్‌లను, మూమెంట్ రిజిస్టర్స్, ఆఫీస్ ఆర్డర్స్ ప్రకారం అడ్మిషన్స్ తీసుకుంటున్నారా, ఆఫీసర్ ఆర్డర్ ప్రకారము సంబంధించిన వాళ్ళకు అప్పచెపుతున్నారా లేదా తగిన రిజిస్టర్లు పరిశీలించారు. రోజువారీ ఆహార దిన పట్టికను పరిశీలించి, వాటి ప్రకారం నాణ్యమన ఆహారాన్ని అందించాలని తెలిపారు. బాత్రూమ్స్, బెడ్ రూమ్స్ శుభ్రంగా ఉంచాలన్నారు. తదనంతరము పిల్లలకు, వృద్ధులను పండ్లను పంపిణీ చేశారు. వృద్ధుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

## 23న అలంపూర్ పుణ్య క్షేత్రానికి కేంద్ర మంత్రి కుమారస్వామి రాక

పటిష్టంగా పోలీస్ బందోబస్తు : ఎస్‌పి, కలెక్టర్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ఈనెల 23న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి అలంపూర్ ఆలయాలకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సంతోష్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అలంపూర్‌లోని హెలిపాడ్ నుండి ఆలయానికి వెళ్లే రహదారిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం అతిథి మర్యాదలు చేయాలని, ఇతర అవసరమైన ఏర్పాట్లన్నీ సజావుగా పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తును నియమిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఆర్‌అండ్‌బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆత్మవిశ్వాసానికి నారాయణ బాట



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ నారాయణ స్కూల్‌లో విద్యాసంవత్సరపు టర్మ్2 ముగింపును పురస్కరించుకుని స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్సు కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యార్థి కేంద్రీత విద్యకు నూతన నాంది పలుకుతూ నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను పాఠశాల ప్రిన్సిపాల్ బయందర్ వివరిస్తూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను, వివిధ సబ్జెక్టుల్లోని క్లిష్టమైన అంశాలను తల్లిదండ్రుల సమక్షంలో వారే స్వయంగా వివరించడం ఈ కాన్ఫరెన్సు ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నారాయణ విద్యాసంస్థల జిఎం గోపాల్‌రెడ్డి, డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం వెంకటరెడ్డి, స్వాతి లక్ష్మి , చాంప్స్ కోఆర్డినేటర్ రీనా గుప్తా, వైస్ ప్రిన్సిపాల్ శరణిక, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకర్ రెడ్డి తో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రతపై కళాజాత ప్రదర్శన

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండలంలోని కల్వరాల గ్రామంలో శనివారం పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు తమ ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి, మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు పరిశుభ్రత పాటించడం ఎంతో అవసరమని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి దేశ అభ్యున్నతికి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఏర్పుల నాగరాజు, నాల్గవ వార్డు సభ్యులు చింతల రవికుమార్, కళాబృందం జిల్లా టీం లీడర్ ఎన్.సువర్ణ, కళాకారులు గుడిసె శివలింగం, డప్పు నరసింహ, డి.కృష్ణయ్య, శ్రీనివాసులు, రాధా, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.




## పిట్టగూడు ఆవిష్కరణ

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** గీత కార్మికుల సామాజిక జీవిత చిత్రణ చేస్తున్న యువకవి డా.తండ హరీష్ గౌడ్ రచించిన పిట్ట గూడు కవితా సంకలనం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా హరీష్‌గౌడ్‌ను ప్రముఖ కవి, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.ఏనుగు నరసింహారెడ్డి అభినందించారు. లోకాన్ని పట్టించుకునేవాడే కవి అని.. కవిత్వం బావుందని కొనియాడారు. కార్యక్రమంలో డా.నందిని సిద్ధారెడ్డి, యాకూబ్, సలీమా, ఆనందా చారి, ప్రొఫెసర్ రఘు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఒత్తిడిలో ఉన్న భారత్‌ను ఓడిస్తాం

## సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా.. అసలు సిసలు పోరుకు సిద్ధమైంది. సూపర్ 8లో భాగంగా ఆదివారం సౌతాఫ్రికాతో టీమిండియా అమీతుమీ తేల్చుకో నుంది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా రాత్రి 7.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే ఈ మ్యాచ్ నేపథ్యంలో తమ కంటే భారత్‌పైనే ఒత్తిడి ఎక్కువగా ఉందని సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ అన్నాడు. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియా తో మాట్లాడిన షుక్రి కాన్రాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. ఒత్తిడిలో ఏ జట్టు అయినా బలహీనపడుతుందని, దాన్ని క్యాష్ చేసుకొని విజయం సాధిస్తామని పేర్కొన్నాడు. 'భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. సెమీ ఫైనల్స్ చేరుకునే విషయంలో టీమిండియా పైనే అంచ నాలు ఎక్కువగా ఉన్నాయి. వారు ఫైనల్కు కూడా చేరుకుంటారు. అయితే ఒత్తిడిలో వారు బలహీనపడుతారు. దాన్ని క్యాష్ చేసుకుంటాం. నిజానికి మా ఇరు జట్ల మీదా ఒత్తిడి ఉంటుంది. మేమంతా అత్యుత్తమ జట్టుతో మ్యాచ్ ఆడితే ఉండే ఒత్తిడి గురించి మాట్లాడుతున్నాం. నిజానికి వారు ఏ ఒత్తిడిలో ఉన్నారో తెలియదు. అభిషేక్ శర్మ ఆడిన మూడు మ్యాచుల్లో వరుసగా డకౌట్ అయిన వ్యక్తి, జట్టులో తన స్థానం గురించి పడే ఒత్తిడి గురించి నేను మాట్లాడటం లేదు.' అని షుక్రి కాన్రాడ్ పేర్కొన్నాడు. మూడు మ్యాచ్‌లో డకౌట్ అయినా అభిషేక్‌శర్మకు టీమిండియా మేనేజ్‌మెంట్ అండగా నిలుస్తోంది. అతను వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్ అని, కీలక సమయంలో తప్పకుండా ఫామ్ అందుకుంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. గతేడాది చివర్లో సౌతాఫ్రికా జట్టు భారత్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా 31తో గెలిచింది. ఈ సిరీస్‌లో ఒక మ్యాచ్ వర్షం కారణంగా తుడిచి పెట్టుకుపోయింది. అయితే ద్వైపాక్షిక సిరీస్ ఫలితాలు ప్రపంచకప్ పోరుకు ఏ మాత్రం ప్రామాణికం కావని షుక్రి అన్నాడు.

పొట్టి ప్రపంచకప్‌లో కీలకమైన సూపర్ 8 ఆరంభ పోరుకు వర్షం అంతరాయం కలిగిస్తోంది. పాకిస్థాన్, న్యూజిలాండ్ మ్యాచ్ టాస్ పడిందో లేదో ప్రేమదాస స్టేడియంలో వాన అందుకుంది. చిన్నగా మొదలైన చినుకులు అంతకంతకూ పెరగడంతో సిబ్బంది పిచ్‌తో పాటు ఔట్‌ఫీల్డును కవర్లతో కప్పేశారు. దాంతో.. పాక్, కివీస్ మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభం కానుంది. వరుణుడు ఎప్పుడు శాంతిస్తాడు? ఆట ఎప్పుడు మొదలవుతుంది? అని ఇరుజట్ల ఆటగాళ్లు, అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రపంచకప్ మ్యాచ్‌కు వర్షం అడ్డుపడడం ఇది రెండోసారి. లీగ్ దశలో గ్రూప్ బీలోని ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్‌ను అడ్డుకున్న వరుణుడు.. చివరకు ఆస్ట్రేలియా నిష్క్రమించడానికి కారణమయ్యాడు. ఈసారి సూపర్ 8లో మొదటి మ్యాచ్కే అంతరాయం కలిగిస్తున్నాడు. ప్రేమదాస స్టేడియంలో టాస్ గెలిచిన పాక్ సారథి సల్మాన్ అఘా బ్యాటింగ్ ఎంచుకున్న కాసేపటికే.. చినుకులు షురూ అయ్యాయి. అప్పటికే ఆకాశం మేఘావృతమై ఉండడంతో అప్రమత్తంగా ఉన్న సిబ్బంది వర్షం మొదలవ్వగానే కవర్లతో పిచ్‌ను, ఔట్‌ఫీల్డును పూర్తిగా కప్పేశారు. వాన తగ్గాక.. ఔట్‌ఫీల్డును సిద్ధం చేశాక తొలి బంతి పడుతుంది. ఒకవేళ ఓవర్లు కుదించి అయినా మ్యాచ్ జరిపించే అవకాశముంది.

**పాకిస్థాన్ తుది జట్టు :** సహిబ్జద ఫర్హాన్, సయీం ఆయూబ్, సల్మాన్ అఘా(కెప్టెన్), బాబర్ ఆజాం, ఫఖర్ జమాన్, ఉస్మాన్ ఖాన్(వికెట్ కీపర్), షాదాబ్ ఖాన్, మొహమ్మద్ నవాజ్, ఫహీం అష్రఫ్, సల్మాన్ మిర్జా, ఉస్మాన్ తారీఖ్.

**న్యూజిలాండ్ తుది జట్టు :** టిమ్ సీఫర్ట్(వికెట్ కీపర్), ఫిన్ అలెన్, రచిన్ రవీంద్ర, మార్క్ చాప్మన్, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్, మిచెల్ శాంట్నర్(కెప్టెన్), జేమ్స్ నీషం, ఇష్ సోధీ, లాకీ ఫెర్గూసన్.

## పాక్, కివీస్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం..



## స్టార్ ప్లేయర్‌కు గాయం!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో కీలకమైన సూపర్8 దశ ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ నెట్స్‌లో గాయపడ్డాడు. సూపర్8 దశలో సౌతాఫ్రికాతో మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్న సిరాజ్.. బౌలింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. అతను వేసిన బంతిని హార్దిక్ పాండ్యా బలంగా కొట్టాడు. అది కాస్త సిరాజ్ ఎడమ మోకాలికి బలంగా తగిలింది. దాంతో అతను నొప్పితో విలవిల్లాడిపోయాడు. ఫిజియో అతనికి సపర్యలు చేశాడు. కాసేపటికి నెట్స్ నుంచి సిరాజ్ వెళ్లిపోయాడు. దాంతో సిరాజ్ గాయంపై ఆందోళన నెలకొంది. ఈ మెగా టోర్నీలో మహమ్మద్ సిరాజ్ ఒకే ఒక్క మ్యాచ్ ఆడిన సంగతి తెలిసిందే. మెగా టోర్నీ ప్రారంభానికి ముందు సౌతాఫ్రికాతో వార్మప్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా గాయపడటంతో అనూహ్యంగా సిరాజ్ జట్టులోకి వచ్చాడు.



# ట్రంప్ తీరు మారదా!

## లేని అధికారాల కోసం ట్రంప్ పాకులాట

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు లేని అధికారం కోసం పాకులాడుతున్నారు. ప్రపంచ దేశాలపై తన పెత్తనం ఉండాలనే మొండితనం ఆయన చేష్టల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే, రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే 'అమెరికా ఫస్ట్' నినాదంతో ప్రపంచ వాణిజ్య వ్యవస్థను కుదిపేసే సుంక విధానాలకు శ్రీకారం చుట్టారు. పొరుగు దేశాల నుంచే కాదు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వస్తువులపైనా భారీ స్థాయిలో దిగుమతి సుంకాలు విధించారు. ఈ చర్యల వల్ల గత ఏడాది అమెరికా ఖజానాకు దాదాపు 287 బిలియన్ డాలర్ల అదనపు ఆదాయం వచ్చినట్లు ఆర్థిక నివేదికలు సూచిస్తున్నాయి. 1930 దశకాల తరువాత అమెరికా చరిత్రలో ఇంత కఠినమైన వాణిజ్య పన్ను విధానం ఇదేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ఈ విధానాలకు చట్టబద్ధతపై ప్రశ్నలు తలెత్తాయి. చివరకు సుప్రీం కోర్ట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఈ సుంక ఉత్తర్వులకు బ్రేక్ వేసింది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పును అనుసరించి, అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్/ఐఇఇపిఎ) ఈ విధంగా దిగుమతులపై ఇష్టానుసారంగా పన్నులు విధించేందుకు స్పష్టమైన అధికారం ఇవ్వదు. ఈ చట్టం ప్రకారం అధ్యక్షుడు విదేశీ ఆస్తులను స్తంభింపజేయడం, అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలను నియంత్రించడం వంటి చర్యలు తీసుకోవచ్చు గాని, సాధారణ వాణిజ్య విధానాల కోసం లేదా ఆదాయం పెంచే పన్నుల కోసం దీనిని వినియోగించలేరు. ఈ తీర్పు అమెరికా అధ్యక్ష అధికారాల పరిమితులను మరోసారి గుర్తు చేసింది. ఈ కేసులో ప్రముఖ భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ కీలక పాత్ర పోషించారు. ఆయన వాదన ప్రకారం, 1977లో అమలులోకి వచ్చిన ఈ చట్టం అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఆంక్షలు విధించేందుకు మాత్రమే ఉద్దేశించబడింది. 39వ అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ సంతకం చేసిన ఈ చట్టం, గతంలో అధ్యక్షులు అత్యవసర అధికారాలను అతిగా వినియోగిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో రూపొందించారు. చరిత్రలో ఇది ప్రధానంగా ఆంక్షలు, ఆస్తుల ఫ్రీజింగ్, ఆర్థిక నియంత్రణల కోసం మాత్రమే ఉపయోగించబడింది. సెక్షన్ 301 లేదా సెక్షన్ 232 వంటి వాణిజ్య చట్టాలతో పోల్చితే ఇది భిన్నం. ఆ చట్టాలు జాతీయ భద్రత లేదా అన్యాయ వాణిజ్య చర్యలపై దర్యాప్తు అనంతరం అమలులోకి వస్తాయి. కానీ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం సాధారణ సుంక విధానానికి సాధనం కాదని సుప్రీంకోర్టు తేల్చింది. అయితే తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే ట్రంప్ మరో మార్గాన్ని ఎంచుకున్నారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122 ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా 10 శాతం తాత్కాలిక దిగుమతి సర్‌చార్జ్ విధించే కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికాకు తీవ్రమైన చెల్లింపుల లోటు ఉన్నప్పుడు గరిష్టంగా 150 రోజులపాటు 15 శాతం వరకు సర్‌చార్జ్ విధించే అధికారం ఈ సెక్షన్ ఇస్తుంది. అయితే ఇది పూర్తిగా తాత్కాలిక చర్య మాత్రమే. దీర్ఘకాలికంగా కొనసాగించాలంటే కాంగ్రెస్ ఆమోదం అవసరం. ట్రంప్ సుంక విధానాల ప్రధాన లక్ష్యం అమెరికా వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం. వాణిజ్య లోటులో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ, స్థానిక తయారీ రంగం ఆశించిన స్థాయిలో పుంజుకోలేదని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఆటోమొబైల్ రంగం సహా పలు పరిశ్రమలు అధిక దిగుమతి పన్నుల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దిగుమతి ఆధారిత ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. ఫలితంగా వినియోగదారులపై ధరల భారము పడింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ఆందోళనకర స్థాయికి చేర్చింది. ఇలాంటి నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. అధ్యక్ష అధికారాల పరిమితులపై స్పష్టతనిచ్చిన ఈ నిర్ణయం, భవిష్యత్తులో అత్యవసర చట్టాల వినియోగంపై కొత్త ప్రమాణాలను ఏర్పరచింది. అమెరికా వాణిజ్య విధానాల దిశ ఇకపై ఎలా మారుతుందన్నది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆసక్తిగా గమనిస్తోంది.

### బులియన్ మార్కెట్

దేశంలో శనివారం బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. 100 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.19, 100 పెరిగి రూ.15,92,800 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములకు రూ.17,500 పెరిగి రూ.14,60,000 వద్ద ఉంది. అలాగే 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములకు రూ.14,300 పెరిగి రూ.11, 94,600 వద్ద కొనసాగుతోంది. ఈ పెరుగుదల ఒకే రోజులో నమోదు కావడం మార్కెట్‌లో ఉన్న ఉద్రిక్తతను సూచిస్తోంది.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ/క్లోజింగ్): సెన్సెక్స్ 82,814.71 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 82,626.76 పాయింట్లు. లాభం 187.95 పాయింట్లు).

జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ/క్లోజింగ్): నిఫ్టీ 25,571.25 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,471.10 పాయింట్లు. లాభం 100.15 పాయింట్లు).



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన విస్తృత గ్లోబల్ సుంకాలను సుప్రీం కోర్ట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రద్దు చేసిన వెంటనే, వైట్ హౌస్ నుంచి వెలువడిన ప్రకటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈనెల 24 నుంచి 150 రోజులపాటు అన్ని దేశాలపై సమానంగా 10 శాతం తాత్కాలిక దిగుమతి సర్‌చార్జ్ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం అందులో స్పష్టం చేసింది. ముందుగా భారతదేశంపై అమలులో ఉన్న 25 శాతం పరస్పర సుంకం ఇప్పుడు 10 శాతానికి తగ్గింది. దేశాలవారీగా వేర్వేరు రేట్ల స్థానంలో ఒకే రకం సర్‌చార్జ్ విధించడం ద్వారా తాత్కాలిక సమతుల్యత తీసుకురావాలనే ప్రయత్నం ఇది. అయితే ఈ 150 రోజుల తరువాత ఏ విధమైన సుంక వ్యవస్థ అమలులోకి వస్తుందో స్పష్టత లేదు. భారీ సుంకాలపై అమెరికా సుప్రీం కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ఇతరత్రా మార్గాల్లో ట్రంప్ తన నిర్ణయాలను అమలు చేయాలన్న పట్టుదలతో ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ఆ క్రమంలోనే 10 శాతం అదనపు సుంకాన్ని ఏకంగా అన్ని దేశాలపైనా విధించారు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# ఉదయ్ సేవలు చిరస్మరణీయం







## ఆయన ఆశయం అజరామరం
## పువ్వాడ ఉదయ్‌కు ఘన నివాళి

ప్రజాపక్షం/ఖమ్మం : పువ్వాడ ఉదయ్‌కుమార్ యువజన, విద్యార్థి నాయకులుగా, ఖమ్మం మున్సిపల్ సిపిఐ మాజీ ఫ్లోర్ లీడర్‌గా అందించిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఉదయ్ కుమార్ ఒక కమ్యూనిస్టు మేధావి అని విదేశాల్లో విద్యను అభ్యసించిన ఆయన పేదల సమస్యల పరిష్కారానికి పోరాట మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. దివంగత సిపిఐ నేత పువ్వాడ ఉదయ్‌కుమార్ 20వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక మమతలోని క్రాంతి ఘాట్‌లో ఉదయ్ స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ఉదయ్ కుమార్ మాతృమూర్తి విజయలక్ష్మి, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి, ఉదయ్‌కుమార్ సతీమణి పువ్వాడ జయశ్రీ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉదయ్‌కుమార్ తుదిశ్వాస వరకూ కృషి చేశారన్నారు. ముఖ్యంగా పేదల నివాస స్థలాల కోసం ఆయన ఖమ్మంలో జరిపిన పోరాటం పలు పోరాటాలకు ఊపునిచ్చిందన్నారు. తదనంతర పరిణామాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటికీ ఆయన వేలాది మందికి నివాస స్థలం దక్కేలా కృషి చేశారని ఆయన కృషిలో భాగంగానే ఇప్పుడు పువ్వాడ ఉదయ్‌నగర్ ఏర్పాటైందని అక్కడి పేదలకు నివాస స్థలాలు దక్కాయని హేమంతరావు తెలిపారు. పువ్వాడ ఉదయ్‌కుమార్ ఆశయం అజరామరమని ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు.

**వైఎస్ఆర్ నగర్‌లో :** వైఎస్ఆర్ నగర్‌లో పువ్వాడ ఉదయ్‌కుమార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో ఉదయ్‌కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ మాట్లాడుతూ ఉదయ్‌కుమార్ తన పోరాటాలతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని ఆయన ఆశయ సాధనకు పునరంకితం కానున్నామన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్ నగర్‌లో ఉదయ్‌కుమార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాన బాల రామకృష్ణ, సిపిఐ కార్యాలయ కార్యదర్శి కె. శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, సైదా, ఉపేందర్, ఆముదాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలి

## ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఆశా కార్మికులకు కనీస వేతనం రూ 18వేలను చెల్లించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కోఠిలోని కమిషనర్ కార్యాలయం ముందు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించకుండా కార్యకర్తలు అనే పేరుతో రోజంతా పని చేపించుకుంటూ అతి తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను, కనీస వేతనాలను అమలు చేయకుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నారన్నారు. కార్మిక నిబంధనల ప్రకారం వారికి రావాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ, పండగ సెలవులు, వారాంతపు సెలవులను అమలు చేయకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. రాష్ట్రంలో ఆశా కార్మికులకు జనవరి నెల జీతాలు సగం మందికి మాత్రమే చెల్లించి, మిగతావారికి చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ దురదృష్టవశాత్తు మరణిస్తే రూ.50 వేల మట్టి ఖర్చులు, ప్రసూతి సెలవులు లాంటి డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎన్.కరుణ కుమారి, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఎన్ కవిత,ఎఐటియుసి రాష్ట్ర నాయకురాలు ఎ.చంద్రకళ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయనిర్మల, కల్పన, కళ, మనీ, దృపద, లక్ష్మి తదితరులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కెటిపిపి ఎఐటియుసి హెచ్-64 క్యాలెండర్ ఆవిష్కరించిన కూనంనేని

ప్రజాపక్షం/భూపాలపల్లి : తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి హెచ్64, కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్, రీజినల్ కమిటీ క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ కార్మికుల సమస్యలైన గ్రేడ్ చేంజ్, ఎపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపు గురించి విద్యుత్ యాజమాన్యంతో మాట్లాడుతానని హామీ ఆయన హామీ ఇచ్చారు. ఈ ఏఐటీయూసీ హెచ్64 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ శంకర్, కెలావత్ కృష్ణ, కేటీపీపి రీజినల్ అధ్యక్షులు కోల శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిగినేని ధర్మారావు, రీజినల్ ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్, రీజినల్ కార్యనిర్వాహక కార్యదర్శి బండారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐ నేత శ్రీరాముల రామచంద్రం మృతి పార్టీకి తీరనిలోటు

## సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

ప్రజాపక్షం/కరీంనగర్ : మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు శ్రీరాముల రామచంద్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి ఆయన కుటుంబానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాముల రామచంద్రం గత 40 సంవత్సరాలకు పైగా సిపిఐ పార్టీలో ఉన్నారని, గ్రామ స్థాయి కార్యదర్శిగా, మండల కార్యదర్శిగా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పనిచేశారని, మండలంలో అనేక గ్రామాల్లో పార్టీ విస్తరణ కోసం పనిచేశారని, ప్రజా సంఘాలను ఏర్పాటు చేశారని, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శిగా కూడా కొంత కాలం పనిచేశాడని, ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా కూడా పనిచేసి వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేశాడని, కొండపల్కల గ్రామంలో పార్టీ కార్యాలయం నిర్మించడంలో కీలక పాత్ర పోషించాడనీ శ్రీనివాస్ తెలిపారు. 74 ఏళ్ల వయస్సులో కూడా నేటికి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వాడని, గత సంవత్సరం జరిగిన పార్టీ జిల్లా మహాసభలో అమరవీరుల స్మారక చిహ్నంగా ఏర్పాటు చేసిన స్థూపాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించే అవకాశాన్ని జిల్లా పార్టీ కలిగించిందన్నారు. సీనియర్ నాయకులుగా ఆయన పార్టీకి పెద్దదిక్కుగా ఉన్నారని, అలాంటి క్రమశిక్షణ కలిగిన నాయకుడు శనివారం కొత్తపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటని మృతి పట్ల సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు పంజాల శ్రీనివాస్ తెలిపారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలేవీ?

## కుంటను మాయం చేస్తున్నా పట్టించుకోని అధికారులు
## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారీ



ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని హత్తిగూడా రెవిన్యూ సర్వే నంబర్ 19, హయత్‌నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 98లో కలిపి సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో గల కుంట నుండి ఆయకట్టుకి వెళ్లే నాలాని పూడ్చి పక్కనే ఉన్న 2.5 ఎకరాల బిల్ల దాఖల భూమి, ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెంచర్ వేసి విల్లాలు నిర్మాణం చేస్తున్న కబ్జా కోరులపై రెవిన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవటం లేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల పరిధిలో కబ్జాకి గురవుతున్న చిన్న కుంటని, దాని నాలాని శనివారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు స్థానిక పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణంలో గల ప్రైవేట్ భూమిని సాకుగా చూపి హత్తిగూడా చిన్న కుంటని, దాని నాలాని పూడ్చి నాలా స్థలంలో అక్కడి భూస్వామి అక్రమంగా విల్లాల నిర్మాణం చేపడుతున్నాడు. కొన్ని కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిపై కన్నేసిన సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి (భూస్వామి) రెవిన్యూ అధికారులని మోసం చేస్తూ పబ్బం గడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంలో 2023లో సంబంధిత అధికారులకి ఫిర్యాదు చేయటం కొంత కాలం పనులని నిలిపివేయగలిగాం. తిరిగి ఇప్పుడు పనులు ప్రారంభం కావటం వల్ల ఈ నెల 16న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు కూడా ఎలాంటి చర్యలు వారిపై తీసుకోకపోగా, కనీసం నిర్మాణాలని కూడా ఆపకపోవటం అనుమానంగా ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే వెంటనే అడ్డుకునే రెవిన్యూ అధికారులు ఇక్కడ నాలా కబ్జాకి గురైనా కూడా ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుందన్నారు. హత్తిగూడా చిన్న కుంట చాలా పురాతనమైనదని ఎల్‌బి నగర్ సర్కిల్ పరిధిలోని అనేక కాలనీల వర్షపు నీరు ఈ కుంటలోకే చేరుతుంది. ఈ కుంట నుండి అలుగు పోయటం ద్వారా ఆయకట్టుకు చేరటానికి ఉన్న నాలానే ఇప్పుడు పూర్తిగా కనుమరుగయింది. దాని స్థానంలో వెంచర్ చేసి నిర్మాణాలు కడుతున్నారు. కాబట్టి రెవిన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు, తక్షణమే స్పందించి సర్వే చేసి కబ్జాకి గురైన కోట్ల రూపాయల విలువ చేసే 5 ఎకరాల ప్రభుత్వ భూమిని, ఆయకట్టు నాలాని రక్షించి కుంటకి పూర్వ వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, బిటిసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, సిపిఐ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్, పేరాల గోపి, నిరంజన్, ఉప్పలయ్య, అశోక్, పాండు, ప్రియా, అన్నపూర్ణ, రాజు, విరమల్లు, మాల్యార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మానవాళి విముక్తికి మార్గదర్శి, కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక



## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి

ప్రజాపక్షం/కాజీపేట : ప్రపంచంలో మానవాళి విముక్తి కొరకు సమ సమాజ నిర్మాణం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక 1848లో కారల్ మార్క్స్, ఎంగిల్స్ అపూర్వ సోదరులుగా పార్టీ ప్రణాళికా రచించడం జరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. శనివారం కాజీపేట్‌లో ఏఆర్ నగర్ సిపిఐ కార్యదర్శి సలాకుల స్వరూప అధ్యక్షతన రెడ్ బుక్ డే సందర్భంగా కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మునిగాల బిక్షపతి, కాజీపేట మండల సహాయ కార్యదర్శి బరిగెల కుడి స్వామి, భోగి స్వరూప, పిట్టల సావిత్రి, స్వాతి, ఎండి ఫరీదా, సుజాత పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్గా (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్గా కొనసాగిన ప్రతిమాసింగ్ ప్రసూతి సెలవులపై వెళ్ళడం జరిగినది. ఫిబ్రవరి 20 శుక్రవారం నాడు తిరిగి అదనపు కలెక్టర్గా (స్థానిక సంస్థలు)బాధ్యతలు స్వీకరించారు.

## యథావిధిగా ప్రజావాణి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ (సోమవారం) నుండి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మండల వ్యవసాయ శాఖ అధికారి దండెం విజయచంద్ర


**ప్రజాపక్షం/షాబాద్:** రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. శనివారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని రైతు వేదిక కార్యాలయంలో ఆయా క్లస్టర్ ఏఈఓల ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి నుండి ఈ నెల చివరి వరకు రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదిక కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. షాబాద్ మండలంలో మొత్తం రైతులు 27,110 మంది ఉండగా అందులో కేవలం 12,990 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నట్లు వివరించారు. సుమారుగా 14,120 మంది ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉందన్నారు. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అందరూ సకాలంలో రైతు వేదిక కార్యాలయంలో వ్యవసాయ అధికారులను సంప్రదించి రైతు పాసుబుక్, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింకు చేసి ఫార్మర్ ఐడి పొందాలన్నారు.

## ముస్లిం వర్గానికి టూల్కిట్లు, ఈ-స్కూటర్ల పంపిణీ : కోట్ల

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టిజిఎంఎఫ్సి) ఆధ్వర్యంలో ఆర్థిక సహాయ పథకం (ఎకనామిక్ సపోర్ట్ స్కీం) అనే రెండు పథకాలను 2025–26 ఆర్థిక సంవత్సరానికి అమలులోకి తీసుకువచ్చినట్లు రంగారెడ్డి జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి కోట్ల నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఒకటి తుర్కా శాఖ ముస్లిం వర్గానికి టూల్కిట్లు అండ్ జనరేటర్ల పంపిణీ రాళ్లు కత్తిరించే వృత్తిలో నిమగ్నమైన పేదతుర్కా కాశా ముస్లిం వర్గానికిచెందిన లబ్ధిదారులకు పునరావాసం,జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా ఈ పథకం అమలు చేయబడుతుందని తెలిపారు.ఈ పథకం ప్రతి లబ్ధిదారుడికి రూ.60,000 చొప్పున, రూ.10,000 విలువైన టూల్కిట్, రూ.50,000ల విలువైన జనరేటర్ను 100 శాతం సబ్సిడీతో ఒకేసారి అందించబడుతుంది. అదేవిధంగా రెండవది మైనారిటీ యువతకు ఎలక్ట్రికల్ ఈ స్కూటర్ల పంపిణీ (పైలట్ ప్రాజెక్ట్) మైనారిటీ యువత (పురుషులు) ఆర్థికంగా బలోపేతం కావడానికి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎలక్ట్రికల్ ఈస్కూటర్ల పంపిణీ పథకం అమలులో ఉంది. ఈ పథకంలో ఈస్కూటర్ యూనిట్ వ్యయం సుమారు రూ.1.50 లక్షలుకాగా, అందులో 80 శాతం సబ్సిడీ (రూ.1.20 లక్షలు) ప్రభుత్వం అందిస్తుంది. మిగిలిన 20 (రూ.30, 000) లబ్ధిదారుడి వాటాగా ఉంటుంది.ఎంపికైన లబ్ధిదారులను ఉబర్/రాపిడో/ఓలా వంటి సేవా సంస్థలతో అనుసంధానంచేయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడం జరుగుతుందని వివరించారు. ఈ రెండు పథకాల కోసం ఆన్లైన్ దరఖాస్తులు తేది: 20–02–2026 ఉదయం 10:30 గంటల నుండి తేది: 01–03–2026 రాత్రి 11:59 గంటల వరకు TGOBMMS వెబ్సైట్ :http://tsobmms.cgg.gov.inలో స్వీకరించబడతాయి.ఈ అవకాశాన్ని రంగారెడ్డి జిల్లాలోని అర్హులైన తుర్కా కాశా ముస్లిం అండ్ మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి నవీన్ కుమార్ రెడ్డి కోరారు.

## ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం

షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప




**ప్రజాపక్షం/షాద్నగర్:** ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప వివరించారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సంఘం సభ్యులు నూతన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు బచ్చలి నరేష్, సి.పెంటయ్యలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ మాట్లాడుతూ మున్సిపాలిటి అభివృద్ధికి రిటైర్డు ఉద్యోగులైన మీ సూచనలు, సలహాలు ఇచ్చేందుకు కృషి చేయాలని, వాటిని పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామారావు, జిల్లా అధ్యక్షుడు సరాపు జగదీశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, షాద్నగర్ ప్రధాన కార్యదర్శి నందిగామ సురేష్కుమార్, కోశాధికారి సుధాకర్రెడ్డి, కార్యవర్గ సభ్యులు మూలే జనార్ధన్, భిష్వ కృష్ణయ్య, మందారం నరసింహులు, ఈశ్వరయ్య, రంగరాజకుమార్, వెంకటరమణ, శ్యామల, విజయలక్ష్మి , గోపాలరావు, స్వరాజ్ బాబులు పాల్గొన్నారు.

**జాంగ్ర కులదైవం సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సన్మానం**

షాద్నగర్ మున్సిపల్ నూతన చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేసిన అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేసిన అందె మోహన్ ముదిరాజ్లతోపాటు కౌన్సిలర్లను జాంగ్ర కులదైవం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మాజీ చైర్మెన్ అగ్గనూరు విశ్వం, కౌన్సిలర్లు విశాల విశ్వం, సి.పెంటయ్య, మురళీమోహన్ (అప్పి)లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాంగ్ర కులదైవం సంఘం సభ్యులు పోగుల లింగమ్మ, మంత మల్లిఖార్జున్, మాచర్ల చిన్నస్వామి, మంత బస్వరాజ్, వన్నాడ లింగం, దేవరకొండ శ్రీనివాసులు, విభూతి జానయ్య, మంత లక్ష్మయ్య, మంత అశోక్లు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

హెచ్ సిటీ, ఎస్ఎన్డిపి ప్రాజెక్టులపై ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్/మేడ్చల్ మల్కాజిగిరి :** మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం హెచ్ సిటీ, ఎస్ఎన్డిపి ప్రాజెక్టులపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమార్ హాజరయ్యారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు హెచ్ సిటీ ద్వారా చేపట్టిన 4 ప్రధాన ఫ్లైఓవర్ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఏఓసి సెంటర్ ఫ్లైఓవర్, ఆర్.కె.పురం రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబి), ఆర్.కె.పురం రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్యుబి), టికెఆర్ కమాన్ నుండి మంద మల్లమ్మ వరకు నిర్మించే ఫ్లైఓవర్ ప్రాజెక్టులకు సంబంధించి ఎక్కడైనా ఆటంకాలు ఉంటే వెంటనే తొలగించాలని, ప్రధానంగా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆయన ఆదేశించారు. వరద ముప్పును నివారించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఎన్డిపి పనుల పురోగతిని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎన్డిపి నాలాల పనులు వర్షాకాలం లోపే పూర్తి కావాలన్నారు. మొత్తం 9 కొత్త నాలా పనుల్లో ప్రస్తుతం 6 పనులు పురోగతిలో ఉండగా, మిగిలిన 3 పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే నాలాల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి

సిఎంసి కమిషనర్ జి.సృజన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సి ఎంసి) కమిషనర్ సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. నెక్నాంపూర్ చిన్న చెరువులో అమృత్ 2.0 పథకం ద్వారా హెచ్ఎండిఎ అమలు చేస్తున్న మురుగునీటి మళ్లింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నెక్నాంపూర్ చిన్న చెరువు వద్ద సాగుతున్న సీవరేజ్ డైవర్షన్ ప్రాజెక్టుతో పాటు, పండెనవాగు మీద నిర్మాణంలో ఉన్న ప్రధాన వర్షపు నీటి కాలువ పనులను సమీక్షించారు. ఈ వర్షపు నీటి కాలువ నెక్నాంపూర్ పెద్ద చెరువులో కలిసే విధంగా రూ.99.50 కోట్ల వ్యయంతో చేపట్టారు. డిప్యూటీ కమిషనర్45, డిఈఈ (ఎస్డబ్ల్యూఎం), డిఈఈ (మెయింటెనెన్స్) అధికారులు పనుల పురోగతి, గడువులు, అమలు విధానం తదితర అంశాలపై కమిషనర్కు వివరించారు. అనంతరం చిత్రపురి కాలనీ మెయిన్ రోడ్డును సందర్శించిన కమిషనర్, రహదారి పక్కన పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమోదిత రోడ్డు అభివృద్ధి ప్రణాళిక (ఆర్డిపి) ప్రకారం చిత్రపురి కాలనీలో రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ అన్నారు.

## జ్ఞాన సంపద పెంచుకోవాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన




**ప్రజాపక్షం/నాంపల్లి:** ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థులు నిరంతరం జ్ఞాన సంపద పెంచుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రపంచ ఆలోచనా దినోత్సవం (వరల్డ్ థింకింగ్ డే) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హరిచందన విచ్చేసి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న స్కౌట్ ఉద్యమం స్థాపకుడు లార్డ్ రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బాడెన్ పోవెల్ జన్మదినం రోజును ప్రపంచ ఆలోచన దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్, స్కౌట్ మాస్టర్ రాములు నాయక్, వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటిని వృథా చేయొద్దు

జలమండలి ఎండి అశోక్రెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నీటిని వృథా చేయకుండా... పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జలమండలి ఎండీ అశోక్రెడ్డి పేర్కొన్నారు. శనివారం క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా, సీవరేజ్ సమస్యలను గుర్తించేందుకు చేపట్టిన 'బస్తీ బాట'కార్యక్రమంలో భాగంగా పుప్పాలగూడలోని సెక్రటేరియట్ కాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా సమయంలో పలు ఇండ్లను సందర్శించి సమస్యలపై ఆరాతీశారు. క్యూఏటీ సిబ్బందితో కలిసి క్లోరిన్ స్థాయిలు, నీటి ప్రెషర్, నీటి సరఫరా సమయాలపై సమీక్షించారు. సీవరేజ్ నెట్వర్క్పై కాలనీ వాసులతో చర్చించారు. కాలనీలలో విస్తృతంగా సందర్శించిన జలమండలి ఎండీ కొంతమంది తాగునీటిని వృథా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నీటిని వృథా చేయకుంటే, పొదుపు చేసినట్టే అని పేర్కొన్నారు. విద్యావంతులు నీటి పొదుపు పట్ల మరింత బాధ్యతగా ఉండాలని, ఇతరులకు అవగాహన కల్పించడంలోనూ ముందుండాలని కోరారు. ఇదిలాఉండగా... ఖాజాగూడ చెరువు దిగువ ప్రాంతం, మణికొండ, చిత్రపురి కాలనీ ప్రాంతాల నుంచి ఉత్పత్తి అయ్యే మురుగును శుద్ధి చేయుటకు చిత్రపురిహిల్స్ సమీపంలో 30 ఎంఎల్డీ సామర్థ్యంతో నిర్మితం అవుతున్న చిత్రపురి మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ఎండీ అశోక్రెడ్డి సందర్శించారు.

# కొందుర్గును ఆదర్శ మండలంగా చేస్తాం

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సహకారంతో కొందుర్గు మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండాలో పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవన నిర్మాణాలకు శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం, చిన్న ఎల్కిచర్ల గ్రామంలో పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనం, ఎస్సీ కమ్యూనిటి హాల్కు శంకుస్థాపన చేశారు. ఉత్తరాస్పల్లి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, ముట్పూర్లో బ్రిడ్జి నిర్మాణాలకు శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేయించారు. రేగడిచిల్కమర్రి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి, కొందుర్గు మండల కేంద్రంలో సిసి రోడ్లకు శంకుస్థాపన, విశ్వనాథ్పూర్ గ్రామంలో సిసి రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలకు శంకుస్థాపన, ఆగిర్యాల గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆదనపు గదుల నిర్మాణాలకు, బిటి రోడ్డు, సిసి రోడ్లకు శంకుస్థాపన ఎమ్మెల్యే చేశారు. కాసులాబాద్ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు, జాకారం గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, రావిర్యాలలో వీర సముద్రం నుండి చెగిరెడ్డి ఘనపూర్ వరకు మట్టి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గుర్రంపల్లి గ్రామంలో చెరువులకు మరమ్మత్తులకు, చౌదరిగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లకు, బోయగూడలో పద్మారం నుండి బోయగూడ వరకు బిటి రోడ్డు (1.43కోట్లతో) నిర్మాణానికి, తూంపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణాలకు, లచ్చంపేటలో సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సహాయ సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరేందర్, కాంగ్రెస్ నేతలు పురుషోత్తంరెడ్డి, జితేందర్రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మెన్ దామోదర్రెడ్డిలతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఫ్యూచర్ సిటీ రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలో తక్కళ్ళపల్లి గేటు నుండి మేడిపల్లి మీదుగా ఫ్యూచర్సిటీకి వేస్తున్న రోడ్డు పనులను శనివారం రైతులు అడ్డుకున్నారు. అసైన్మెంటు భూములకు చెందిన రైతుల భూముల్లో రోడ్డు వేస్తున్నారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా, జివో లేకుండా రోడ్డు పనులను ఎలా చేస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఫార్మా ఉద్యమ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 మీటర్ల వెడల్పుతో ఈ రోడ్డు పనులను చేస్తున్నారు. హైద్రాబాద్ గ్రీన్ ఫార్మాసిటి ఎస్ఐ వంశీ, పోలీస్ సిబ్బంది అక్కడి వెళ్ళి రైతులతో మాట్లాడారు. అర్డిఒ స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోర్టులో ఈ భూమలపై కేసులు ఉన్నా అధికారులు ఇష్టారాజ్యంగా రోడ్డు వేడల్పు పనులు చేస్తున్నారని తెలిపారు. తక్షణమే రోడ్డు పనులకు ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చెస్తామని హెచ్చరించారు.

# చదువుతోపాటు నైపుణ్యంపై అవగాహన



తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డి

**ప్రజాపక్షం/కొత్తూరు:** విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యంపై అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతి వనంలో ఇండియా స్కిల్స్ 2025–2026రీజనల్ కాంపిటీషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు స్కిల్ డెవలప్మెంట్పై అవగాహన పొంది ఉండాలని, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగు రోజు పాటు నిర్వహించే కాంపిటీషన్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్ష్యద్వీప్ మొత్తం ఐదు రాష్ట్రాల నుండే కాకుండా రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 63 విభాగాల్లో 350మంది విద్యార్థులు తమ ప్రతిభలో పోటీ పడనున్నట్లు వివరించారు. దేశంలో 65శాతం యువత ఉన్నారని, ఇండియా యువతలో స్కిల్స్ చూసి మిగతా దేశాలు ఆశ్యర్యపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఎకనామి పెంచాలంటే ఉన్నత విద్యతోపాటు నైపుణ్యంతోనే సాధ్యమవుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని సూచించారు. దేశ ప్రధాని నరేంద్రమోడి చెప్పిన విధంగానే 2030వరకు ఇండియాలో స్కిల్ డెవలప్మెంట్ వల్ల 20లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయని వివరించారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని భవిష్యత్ను బంగారు మయం చేసుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి జయంత్ చౌదరి హాజరు కానున్నట్లు తెలిపారు.

## నవజాత శిశువు మృతి కేసులో బాధ్యులపై చర్యలు



జిల్లా వైద్యారోగ్యశాఖ డిఎంహెచ్ఒ లలితదేవి

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రిలో నవజాత శిశువు మృతి చేందిన కేసులో భాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితదేవి అన్నారు. శనవారం యాచారం మండల కేంద్రంలోని అసుపత్రిని ఆమె సందర్శించారు. నవజాత శిశువు మృతి చెందిన విషయాలు వైద్యులను అడిగి తెలసుకున్నారు. మల్కిజ్గూడ గ్రామానికి చేందిన నానకంపేట కళ్యాణి నిండు గర్భిణి కావడంతో ప్రసవం కోసం యాచారం మండల కేంద్రంలోని అసుపత్రికి 19న సాయంత్రం వచ్చారు. ప్రసవం నొప్పులు రావడంతో డెలివరీ చేయడానికి వైద్యులు ప్రయత్నించారు. డెలీవరిలో మగ బిడ్డ మృతి చెందిందని భాధితులు తెలిపారు. ఈ విషయమై మండల వైద్యాధికారిణిని అడుగగా మగబిడ్డ బరువు ఎక్కువగా ఉండడం వల్ల తల్లి ప్రాణాలను కాపాడడానికి తమ వైద్యబృదం ప్రయత్నం చేశారని అన్నారు. స్కానింగ్లో తప్పడు రిపోర్టు వచ్చిందని తెలిపారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గ్రామస్తులు అసుపత్రిలో ఆందోళనకు దిగారు. అధికారులకు వినతి పత్రం అందజేశారు. అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శిశువు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సాగర్ రహదారిపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శిశువు మృతికి కారణం తెలుసుకోని పైఅధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్టి డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ ప్రసన్న లక్ష్మి ,స్టేట్ ఆఫీస్ నుండి డాక్టర్ సుమిత్రా, డిసిఎస్హెచ్ఎస్ డాక్టర్ అనురాగిణి రెడ్డి, అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవిన్, డాక్టర్ రాజ్యలక్ష్మి , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచ్ల పాత్ర కీలకం

నూతన సర్పంచ్ల శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామాభివృద్ధిలో సర్పంచ్ల పాత్ర అత్యంత కీలకమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామ పంచాయతీ పరిధిలోని స్వర్ణ భరత్ ట్రస్ట్ ప్రాంగణంలో జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని అబ్దుల్లాపూర్మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల్, యాచారంతోపాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలానికి చెందిన నూతన సర్పంచ్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణా ముగింపు కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి హాజరై సర్పంచ్లను ఉద్దేశించి వారి బాధ్యతలు విధులు గురించి వివరించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన సర్పంచ్లకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ)వి సురేష్ మోహన్ మాట్లాడుతూ పంచాయతీ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, ఉపాధి హామీ పథకం అమలు తదితర అంశాలపై కొత్త సర్పంచ్లకు సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా జనన, మరణాల నమోదు చేయడం, ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణ, గ్రామ పాలనకు సంబంధించి అన్ని విషయాలను కొత్త పాలకవర్గాలకు సమగ్ర అవగాహన కల్పించినట్లు సురేష్ మోహన్ పేర్కొన్నారు. ఇట్టి శిక్షణలో ముగ్గురు టిఒటిలు ఇద్దరు డిఎల్ పిఒలు, ఇద్దరూ ఎంపిడిఒ లతోపాటు ఇద్దరూ ఎంపిఒలు, ఒక ఇజిఎస్ ఇసి, మరొక టిఎలు సర్పంచుల శిక్షణను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగియగా, పాల్గొన్న సర్పంచ్లు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

## ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్కుమార్రెడ్డి

**ప్రజాపక్షం/ఫరూఖ్నగర్:** వినియోగదారుల విశ్వాసంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్కుమార్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని కేశంపేట రోడ్డులో నిర్వాహకుడు రాజేష్కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్, మాజీ సర్పంచులు ప్రశాంత్రెడ్డి, యారం శేఖర్రెడ్డి, రంగయ్య గౌడ్, బిఆర్ఎస్ నేత మధుసూదన్రెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీశైలం యాదవ్, అంజి, శివలు పాల్గొన్నారు. యువత వ్యాపార రంగంలో అభివృద్ధి సాధిస్తేనే ఆర్థికంగా ముందుకు వెళ్లెందుకు అవకాశం ఉంటుందని షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

## ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కేశంపేట:** ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థానిక సర్పంచ్ శంకుస్థాపన చేశారు. శనివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య లబ్దిదారులతో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, ఇందిరమ్మ కమిటి సభ్యులు చెవేళ్ల నరసింహులు, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, వార్డు సభ్యుడు సురేష్, శివానంద్, ప్రవీణ్, రవిలు పాల్గొన్నారు.



## మాతృభాష గొప్పతనాన్ని మరువొద్దు

ప్రజాపక్షం/చర్లపల్లి: మాతృభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ప్రధానోపాధ్యాయురాలు బి. అరుణాదేవి అన్నారు. తెలుగునాడు సమితి ఆధ్వర్యంలో కుషాయిగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో అరుణాదేవి,తెలుగు సమితి అధ్యక్షులు గుమ్మడి హరిప్రసాద్‌లు మాట్లాడుతూ తెలుగునేలపై ఉన్న ప్రతి ఒక్కరూ తెలుగు నేర్చుకోవాలని,తెలుగులోనే మాట్లాడాలని తద్వారా తెలుగు వికసించాలని కోరారు. సమితి ప్రధాన కార్యదర్శి ఎం రాంబాబు, రోజారమణిలు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు వీరేశలింగం, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



## ఈటల రాజేందర్‌ను కలిసిన డబుల్ బెడ్‌రూమ్ వాసులు

ప్రజాపక్షం/దుండిగల్‌:దుండిగల్ గండిమైసమ్మ వద్ద డబల్ బెడ్రూమ్ వాసులు కలెక్టర్ కార్యాలయం నుండి ఎంక్వయిరీ అని చెప్పి కొంతమంది వచ్చి మీ పేరు మీద వేరే దగ్గర ప్లాట్ ఉన్నాయని, కరెంటు మీటర్, కార్లు ఉన్నాయని వచ్చిన ఇల్లు రద్దు అవుతాయని నోటీసులు ఇస్తున్నారని ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారని దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి సమస్యను ఎంపి ఈటల రాజేందర్ కు వివరించారు. డబుల్ బెడ్‌రూమ్ తప్ప వేరే ఇల్లు ఎలాంటి ఆస్తులు లేవనీ తమ బాధలు ఎంపికు వివరించారు. దీనిపైన ఎంపి ఈటల రాజేందర్ కలెక్టర్ కు వెంటనే ఫోన్‌చేసి మాట్లాడి తక్షణ సమస్య పరిష్కరిస్తానని అన్నారు. మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కేటాయించి మూడు సంవత్సరాలు గడిచింది. మూడు సంవత్సరాల నుండి ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు కడుతున్నారని ప్రజలను భయబ్రాంతులకు గురిచేసి వారిని తనపై తిప్పుకోవాలనే ఆలోచనతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనీ ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న నాటకం అని తప్పుపట్టారు. గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ గాని ప్రస్తుతానికి ఉన్న కాంగ్రెస్ పార్టీ గాని అక్కడ ఇల్లు వచ్చిందని సంతోషపడాల్నా వసతులు సరిగ్గా లేక నానా అవస్థలు పడుతున్న మంచినీరు లేదు డ్రైనేజీ వ్యవస్థ లేదు స్ట్రీట్ లైటింగ్ లేదు షాపు కేటాయింపు లేవు కానీ నోటీసులు ఇస్తూ ప్రజలను భయబ్రాంతులకు గురి చేయడం అన్యాయమని అన్నారు. ప్రధాన కార్యదర్శి తురాయి భాను గౌడ్, విష్ణు, సాయి కృష్ణ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే వివేకానంద్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద గల సంస్కృతి హై స్కూల్ నందు మల్లారెడ్డి హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సంస్కృతి హై స్కూల్ యాజమాన్యానికి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సభ్యులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల్ రాజ్, కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఆజం, మెట్ల శ్రీను, త్రివేణి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బి. అంజనేయులు, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ జాదవ్, సిహెచ్ నరసింహులు, ఎస్.ఆర్.భాషా, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందం, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజాపక్షం/చర్లపల్లి: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ నవీన్‌కుమార్ అన్నారు.శనివారం చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రమాణీకులు,సిబ్బందికి ఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ రాకేష్,ఏఎస్ఐ అనిల్‌కుమార్,శ్రీనివాస్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# గిగ్ వర్కర్లకు ప్రత్యేక చట్టాలు తేవాలి

### ఎంపి కిరణ్‌కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : గిగ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి అన్ని హక్కులు పొందేలా ప్రత్యేక చట్టాలను తీసుకొని రావాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేసారు. తెలంగాణా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గిగ్ వర్కర్ న్యాయ్ అభియాన్ సమావేశానికి ఎంపితో పాటు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో ఇన్‌చార్జి కె.ఆర్ భవ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిగ్ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమాలతో పాటు పిఎఫ్, Rఎస్ఐ, పెన్షన్ వంటి హక్కులను కల్పించాలన్నారు. మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాకు చెందిన 50 మంది గిగ్ వర్కర్లతో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలివ్వనున్నామని తెలిపారు.

## వివాదాస్పద పార్కు స్థలాన్ని పరిశీలించిన హైకోర్టు కమిషన్ అడ్వొకేట్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మల్లాపూర్ డివిజన్‌లోని బాబానగర్ ప్రాంతంలో ఉన్న పార్కు స్థలంలో నిర్మాణాలపై తలెత్తిన వివాదాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం హైకోర్టు కమిషన్ అడ్వకేట్ జగదీశ్వరరావు హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులతో కల్సి క్షేత్ర పరిశీలన చేసారు. వివరాలిలా ఉన్నాయి. బాబానగర్ పార్కుకు చెందిన 3వేల గజాల స్థలంలోని 1000 గజాల స్థలాన్ని ప్లాట్లుగా చేసిన బొట్ల సాయిలు నకలీ పత్రాలను సృష్టించి కొంతమందికి విక్రయించాడు. ఈ విషయం తెలియని ప్లాట్లను కొన్న వారంతా ఇళ్లను నిర్మించుకొని కుటుంబాలతో నివసిస్తున్నారు. పార్కు స్థలాన్ని విక్రయించిన కేసులు నమోదవటంతో బొట్ల సాయిలు అరెస్టు సైతం అయ్యాడు.

గత కొద్ది కాలంగా కబ్జాదారులు పార్కుకు చెందిన స్థలాన్ని సైతం అమ్మేందుకు యత్నిస్తున్న విషయాన్ని స్థానికుల ద్వారా ఫిర్యాదు అందుకొన్న హైడ్రా అధికారులు గత వారం ఇక్కడికి వచ్చి పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకొని మరోసారి కబ్జా కాకుండా ప్రహరీ గోడ నిర్మించి ప్రభుత్వ స్థలం అంటూ నోటీసు బోర్డులను ఏర్పాటు చేసారు. ఈ క్రమంలో తమకు తెలియకుండా కబ్జాదారుల నుండి కొనుగోలు చేసిన నివాసితులు ఈ స్థలంపై తమకే పూర్తి హక్కులుంటాయంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన హైకోర్టు క్షేత్రస్థాయి చేసి సమగ్రమైన నివేదిక సమర్పించాలన్న ఆదేశాలతో హైకోర్టు కమిషన్ అడ్వకేట్ జగదీశ్వరరావు పార్కు స్థలంతో పాటు నిర్మాణాలను పరిశీలించారు, హైడ్రా ఎసిపి తిరుమల్, ఇనస్పెక్టర్ సైదులు, జిహెచ్ఎంసి నాచారం సర్కిల్ డిప్యూటి కమిషనర్ నిత్యానంద్, టిపిఎస్ రాంచందర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## కామ్రేడ్ నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి వర్ధంతి

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: రైతాంగ సాయుధ పోరాట నాయకుడు, 1962లో నకిరేకల్ శాసనసభ నియోజకవర్గం కమ్యూనిస్ట్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, సాయుధ పోరాటంలో ఉరిశిక్ష ఖరారై చివరి క్షణాల్లో రద్దైన 12మందిలో ఒకరయిన కామ్రేడ్ నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ విద్యార్థి వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని దళ కమాండర్ స్థాయికి ఎదిగారని, నిజాంకు వ్యతిరేకంగా పని చేసి జైలుశిక్షను కూడా అనుభవించారని, జైలు నుంచి తప్పించుకుని వచ్చి అజ్ఞాత జీవితం గడుపుతూ వందలాది మందికి శిక్షణ ఇచ్చి నాయకులుగా తయారుచేసి, చిలుకూరు, భువనగిరి, వరంగల్, ఖమ్మంలో జరిగిన ఆంధ్ర మహాసభలలో పాల్గొన్నారన్నారు. తనకు వారసత్వంగా సంక్రమించిన 900ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు.

## తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు

ప్రజాపక్షం/బోంరాస్‌పేట్:కొడంగల్ నియోజకరవ్గంలోని బొంరాస్‌పేట్ మండల పరిధిలోని గడ్డ తండాలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన పాఠశాల ప్రాధానోపాధ్యాయులు గోపాల్. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడంకోసం సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రాయడం నైపుణ్యం, సంఖ్యానైపుణ్యం వంటి విషయాలపై అలాగే తల్లిదండ్రుల సహకారంతో పిల్లల అభ్యసనాన్ని మెరుగుపరిచే చర్యలు తీసుకోవడంతోపాటు ఇంటివద్ద అభ్యాస పర్యవేక్షణ విధానం పిల్లలపై సానుకుల ప్రోత్సాహం అంశాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## బిజెపి ప్రజా ప్రతినిధులను అడ్డుకున్న పోలీసులు

### *ఎంపి ఈటల హౌస్ అరెస్టు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : కామారెడ్డి కాంగ్రెస్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిల మధ్య జరిగిన రాజకీ య ఉద్రిక్తతలతో వారిని పరామర్శించేందుకు మంగళవారం కామారెడ్డి బయలు దేరిన ప్రజా ప్రతినిధులను మార్గమధ్యంలో మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిలను మేడ్చల్ పోలీసులు మేడ్చల్ అంబేడ్కర్ విగ్రహం వరకు చేరుకోగానే వారిని అడ్డుకొన్నారు. దీంతో ఎమ్మెల్యే తదితరులు రోడ్డుపై బైఠాయించి ముఖ్యమంత్రి రేవంత్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని, త్వరలోనే దీని పర్యవసానాలు ఉంటాయని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోపక్క మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను శామీర్‌పేటలోని ఆయన నివాసం వద్ద పెద్ద సంఖ్యలో చేరిన పోలీసులు హౌస్ అరెస్టు చేసారు. మేడ్చల్ ఎసిపి శంకర్‌రెడ్డి నేతృత్వంలో చేరుకొన్న పోలీసులు ఆయన బయటకు వెళ్లకుండా అడ్డుకొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ముందస్తు చర్యగా ఈ ఏర్పాట్లు చేసామని ఎసిపి తెలిపారు. ఎంపి ఈటల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరి, పోలీసుల తీరు సరైంది కాదని విమర్శిస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## పోలీస్ భారీ బందోబస్తు మధ్య తొలగించిన అక్రమ నిర్మాణాలు





ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ గండిమైసమ్మ మండలం పరిధిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను పోలీసు బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేతలు చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు జెసిబి సహాయంతో కూల్చివేతలు చేపట్టారు. కబ్జాదారులు బరితెగిస్తూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి కబ్జా కు గురైనట్లు తేల్చారు, ఇరిగేషన్ డీ.ఈ జైపాల్, దుండిగల్ మండల తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయ క్, సిఐ సతీష్ ఫీర్జాదికుంట, బాబాకాన్ చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను ఎసిపి శ్రీనివాస్, ఇరిగేషన్ ఎఇ రవి, ఆర్.ఐ రజనీకాంత్ పోలీస్ భారీ బందోబస్తు నడుమ తొలగించారు. నిర్మాణాలు చేపడితే ఉపేక్షించబోమని నిర్మాణాలు తొలగిస్తామని చర్యలు తప్పవని ప్రభుత్వ భూములు, కుంటలు చెరువులు కాపాడుతామని అధికారులు తెలిపారు.

## మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/పరిగి : మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్మన్ హనుమంతు, కౌన్సిలర్లుతో కలిసి బాధ్యత స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పరిగి మున్సిపల్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామని ప్రజలకు ఏ సమస్య ఉన్నా దగ్గరుండి తీర్చే బాధ్యత తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మున్సిపల్ అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెలే మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు పనిచేయాలని ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా పరిగి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని రాబోయే రోజుల్లో మరిన్ని విధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రికి మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య స్వాగతం

ప్రజాపక్షం/వికారాబాద్:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనంతగిరిలో జరుగుతున్న డిసిసి అధ్యక్షుల శిక్షణా శిబిరం కార్యక్రమంలో పాల్గొనడానికి వికారాబాద్ వచ్చేసిన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రాష్టంలో పిన్న వయస్సులోనే మున్సిపల్ చైర్మన్ ఎన్నికైన అనన్య కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొని వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజురు చేయాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్,అదనపు కలెక్టర్‌కు కృతజ్ఞతలు

ప్రజాపక్షం/చర్లపల్లి: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యేందుకు సహకరించిన మేడ్చల్ మల్కాజ్‌గిరిజిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డిలను ఆలయ ట్రస్టు చైర్మన్ తటాకం వెంకటేష్‌శర్మ, ఇఒ కట్టా సుధాకర్‌రెడ్డి లను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



## విద్యార్థులకు పరీక్షల కిట్ పంపిణీ

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అలీ తలాబ్ చెరువు వద్ద ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో శనివారం క్షత్రియ యూత్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు పరీక్షల కిట్ (జామెట్రీ బాక్స్, ప్యాడ్, కలములు) అందజేశారు. ఈ సందర్భంగా తాజా, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజలలో విప్లవ బీజాలు నాటి ప్రజలను చైతన్యపరిచి స్వతంత్ర సంగ్రామంలో పాల్గొనేలా చైతన్యపరిచిన మహానుభావుడని కొనియాడారు. ఆయన జీవితం ఎంతోమందికి ఆదర్శప్రాయం అని, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన గొప్ప వ్యక్తి అని, ఆయన అడుగుజాడలలో యువత నడవాలని అన్నారు. విద్యార్థులు ఈ చక్కటి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఉన్నతశిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి మరింత మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ నిమ్మల జితేంద్ర వారి సిబ్బంది, క్షత్రియ సేవ సమితి ప్రెసిడెంట్ సుధీర్‌వర్మ, వైస్ ప్రెసిడెంట్ సురేష్‌వర్మ, జాయింట్ సెక్రటరీ చైతన్య వర్మ, క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు రవితేజవర్మ, యశ్వంత్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

## లాల్ బహదూర్ స్మారక యువజన సంఘం అధ్యక్షుడిగా బ్రహ్మాం

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : లాల్ బహదూర్ స్మారక యువజన సంఘం 73 వసంతాలు పూర్తి చేసుకొని 74వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా సంఘం కార్యాలయంలో అధ్యక్షులు సి బ్రహ్మాం అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశామని నూతన అధ్యక్షులు బ్రహ్మాం తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ కోవ యాదగిరి,శంకర్, హనుమంతు, కోటేశ్వర్‌రావు, జనరల్ సెక్రెటరీ బచ్చు నాగేష్ గుప్తా,వర్కింగ్ ప్రెసిడెంట్ డి రఘు,ట్రెజరర్‌గా సుధాకర్ గౌడ్,సెక్రెటరీ జైపాల్ రెడ్డి,అర్జున్,రామ్మోహన్,ఆర్గనైజేషన్ సెక్రెటరీ కుమార్ స్వామి,రమేష్ గౌడ్, భాస్కర్, నరసింహలను నూతన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బ్రహ్మాం మాట్లాడుతూ ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకొని ఇప్పటికీ 73 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామని పెద్దల సహాయ సహకారాలతో లాల్ బహదూర్ స్మారక యువజన సంఘం సభ్యుల తరఫున ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు స్మశాన వాటికలకు ప్రహరీ గోడలు, వాష్ రూమ్‌లు ప్రజలకు ఉండడానికి పెద్ద హాలు నిర్మించామని ఇలాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసినందుకు మా అందరికీ చాలా ఆనందంగా ఉందని బహ్మాం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రామ్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండారి దాస్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



## ఘనంగా పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రింగ్ బస్తీ అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొలుకుల జైహింద్, పాపిరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాపయ్యగౌడ్, సింగిరెడ్డి మల్లారెడ్డి, వెంకటేష్, యాదగిరి, శ్రావణ్, సుభాష్‌గౌడ్, శ్రీనివాస్, రాఘవేందర్, సునీల్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ రాజకీయ శక్తితోనే సబ్బండ వర్గాలకు న్యాయం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు




ప్రజాపక్షం/సోమాజిగూడ: సబ్బండ వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సామాజిక న్యాయం రావాలంటే కేవలం ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ద్వారానే సాధ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు సమాన వాటా దక్కాల్సిందేనన్నారు. పరిపాలన ఒకరి సొత్తు కాదని, పరిపాలన విభజన జరగాలని పేర్కొన్నారు. ఒక సిద్ధాంతం, నాయకత్వం, కార్యాచరణతో ముందుకెళ్తే దేన్నైనా సాధించవచ్చన్నారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో "ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమా?" అనే అంశంపై తెలంగాణ రాజకీయ కూటమి అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా కూటమి సెక్రటరీ జనరల్, మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్ కుమార్ ( లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు), వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల ప్రదీప్‌గౌడ్ (మహాజన సేన పార్టీ అధ్యక్షులు) , కన్వీనర్‌లు రమావత్ లాలు నాయక్ (బహుజన రాజ్యం పార్టీ అధ్యక్షులుగా), కొలిశెట్టి శివకుమార్ (యుగ తులసి పార్టీ) బి. అశోక్ (ఎంటిఆర్‌ఎస్ పార్టీ), డేవిడ్ అండ్రియడ్ (ఇండియన్ సెక్యులర్ పార్టీ), మహమ్మద్ షకీల్ (ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీ), శేషగిరి (ఆధార్ పార్టీ)లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కపిలవాయి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత అవసరాన్ని తీర్చాలన్నారు. జాబ్‌మేళా, లోన్‌మేళా వంటి అవగాహన కల్పిస్తూ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు.వినోద్‌కుమార్ మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, మహిళా సిఎంలు చేయటమే తెలంగాణ రాజకీయ కూటమి లక్ష్యమని ఆ దిశగా ఉద్యమిస్తామన్నారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, రిజర్వేషన్లలో క్రీమీలేయర్ తప్పనిసరి చేయాలన్నారు సమావేశంలో ప్రొఫెసర్ లక్ష్మణ్, అడ్వకేట్ శరత్‌కుమార్, తొలి వెలుగు జర్నలిస్టు రఘు, సీనియర్ జర్నలిస్టు తెలంగాణ విఠల్, ఇబిసి సంఘం అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
22-02-2026
www.prajapaksham.in

సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద స్టడీ కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. ఈ సినిమా సక్సెస్ ఫుల్ గా సెకండ వీక్‌లోకి అడుగుపెట్టింది. ఇటీవల రెబల్ స్టార్ ప్రభాస్ 'కపుల్ ఫ్రెండ్లీ' టీమ్‌తో చేసిన ఇంటర్వ్యూ బాగా వైరల్ అయ్యింది. ఈ సినిమా గురించి తన రెస్పాన్స్ తెలియజేస్తూ ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు ప్రభాస్.

రీల్

# స్వయంభు, నాగబంధం



బ్యూటిఫుల్, టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్ కు ఈ సమ్మర్ ఎంతో స్పెషల్ గా ఉండబోతోంది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు స్వయంభు, నాగబంధం ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతున్నాయి. భిన్నమైన కథా నేపథ్యాలతో తెరకెక్కిన ఈ రెండు చిత్రాల్లో నభా డిఫరెంట్ రోల్స్ లో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. నాగబంధం చిత్రంలో పార్వతి క్యారెక్టర్ లో, స్వయంభు చిత్రంలో సుందరవల్లి అనే యువరాణి పాత్రలో ఆమె నటిస్తోంది.ఈ రెండు చిత్రాలతో ఆమె సాలిడ్‌లైనప్ చేసుకుందని చెప్పుకోవచ్చు. స్వయంభు, నాగబంధం చిత్రాల్లోని కంటెంట్ ఆడియెన్స్ కు రీచ్ అయితే తనకు చాలా మంచి గుర్తింపు వస్తుందని నభా నటేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రెండు చిత్రాల విజయాల పట్ల, తన క్యారెక్టర్స్ కు రాబోయే రెస్పాన్స్ పట్ల నభా నటేష్ కాన్ఫిడెంట్ గా ఉన్నాని చెప్పారు . ఇప్పటికే స్వయంభు, నాగబంధం చిత్రాల టీజర్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. ఇలా ఒక యంగ్ హీరోయిన్ నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు సమ్మర్ రిలీజ్ కు వస్తుండటం విశేషంగా చెప్పుకోవచ్చు.

# త్రిగుణ్ హీరోగా సినిమా షురూ



లక్కీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్ వన్‌గా 'ఆకర్షిత' చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిగాయి. త్రిగుణ్ హీరోగా నటించనున్నారు. ఈ మూవీలో రాజ్ కుమార్ కసిరెడ్డి, అదుర్స్ రఘు, సత్యం రాజేష్, రవివర్మ, ప్రియా ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ సినిమాకి సూరిశెట్టి కిషోర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని కోరి సందీప్ యాదవ్, శ్రీకాంత్ బట్టు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీకి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ షేక్ హాజరత్ (వలి) కెమెరామెన్‌గా పని చేయనున్నారు. ఈ పూజా కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి, వేణు స్వామి, ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్, సి. కళ్యాణ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.శనివారం జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ముహూర్తపు సన్నివేశానికి సి. కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ప్రముఖ జ్యోతిష్య నిపుణులు వేణు స్వామి స్క్రిప్ట్ ను అందజేశారు. బీవీ ఆప్కో కీర్తనలు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నటి ప్రియ చిత్రానికి సంబంధించిన 'ఆకర్షిత' టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో త్రిగుణ్, కసిరెడ్డి, సత్యం రాజేష్, అదుర్స్ రఘు, రవివర్మ, ప్రియా పాల్గొని సందడి చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో..హీరో త్రిగుణ్ మాట్లాడుతూ'లక్కీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద కొత్త దర్శకుడు కిషోర్ మంచి కథతో సినిమాని తీస్తున్నారు. ఈ మూవీని సందీప్, శ్రీకాంత్ నిర్మిస్తున్నారు. వీరందరికీ ఇది మొదటి చిత్రం. మంచి సినిమాతో మేమంతా రాబోతోన్నాం అన్నారు. నటి ప్రియ మాట్లాడుతూ లక్కీ ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం 'ఆకర్షిత'. సందీప్, శ్రీకాంత్ నిర్మాణంలో కిషోర్ తెరకెక్కిస్తున్న 'ఆకర్షిత' చిత్రం అందరినీ ఆకర్షిస్తుందని నమ్ముతున్నాను. మళ్లీ సక్సెస్ మీట్‌లో కలుద్దాం'ని అన్నారు.కసిరెడ్డి రాజ్ కుమార్ , దర్శకుడు సూరిశెట్టి కిషోర్ నిర్మాత సందీప్ యాదవ్ , సినిమాటోగ్రాఫర్ షేక్ హాజరత్ అలీ పాల్గొన్నారు

# 'కిల్లర్' టీజర్ రిలీజ్



జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సినిమా 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆ శీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , ప ద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నా రు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా టీజర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చే శారు.అనంతరం డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'కిల్లర్' మూవీ టీజర్ రి లీజ్ చేయడం హ్యాపీగా ఉంది. టీజర్ చాలా బాగుంది. డిఫరెంట్ జానర్ లో ఈ సి ని మాను తెరకెక్కించారు. సై ఫై థ్రిల్లర్ జానర్స్ కలిపి ఈ సినిమాను బాగా రూపొందించారు. కాంబినేషన్స్ అన్నీ వెరైటీగా ఉన్నాయి. గ్రా ండ్‌గా సినిమాను నిర్మించారు.జ్యోతిని ఎన్నో సీరియల్స్ లో చూశాం. ఇప్పుడు ఈ మూవీలో ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్ షాకింగ్ గా ఉంది. యాక్షన్ బాగా చేశారు. రి యల్ లైఫ్ లో భార్య భర్తలు ఈ రీల్ లైఫ్ లో ఎలా చేశారు అనేది ఆసక్తికరంగా ఉందిఅన్నారు.

# 'నేను రెడీ' షూటింగ్ పూర్తి



హీరో హవిష్, త్రినాధ రావు నక్కినతో కలసి చేస్తున్న 'నేను రెడీ'. సినిమా షూటింగ్ పూర్తయింది. నిఖిల కొనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. రామోజీ ఫిలిం సిటీలో క్లైమాక్స్ షూట్ చేశారు. దీంతో షూటింగ్ పూర్తి అయింది. ఈ సినిమా త్రినాధ రావు నక్కిన మార్క్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా 'నేను రెడీ' ని సిద్ధం చేస్తున్నారు. హీరో హవిష్ కెరీర్ లో నేను రెడీ అద్భుతమైన ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ గా ఉండబోతోంది. షూటింగ్ పూర్తి కావడంతో త్వరలోనే మేకర్స్ ప్రమోషన్స్ చేయనున్నారు. ఈ సినిమాలో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, శ్రీలక్ష్మి , జిటివి గణేష్, రోహిణి, హరితేజ నటిస్తున్నారు. మిక్కీ జె మేయర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు . నిజార్ షఫీ డీవోపీగా, ప్రవీణ్ పూడి ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకులు ముందుకు రాబోతుంది.

# గాడ్స్ అండ్ సోల్జర్స్



రఫ్ నోట్ ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తున్న తమిళ–తెలుగు ద్విభాషా చిత్రం 'గాడ్స్ అండ్‌సోల్జర్స్' ప్రధాన చిత్రీకరణ పూర్తయింది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం విభిన్న ప్రదేశాల్లో విస్తృతంగా షూటింగ్ జరుపుకుంది. ప్రస్తుతం చిత్రబృందం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. ఈ చిత్రంలో ఆరి అరుజునన్ తొలిసారి పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్ తరుణ్ ఈ చిత్రంతో తమిళంలో అడుగుపెడుతున్నారు. భరత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అమూ అభిరామి, కిశోర్ ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో కనిపించనున్నారు.ప్రత్యేక ఆకర్షణగా స్వతంత్ర సంగీత కళాకారుడు వేధన్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. తన ప్రత్యేక గాత్రం, సామాజిక అంశాలపై ఆధారిత గీతాలతో యువతలో గుర్తింపు పొందిన వేధన్ పాల్గొనడం ద్వారా చిత్రానికి సాంస్కృతిక, సంగీత పరమైన ప్రత్యేకత కలగనుంది. ప్రస్తుతం ఎడిటింగ్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సౌండ్ డిజైన్, విజువల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రం యాక్షన్, భావోద్వేగం, సామాజిక అంశాల సమ్మేళనంగా తమిళ, తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతోంది. త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నారు.

# 47ఏళ్ల తరువాత కలిసి నటిస్తున్న రజనీకాంత్, కమల్‌హాసన్



ఇండియన్ సినిమా లెజెండ్స్ గా కోట్లాది మంది ప్రేక్షకుల ప్రేమను సంపాదించుకున్నారు రజనీకాంత్, కమల్ హాసన్. వీరు కలిసి నటించే సినిమా కోసం అభిమానులు, సినీ ప్రియులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఆ మోస్ట్ అవేటెడ్ సినిమాను మన ముందుకు తీసుకురాబోతోంది ప్రెస్టీజియస్ బ్యానర్ రెడ్ జెయింట్ మూవీస్. 47 ఏళ్ల తర్వాత రజనీకాంత్, కమల్ హాసన్ కాంబోలో భారీ పాన్ వరల్డ్ మూవీని నిర్మిస్తోంది సంస్థ. 'KHxRK'వర్కింగ్ టైటిల్ తో ఈ అరుదైన చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ అనౌన్స్ చేసింది. టాలెంటెడ్‌డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.70వ దశకంలో రజనీకాంత్, కమల్ హాసన్ కలిసి నటించారు. ఆ తర్వాత తమదైన పంథాలో వెళ్తూ భారతీయ సినీ చరిత్రలో సువర్ణాధ్యాయాలు లిఖించారు. తమ సుదీర్ఘ సినీ ప్రస్థానంలో దిగ్గజాలుగా ఎదిగారు. ఈ లెజెండ్స్ కలిసి నటించేందుకు ముందుకు రావడం ఒక చారిత్రక ఘట్టంగా చెప్పుకోవచ్చు. రజనీకాంత్, కమల్ హాసన్ కలిసి నటించే చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో చిరకాలం గుర్తుండిపోయే గొప్ప కథతో నిర్మించేందుకు సన్నద్ధమవుతోంది.ఈ సందర్భంగా రెడ్ జెయింట్ మూవీస్ ప్రతినిధి మాట్లాడుతూ రజనీకాంత్, కమల్ హాసన్ లాంటి ఇద్దరు లెజెండ్స్ తో సినిమా నిర్మించే అవకాశం రావడం మా సంస్థ కల నిజమైన అనుభూతి కలుగుతోంది. 47 ఏళ్ల తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాల కాంబినేషన్ లో సినిమా నిర్మించడం గర్వంగా, గౌరవంగా భావిస్తున్నాం. ఇండియన్ సినిమాకు ఇదొక హిస్టారిక్ మూవ్ మెంట్. ఈ ప్రతిష్టాత్మక సినిమా నిర్మాణాన్ని ఎంతో బాధ్యతగా తీసుకుంటున్నాం. కే హెచ్ ఎక్స్ ఆర్ కే సినిమాతో ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నాం. అన్నారు. రవిచందర్ సంగీతాన్ని అందించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే మేకర్స్ తెలియజేయనున్నారు.

# నేడు టిజిసెట్ 2026 పరీక్ష

## 1,82,061 మంది విద్యార్థులు 492 పరీక్షా కేంద్రాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులు గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించి టిజి సెట్ –2026 ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నారు. ఈ పరీక్షకు 1,82,061 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా రాష్ట్రవ్యాప్తంగా 492 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా మరియు సక్రమంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు టిజి సెట్ చీఫ్ కన్వీనర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటి కార్యదర్శి ఎస్. కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఈ పరీక్ష రాయనున్న విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని వేలాది మంది టిజిసెట్ –2026 పరీక్ష రాయడం ఆనందదాయకం, గర్వకారణమని పేర్కొన్నారు. గురుకుల సంస్థలు అందిస్తున్న నాణ్యమైన, విలువల ఆధారిత విద్యపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను పరీక్షకు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్ష రాయాలని, తమ ప్రతిభను పూర్తి స్థాయిలో ప్రదర్శించాలని చీఫ్ కన్వీనర్ ఆకాంక్షించారు.

# మహాత్మ జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మ జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి 2026 ఫిబ్రవరి సెషన్‌కు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు సమర్పించాలని పేర్కొన్నారు. జిఓ నెం. 10 బిసిడబ్ల్యూ (బి) శాఖ గత సంవత్సరం సెప్టెంబర్ 27 వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ పథకం క్రింద లబ్దిదారుల సంఖ్యను సంవత్సరానికి 300 నుండి 700 పెంచడం జరిగిందన్నారు. ఇందులో 500 బిసిలకు, ఈబిసిలకు 200 చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. స్ప్రింగ్, పాల్ సెషన్‌కు 250 మంది బిసిలకు 100 ఈబిసిలకు కేటాయించబడిందన్నారు

# గర్జించిన భారత్..

(మొదటి పేజీ తరువాయి)

శతకంతో.. జెమీమా రోడ్రిగ్స్(59) విధ్వంసంతో ఆతిథ్య జట్టు బౌలర్లు నీరుగారిపోయారు. భారీ ఛేదనలో ఆస్ట్రేలియాను శ్రేయాంక పాటిల్(0322) ఆదిలోనే దెబ్బకొట్టింది. గత మ్యాచ్‌లో చెలరేగిన జార్జియా వోల్(10) ను తను ఔట్ చేయగా ఫొబె లిచ్‌ఫీల్డ్26)ను శ్రీ చరణి వెనక్కి పంపింది. అష్లీ గార్డ్‌నర్(57) హాఫ్ సెంచరీతో పోరాడినా శ్రీచరణి(332), అరుంధతి రెడ్డి(235)లు వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. ఆఖర్లో అనాబెల్ సథర్‌లాండ14)ను వెనక్కి పంపిన చరణి ఆసీస్ ఓటమిని పరిపూర్ణం చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టుకు ఇది రెండో టీ20 సిరీస్ విజయం. మెరుపు అర్ధ శతకంతో టీమిండియా గెలుపులో కీలకమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది.

సెంచరీ భాగస్వామ్యంతో..

తొలుత కంగారూ బౌలర్లకు ఓపెనర్ స్మృతి మంధాన(82), జెమీమా రోడ్రిగ్స్(59) చుక్కలు చూపించారు. 19 పరుగులకే షఫాలీ వర్మ(7)ను ఔట్ చేసిన ఆసీస్ బౌలర్ల ఆనందాన్ని ఆవిరి చేస్తూ మంధాన, జెమీమా క్రీజులో పాతుకుపోయారు. మంధాన బౌండరీలతో చెలరేగగా.. జెమీమా క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించింగింది. అనుభవజ్ఞులైన ఈ ఇద్దరూ ఆసీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా స్కోర్‌బోర్డును ఉరికించారు. రెండో వికెట్‌కు సెంచరీ (121 పరుగులు) భాగస్వామ్యంతో భారీ స్కోర్‌కు బాటలు వేశారు. మంధాన ఔటయ్యాక బ్యాటింగ్ ఆర్డర్లో ముందొచ్చిన రీచా ఘోష్(18) తన స్టయిల్ ఆటతో రెచ్చిపోగా భారత్ 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది.

# 'స్మార్ట్' వ్యవసాయం


సాంకేతికతను జోడిస్తున్న అధికారులు
రైతుల ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యం: వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ రంగంలో సమాచార సాంకేతికత తోడవ్వడంతో 'స్మార్ట్' వ్యవసాయంగా మారుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వ్యవసాయ శాఖను డిజిటలైజ్ చేయడంతో విత్తనం నుంచి పంట విక్రయం వరకు ప్రతి దశలోనూ రైతులకు అండగా నిలుస్తుందని వ్యవసాయ శాఖ తెలిపింది. అవినీతికి తావులేని పాలన, దళారీల రహిత మార్కెటింగ్, శాస్త్రీయ సాగు పద్ధతులే డిజిటల్ సేవల వెన్నెముక అని తెలిపింది. 'రైతు భరోసా'పేరుతో సంవత్సరానికి ఎకరాకు రూ 12వేల చొప్పున), కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం కిసాన్ పథకాల ద్వారా సంవత్సరానికి ఎకరాకు రూ 6వేల చొప్పున మూడు విడతలలో రైతులకు ఆర్థిక ఊతాన్నిస్తున్నాయని , ఈ డబ్బులు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలలో జమ అవుతుందని వ్యవసాయ శాఖ తెలిపింది. రైతు కుటుంబంలో రైతు మరణించినప్పుడు ఆ కుటుంబం రోడ్డున పడకుండా, సామాజిక, ఆర్థిక భద్రత కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల్లోపు రూ 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. ఈ ప్రక్రియ మొత్తం డిజిటల్ విధానంలోనే జరుగుతుంది. రైతుల రుణ విముక్తికి రుణమాఫీ ప్రక్రియలో కూడా రాష్ట్ర వ్యవసాయ శాఖ డిబిటి విధానాన్ని ఉపయోగించింది. దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ 'యూరియా'ను కొనుగోలు చేసేందుకు 'యాప్'ను రూపొందించింది. వ్యవసాయ విస్తీర్ణాధికారి (ఎఇఒ) ప్రతి సీజన్‌లో గ్రామాల వారీగా, సర్వే నంబర్ల వారీగా పంట వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తారు.తద్వారా పంట విస్తీర్ణం అంచనాలు కచ్చితంగా తెలుస్తాయి.



రైతుల ఆదాయం పెంచడమే వ్యవసాయ శాఖ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి తెలిపారు. డిజిటల్ విధానాలతో పారదర్శకతను,వేగాన్ని తీసుకొచ్చామని, ప్రతి పథకం అర్హులైన రైతులకు నేరుగా అందేలా వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1600 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ విధానం ఏర్పాటు చేసి, ప్రతి మంగళవారం రోజున రైతులు నేరుగా వారి పంట పొలాల్లో ఎదురవుతున్న సమస్యలకు వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా పరిష్కారాన్ని చూపుతున్నామన్నారు.

**మూడు రోజుల్లో రూ.5 లక్షలు వచ్చాయ్ ..**



నా భర్త పేరుతో ఏడు గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. గత ఏడాది డిసెంబర్ 24న ప్రమాదవ శాత్తు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే, జనవరి 18న వ్యవసాయ విస్తీర్ణాధికారికి బీమాకు సంబంధించి దరఖాస్తు చేశాను. కేవలం మూడు రోజుల్లో నా బ్యాంక్ ఖాతాలో ఐదు లక్షల రూపాయలు జమ చేశారు. ('వడ్ల వసంత,భర్త వడ్ల రాజు, కోమటి పల్లి గ్రామం రామాయంపేట మండలం, మెదక్ జిల్లా )

**కనీస మద్దతు ధర అందింది:**



మూడు ఎకరాల్లో వరి, రెండున్నర ఎకరాల్లో పత్తి పంట వేశాను. ఈ వివరాలు వ్యవసాయ విస్తీర్ణాధికారి డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేశారు. కొనుగోలు సెంటర్‌లో వరిని, కిసాన్ కపాస్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని పత్తిని అమ్మి ,కనీసం మద్దతు ధర పొందాను.( సింధం లక్ష్మీ నారాయణ ,తండ్రి పేరు రాములు, గ్రామం చెన్నారం, వర్ధన్నపేట మండలం, వరంగల్ జిల్లా )

**సులువుగా యూరియాను పొందాను..**

నాకు 4.10 ఎకరాలలో వరి పంట వేశాను. ఈ పంటకు కావలసిన యూరియాను ఇంటి వద్ద నుండి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా 9 బ్యాగులను బుక్ చేశాను. అతి సులువుగా యూరియా పొందాను (ఈరు మల్ల రవి, తండ్రి బీరయ్య, గ్రామం సిసి పల్లి కోహెడ మండలం ,సిద్దిపేట జిల్లా ).

# లష్కరే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

హైసెక్యూరిటీ జోన్ అయిన ఎర్రకోట సమీపంలో పేలుడు ముప్పు గురించి భద్రతా సంస్థలు హెచ్చరిక జారీ చేశాయి. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఒక ఆలయం ఉగ్రవాదుల లక్ష్యాలలో ఉండవచ్చని నిర్దిష్ట సమాచారం సూచించిందని వర్గాలు తెలిపాయి. నిఘా వర్గాల సమాచారం ధృవీకరించబడి అంచనా వేయబడుతున్నప్పటికీ, సున్నితమైన మతపరమైన ప్రదేశాలు, రద్దీగా ఉండే ప్రజా ప్రాంతాలలో భద్రతను పెంచినట్లు వారు తెలిపారు. ఐఇడి ఆధారిత దాడికి ప్రయత్నించవచ్చని నిఘా సంస్థలు సూచించాయి. ఈనెల 6న పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారం తీర్చుకోవడానికి ఉగ్రవాద సంస్థ చేసిన ప్రయత్నాలతో ఈ ప్రణాళిక ముడిపడి ఉందని వర్గాలు తెలిపాయి. కేంద్ర సంస్థలు, ఢిల్లీ పోలీసు విభాగాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ సిసిటివి పర్యవేక్షణ, వాహన తనిఖీలు, దుర్బల ప్రదేశాలలో అదనపు సిబ్బందిని మోహరించడం ద్వారా నిఘాను ముమ్మరం చేశాయి. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు, క్విక్ రియాక్షన్ బృందాలను కూడా వ్యూహాత్మక ప్రదేశాలలో సిద్ధంగా ఉంచినట్లు వారు తెలిపారు. అదేవిధంగా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఏదైనా అనుమానాస్పద వస్తువులు లేదా కార్యకలాపాల గురించి తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు. అయితే, ఈ విషయంపై ప్రజలు ఎటువంటి భయాందోళన అవసరం లేదని, ఈ చర్యలు ముందస్తు జాగ్రత్తలుగా అధికారులు పేర్కొన్నారు.

ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు

ఇదిలా ఉండగా, గతేడాది నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 సమీపంలో పేలుడు పదార్థాలతో నిండి ఉన్న కారు పేలి దాదాపు 13 మంది మరణించారు. 20 మందికి పైగా గాయపడ్డారు. కాగా, పేలుడు ఘటనతో దేశ రాజధాని ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పేలుడు దాటికి అక్కడే పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు కాలిబూడిదయ్యాయి. అయితే, ఆ దాడికి సంబంధించి ఈనెల 13న పాటియాలా హౌస్ కోర్టులోని ప్రత్యేక ఎన్‌ఐఎ కోర్టు ఆ కేసును మరో 45 రోజులపాటు పొడిగించింది. కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తు పూర్తి చేయడానికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) 90 రోజుల పొడిగింపు కావాలని కోరింది. అనంతరం ఏడుగురు నిందితుల జ్యుడీషియల్ కస్టడీని మార్చి 13 వరకు పొడిగించింది.

కశ్మీర్, పంజాబ్‌లో ఐఇడి గుర్తింపు

దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రదాదులకు లష్కరే తోయిబా కుట్ర చేసిందన్న నిఘావర్గాల హెచ్చరికల వేళ పంజాబ్, జమ్ముకశ్మీర్‌లలో రెండు ఐఇడిలను గుర్తించడం తీవ్ర కలకలం రేపింది. అమృత్‌సర్‌లోని రయ్యా పోలీస్ పోస్టు సమీపంలో ఓ అనుమానాస్పద బ్యాగ్‌ను గుర్తించిన పోలీసులు అందులో తనిఖీ చేయగా ఐఇడి కనిపించింది. వెంటనే బాంబు నిర్వీర్య బృందాలను రప్పించిన పోలీసులు ఐఇడిని డిఫ్యూజ్ చేయించారు. కశ్మీర్‌లోని సఫపోరా ప్రాంతంలో ఓ రోడ్డు పక్కన పారవేసిన బ్యాగ్‌ను తనిఖీ చేయగా ఇంప్రవైజ్డ్ పేలుడు పరికరం లభ్యమైందని పోలీసులు తెలిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న బాంబ్ స్క్వాడ్ బృందం దాన్ని నిర్వీర్యం చేసిందని వెల్లడించారు. కాగా జమ్మూకశ్మీర్‌లో ఈ వారంలో ఐఈడీలను గుర్తించడం ఇది మూడో సారి. ఈ ఐఇడిలకు ఢిల్లీలో ఉగ్రదాడి కుట్రలకు లింకులు లేవని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు.

# ఎసిబి సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. మహబూబ్‌నగర్ ఏసిబి డిఎస్‌పి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏకకాలంలో ఆయన ఇంటితోపాటు బంధువుల ఇండ్లలో కూడా సోదాలు చేశారు. ఆయన భాగస్వామ్యంగా ఉన్న నేరేడుచర్ల పట్టణంలో ఆయన కుటుంబ సభ్యులు భాగస్వామ్యంగా ఉన్న అవని రైస్ మిల్లుతోపాటు అనంతగిరి మండలంలోని అమీనాబాద్, సూర్యాపేట పట్టణం, రంగారెడ్డి జిల్లా తుక్కగూడలో ఆయన అద్దెకు ఉంటున్న ఇండ్లలో, కోదాడ, ఆయన పనిచేస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో సోదాలు జరుగుతున్నాయి. అధికారులు అధికారికంగా ప్రకటించకున్నా వందల ఎకరాల వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు, భవనాలు, నగదు, బంగారం, వాహనాలు బయటపడట్లు సమాచారం. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ఏసిబి డిఎస్‌పి జగదీష్ చంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దేశానికి అగ్నిపరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

కేవలం 18 రోజులు వేచి ఉంటే భారత రైతు లు వేదన, బాధ నుండి రక్షించబడి ఉండేవారని, భారత సార్వభౌమత్వాన్ని కాపాడుకునేవారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం అమెరికా సుప్రీంకోర్టు సుంకా ల విధానాన్ని కొట్టివేసిన తర్వాత, అధ్యక్షుడు ట్రం ప్ మాట్లాడుతూ భారత ప్రధాని మోదీ గొప్ప స్నేహితుడు, భారత్–అమెరికా వాణి జ్య ఒప్పందం ప్రకటించిన విధంగా కొనసాగుతుందని ప్రకటించారని, భారతదేశం ఆపరేషన్ సిందూర్‌ను ఆపకపోతే అమెరికాకు భారత ఎగుమతులపై సుంకాలను పెంచుతామ ని బెదిరించడం ద్వారా మే 10, 2025న ఆపరేషన్ సిందూర్‌ను ఆయన స్వయంగా నిలిపివేశారు' అని రమేష్ ఎక్స్ వేదికపై వెల్లడించా రు. కాగా, ఈనెల 2న భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు చేయబడిందని ట్రంప్ మొదట ప్రకటించారు. ప్రధానమంత్రి మోదీ పట్ల స్నేహం, గౌరవం కారణంగా, ఆయన అభ్యర్థన మేరకు వెం టనే అమలులోకి వచ్చేలా తాము అమెరికా, భారతదేశం మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకరించామని ట్రంప్ చెప్పిన విషయాన్ని రమేష్ గుర్తు చేశారు. అయితే ధ్యక్షుడు ట్రంప్ భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించేలా ప్రధానమంత్రి మోదీని బలవంతం చేసింది ఏమిటి అని ప్రశ్నించారు. ఆ మధ్యాహ్నం లోక్‌సభలో మిస్టర్ మోదీ అంత నిరాశకు గురై వైట్‌హౌస్‌లోని తన మంచి స్నేహితుడిని సంప్రదించి మళ్లింపును సృష్టించేలా చేసింది ఏమిటిన్నారు. ఐఇఇపిఎ (అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం, 1977) కింద సుంకాలు విధించే అధ్యక్షుడి అధికారాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సుర్జేవాలా స్పందిస్తూ 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122 కింద 10 శాతం అదనపు సుంకాలను విధిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారన్నారు. ఈ కొత్త సుంకాలు ఇప్పటికీ యుఎస్, భారతదేశ వాణిజ్య ఒప్పందాన్ని (ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం) కొనసాగిస్తాయా, దీనిని రైతులు, చిన్న, మధ్యతరహా వ్యాపారాలు, ఇంధన, డేటా నిపుణులు, ఆర్థికవేత్తలు విస్తృతంగా వ్యతిరేకిస్తున్నారని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఏకపక్ష యుఎస్, భారతదేశ వాణిజ్య ఒప్పందం నుండి వైదొలగడానికి ధైర్యం చూపిస్తుందా అని సుర్జేవాలా నిలదీశారు. దేశం 'ఇంధన భద్రత'ను నిర్ధారించే ఉద్దేశంతో చౌకైన రష్యన్, ఇరానియన్ ముడి చమురును కొనుగోలు చేస్తామని మోదీ ప్రభుత్వం ఇప్పుడు జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రకటిస్తుందా అని కూడా ఆయన అడిగారు. రానున్న ఐదేళ్లలో సున్నా సుంకంపై 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ వస్తువులను (రూ. 45 లక్షల కోట్లు) దిగుమతి చేసుకోవాల్సిన బాధ్యత లేదని మోదీ ప్రభుత్వం ఇప్పుడు ప్రకటిస్తుందా, తద్వారా భారతీయ తయారీదారులు, పరిశ్రమలను కాపాడుతుందా? భారతదేశ డేటా, డిజిటల్ భద్రతను కాపాడతామని మోదీ ప్రభుత్వం హామీ ఇస్తుందా?' అని ఆయన ప్రశ్నించారు. ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, అమెరికాకు దిగుమతి చేసుకునే వస్తువులపై 150 రోజుల పాటు తాత్కాలిక దిగుమతి సర్‌ఛార్జ్ 10 శాతం యాడ్ వాలోరెమ్ విధిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇది సుంకం రేటును 18 శాతం నుండి 10 శాతానికి తగ్గిస్తుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com